www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోషల్ మీడియా పిల్లలకు దూరం

నిషేధిస్తూ చట్టం తీసుకొచ్చే యోచనలో ఆస్ట్రేలియా



పిల్లలు మైదానాల్లో ఆడుకుంటే చూడాలని ఉందన్న ప్రధాని ఆంథోని

ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న డిజిటల్ హక్కుల కార్యకర్తలు

2

బుధవారం | 11-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 147 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 11.47 తదుపరి నవమి; నక్షత్రం: జ్యేష్ఠ రా. 9.22 తదుపరి మూల; వర్జ్యం: తె. 5.32 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 11.47-12.35; అమృతఘడియలు: మ. 12.05-1.46; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.16 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వరద నుంచి ఊరట



బెజవాడలో కాలనీలన్నీ వరద నుంచి బయటపడుతున్నాయి. పాయకాపురం, కండ్రిక కూడలిలో రోడ్డుపై ఇంకా నిలిచి ఉన్న నీటిని మోటర్లతో తోడుతున్న దృశ్యమిది!

గండికి కట్టడి

సీనియర్ ఐఏఎస్ అధికారుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకూ వేల మంది ఎంతో శ్రమకోర్చి పనిచేశారు. వారందరికీ చేతులెత్తి మొక్కుతున్నా. మీడియా కూడా మా శ్రమకు తోడుగా నిలిచింది. వారికీ ధన్యవాదాలు. - చంద్రబాబు



బుడమేరు గండ్లు పూడ్చి, గట్లను మరింత పటిష్ఠపరుస్తున్న ప్రాంతాన్ని మంగళవారం మంత్రి నిమ్మలతో కలిసి పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆపరేషన్ బెజవాడ!

పనులు కొలిక్కి.. 10 రోజుల తర్వాత ఇంటికి బాబు

- బుడమేరు గండ్లను సందర్శించిన సీఎం
- తిరిగొచ్చి కలెక్టరేట్‌లో అధికారులతో భేటీ
- అక్కడి నుంచి ఉండవల్లి నివాసానికి..
- సాధారణ స్థితికి చేరుతున్న విజయవాడ
- చివరి దశలో బుడమేరు గట్ల ఎత్తు పెంపు పనులు
- వరద ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆహార పంపిణీ
- నేటితో ముగియనున్న ఎన్యుమరేషన్ నమోదు
- రిపేరు బైకులతో మెకానిక్ షాపులు కిటకిట
- బెజవాడలో ఒక్కో షాపు వద్ద వందల వాహనాలు

అమరావతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన వరదల్లో ముంపు బాధితులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం యుద్ధం స్థాయిలో చేసిన పోరాటం ఒక కొలిక్కి వచ్చింది. అత్యధిక భాగం నగరంలో క్రమంగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. సహాయ కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించడానికి గత పది రోజులుగా విజయవాడ కలెక్టరేట్‌లో మకాం వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం రాత్రి తన ఇంటికి తిరిగి వెళ్లారు. అంతకుముందు.. సాయంత్రం బుడమేరు గండ్లు పూడ్చిన ప్రాంతాన్ని చంద్రబాబు పరిశీలించారు. గండ్లను విజయవంతంగా పూడ్చిన అధికారులకు సీపేజీ పెద్ద సవాలుగా మారింది. ఆ పనులు కూడా మంగళవారం సాయంత్రానికి 95 శాతం పూర్తయ్యాయి. దీనిపై అధికారుల నుంచి చంద్రబాబు సమాచారం తీసుకున్నారు. గండ్లు పూడ్చిన ప్రాంతంలో గంటకు పైగా ఆయన

మిగతా 11వ పేజీలో...

విపక్షంలోకి వచ్చినా.. కుట్రలు మానలేదు

వైసీపీది జాతి ద్రోహం

- దాని తప్పుడు పనులకు లక్షల మంది నాశనం
- బుడమేరును గాలికొదిలి అందరినీ ముంచేశారు
- వరదల్లో ఇనుప బోట్లు వదిలి ప్రకాశం బ్యారేజీ ధ్వంసానికి యత్నం
- ఇవన్నీ బయటపడేసరికి దుష్ప్రచారం
- నేరగాళ్లను వదిలిపెట్టేది లేదు
- యంత్రాంగం నిర్విరామంగా పనిచేసింది
- ఐఏఎస్‌ల నుంచి కార్మికుల వరకూ ఎంతో శ్రమకోర్చి పనిచేశారు
- వారందరికీ చేతులెత్తి మొక్కుతున్నా
- వరదలపై యుద్ధంలో గెలిచాం.. కానీ నష్టం వెంటాడుతోంది 11
- త్వరలో ఆపరేషన్ బుడమేరు: ముఖ్యమంత్రి

ఆశలన్నీ కేంద్రంపైనే!

- నేడు, రేపు వరద ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన
- కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో నష్టం అంచనా
- రెండు బృందాలుగా జిల్లాలకు.. రెండు రోజుల పరిశీలన
- నేటికల్లా గృహ నష్టం అంచనా పూర్తి కావాలి 2
- కలెక్టర్లకు ఆర్పీ సిసోడియా ఆదేశాలు

జల్లెడ పడతాం

కాల్వలు, చెరువుల ఆక్రమణలపై సమగ్ర సర్వే

- సీఎం ఆదేశాల మేరకు ప్రత్యేక చొరవ
- ఆక్రమణల తొలగింపునకు చట్ట ప్రకారమే చర్యలు 11
- అవసరమైతే కొత్త చట్టం తెస్తాం
- మంత్రి నారాయణ

కకావికలం

ఏలేరు విలయం

కాకినాడ జిల్లాలోని 62 గ్రామాలు జలదిగ్బంధం



కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో ఏలేరు కాల్వకు గండి పడి నీట మునిగిన రాజుపాలెం గ్రామం

నీట మునిగిన నివాసాలు

- కాలువలకు గండ్లతో 45 వేల ఎకరాల్లో పంటలు ధ్వంసం
- కొట్టుకుపోయిన కోళ్లఫారాలు ఇటుక బట్టీలు, గడ్డివాములు
- పిఠాపురం-గొల్లప్రోలు హైవేపైకి భారీగా వరద.. రాకపోకలు బంద్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఏలేరుకు పోటెత్తిన వరదతో కాకినాడ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఉన్న 62 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఏలేరు రిజర్వాయరుకు అత్యంత భారీగా వరద వస్తుండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదిలేస్తుండడంతో ముంపు అధికంగా ఉంది. దీంతో జిల్లాలో ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లోని ఏడు మండలాలు నీటమునిగాయి. ఏకంగా 62 గ్రామాల్లో ఇళ్లు నీటమునిగి ప్రజలు విలవిల్లాడుతున్నారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి సమీపంలో ఏలేరు కాల్వకు గండి పడడంతో గ్రామం మొత్తం పీకల్లోతు వరదలో

మిగతా 10వ పేజీలో...

ఉగ్ర గోదారి



పోలవరం స్పిల్‌వే వద్ద గోదావరి ప్రవాహం

10

- ఏజెన్సీని చుట్టుముడుతున్న వరద
- చింతూరు మండలంలో.. 22 గ్రామాలకు తెగిన సంబంధాలు
- 30 గ్రామాలకు రాకపోకలు బంద్
- కుక్కునూరు, వేలేరుపాడుల్లో 34 గ్రామాల పరిసరాల్లోకి వరద
- తరలివెళ్లిన కలెక్టర్, అధికారులు
- భద్రాచలం వద్ద రెండో హెచ్చరిక
- సముద్రంలోకి 10 లక్షల క్యూసెక్కులు



ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ నేటి నుంచే

- బుకింగ్ కోసం ఏపీ శాండ్ పోర్టల్ ఏర్పాటు
- పోర్టల్ నిర్వాహకులకు ఓవైపు శిక్షణ.. మరోవైపు బుకింగ్‌లు
- ఇసుక రవాణా, డెలివరీ పర్యవేక్షణకు ప్రత్యేక విధానం
- ఐదారు రోజుల్లో పూర్తిస్థాయిలో అమలులోకి!
- రవాణా చార్జీలపై కుదరని ఏకాభిప్రాయం
- రాష్ట్రమంతటా ఒకే ధర ఉండేలా త్వరలో విధాన నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉచిత ఇసుక విధానం అమలులో ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వినియోగదారులు ఉచిత ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేలా బుధవారం నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్ ఏర్పాటు చేసింది. ఏపీ శాండ్ పోర్టల్ పేరిట నిర్వహించే సైట్ ప్రస్తుతం పరీక్ష దశలో ఉంది. సైట్ నిర్వాహకులు, ఫిర్యాదులు స్వీకరించేవారికి శిక్షణ కార్యక్రమాలు కొలిక్కి వస్తున్నాయి. పోర్టల్ పరీక్ష దశలోనే బుధవారం నుంచి ఆన్‌లైన్ బుకింగ్ చేపట్టనున్నట్లు

మిగతా 3వ పేజీలో...

గోమాఫియా!

మన్యం నుంచి తడ దాకా అక్రమంగా తరలింపు

ఆ దళారులనూ వదలని పల్నాడు ముఠా

ఎంతో పవిత్రంగా భావించే గోవుకు కష్టమొచ్చింది.. అక్రమంగా రాష్ట్రాలు దాటిస్తున్న ముఠా ధనదాహానికి బలైపోతోంది. మాఫియా చేతుల్లో చిక్కి విలవిల్లాడుతోంది.. వారి ఆట కట్టించేందుకు విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగింది. మన రాష్ట్రంలోని పశు సంపద పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా ఎలా తరలిపోతోంది..? దాని వెనకున్నది ఎవరు..? అక్రమ ఆదాయం ఎన్ని కోట్లు అనే దానిపై కూపీ లాగుతోంది.

- పశువుల వాహనాలు ఆపి వసూళ్లు
- గత ఐదేళ్లుగా భారీ దందా
- మాజీ మంత్రి అనుచరుడిదే కీలక పాత్ర
- గత ఎన్నికల్లో కోట్లు పెట్టి వైసీపీ టికెట్
- ఇప్పుడు అధికార పార్టీలో చేరిక
- అయినా అదే దందా.. కోట్లు ఆర్జన
- ప్రభుత్వానికి ఫిర్యాదుల వెల్లువ
- ఉచ్చు బిగిస్తున్న విజిలెన్స్



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉత్తరాంధ్రలో దళారులు.. పల్నాడులో మాఫియా.. సీమలో పశు మాంస విక్రేతలు.. ముఠాగా ఏర్పడి గోసంపదను కొల్లగొడుతున్నారు. వ్యవసాయ ఆధారిత దేశంలో పాడి సంపద గ్రామీణ రైతుకు ప్రాణాధారం. అటువంటి మూగజీవాలను ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని మానాపురం, పార్వతీపురం పరిసర ప్రాంతాల్లోని సంతలకు తీసుకొచ్చి విక్రయిస్తారు. వ్యవసాయానికి పనికి రాని ఎడ్లు, పాడికి పనికిరాని ఆవులు, గేదెలను.. అక్కడకు వచ్చే దళారులు కొనుగోలు చేసి ఒక్కో వాహనంలో 20 నుంచి 30 పశువులను ఊపిరాడకుండా కుక్కి సుదూర ప్రాంతాలకు తీసుకెళ్తుంటారు. దారి పొడవునా వాహనాన్ని ఆపే వారి చేయి తడుపుతూ హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ వైపు తరలిస్తుంటారు. అక్కడి కబేళాలకు విక్రయించి.. చచ్చిన వాటిని సైతం కోసి మాంసం విక్రయించేస్తారు. మన రాష్ట్రంలో

మిగతా 3వ పేజీలో...



జీపీఎస్ టోల్‌పై గెజిట్ జారీ

- 20 కి.మీ. వరకు రుసుము ఉండదు
- ఆ తర్వాత.. ప్రయాణించిన దూరానికే..
- జీపీఎస్ అనుసంధానానికి టోల్‌గేట్లలోని వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం
- ఇందుకు భారీ వ్యయం..
- టోల్ చార్జీలూ పెరిగే అవకాశం!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: టోల్ ఫీజు వసూళ్ల పద్ధతి ఆధునికీకరణ దిశగా తొలి అడుగుపడింది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల ఫీజు నిబంధనలు 2008లోని 6వ క్లాజును సవరిస్తూ అధికారికంగా గెజిట్ జారీ చేసింది. ఇప్పటి వరకూ మన టోల్ ప్లాజాల్లో ఫాస్టాగ్, ఆటోమాటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్(ఏఎన్‌పీఆర్) పద్ధతుల్లో

మిగతా 2వ పేజీలో...

లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదు!



- ఎన్నికల సంఘం ఇష్టారాజ్యంగా వ్యవహరించింది 2
- ఎన్నికలు సజావుగా జరిగితే బీజేపీకి 240కూడా వచ్చేవి కావు: రాహుల్



శీతాకాలం గజగజే!

- ఉత్తరాదిలో పడిపోనున్న ఉష్ణోగ్రతలు
- నేడు మధ్య భారతంలో వాయుగుండం
- వచ్చేవారం మరో అల్పపీడనం? 3

'హ్యాపీ'నెస్ట్‌కు ఊపిరి!

- టెండర్లు పిలిచిన సీఆర్‌డీఏ.. రూ.930 కోట్లతో అంచనాలు
- జీ ప్లస్ 18 విధానంలో మొత్తం 12 టవర్లు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే లబ్ధిదారుల ఎంపిక
- వైసీపీ ఐదేళ్ల జాప్యంతో అదనంగా రూ.230 కోట్ల భారం
- అదనపు భారాన్ని భరించనున్న చంద్రబాబు ప్రభుత్వం
- సీఆర్‌డీఏ భవనం పూర్తికి రూ.160 కోట్లతో టెండర్లు



విజయవాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు తిరిగి ఊపిరి పోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్(ఆర్‌ఎఫ్‌పీ)ను మంగళవారం విడుదల చేసింది. సవరించిన అంచనాలతో రూ. 930 కోట్ల వ్యయంతో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు టెండర్లు

మిగతా 10వ పేజీలో...



విశాఖ నుంచి మరో వందేభారత్

- విజయనగరం, రాయగడ మీదుగా దుర్గ్‌కు..
- 15వ తేదీ నుంచే ప్రారంభం 2

సీతారాం ఏచూరి ఆరోగ్యం విషమం

సీపీఎం కేంద్ర కమిటీ ప్రకటన 2

జీపీఎస్ టోల్‌పై గెజిట్ జారీ

(మొదటి పేజీ తరువాయి)



ఫీజు వసూలు చేస్తున్నారు. వాటిల్లో ఉన్న లోపాలను అధిగమించడానికి అత్యాధునిక గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(జీఎన్ఎస్ఎస్), గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్)లను వాహనంలో బిగించిన పరికరంతో అనుసంధానించడం ద్వారా టోల్ ఫీజు వసూలు పద్ధతిని ప్రవేశపెట్టింది. దీని వల్ల వాహనదారులు టోల్ రహదారిపై వాస్తవ ప్రయాణ దూరానికి మాత్రమే ఫీజు చెల్లిస్తారు. జీఎన్ఎస్ఎస్ పరికరం లేని, విదేశాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు నిర్దేశిత రుసుము వసూలు చేస్తారని కేంద్రం స్పష్టం చేసింది. అలాగే జీఎన్ఎస్ఎస్ పరికరంతో తిరిగే వాహనాలకు 20 కి.మీ. వరకూ టోల్ ఫీ ఉండదు. ఆపైన తిరిగిన వాస్తవ దూరానికి మాత్రమే టోల్ వసూలు చేస్తారు. పైగా టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం కూడా ఉండదు. అయితే ఈ పద్ధతిని అమలు చేయడంలో ఇబ్బందులు కూడా ఉన్నాయి. 67.7 లక్షల కిలోమీటర్ల రోడ్లతో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రహదారి వ్యవస్థ మన దేశంలో ఉంది. దీనిలో 2024 నవంబరు నాటికి 45,428 కి.మీ. రహదారి టోల్ పరిధిలోకి వస్తుంది. ఫాస్టాగ్ బదులు జీపీఎస్ పద్ధతిని ప్రవేశపెట్టాలంటే ఆయా టోల్ ప్లాజాల్లోని ప్రస్తుత సాంకేతిక వ్యవస్థను పెద్ద ఎత్తున ఆధునీకరించాల్సి ఉంటుంది. అందుకు అయ్యే వ్యయం భారీగానే ఉంటుంది. దీనివల్ల టోల్ చార్జీలు పెరిగే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి జాతీయ రహదారుల సంస్థ ఏడాదికి టోల్ రూపంలో రూ.40,000 కోట్లు వసూలు చేస్తోంది. జీపీఎస్ పద్ధతి పూర్తిగా అమల్లోకి వస్తే రాబోయే రెండు మూడేళ్లలో ఆ ఆదాయం రూ.1,40,000 కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.


పిల్లలు సోషల్ మీడియా వాడకుండా నిషేధం

» చట్టాన్ని తీసుకురావాలని యోచిస్తున్న ఆస్ట్రేలియా



న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: చిన్నపిల్లలు సోషల్ మీడియా వాడకుండా పూర్తిగా నిషేధం విధించాలని ఆస్ట్రేలియా భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా చట్టాన్ని తీసుకురానున్నట్లు ఆ దేశ ప్రధాని ఆంథోని అల్బనీస్ స్వయంగా వెల్లడించారు. సోషల్ మీడియా పిల్లల మానసిక ఆరోగ్యంతో పాటు శారీరకంగానూ దెబ్బతీస్తోందని ఆయన అన్నారు. "పిల్లలు ఫోన్లను వదిలేసి మైదానాల్లో, ఈత కొలనుల్లో, టెన్నిస్ కోర్టుల్లో ఆడుకోవడం చూడాలని ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. తొలుత సోషల్ మీడియా ఖాతాల్లో వయసు ధ్రువీకరణ ఆప్షన్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేసి, ఆ తర్వాత ఈ ఏడాది చివరికల్లా చట్టాన్ని తీసుకువస్తామని ఆయన చెప్పారు. అయితే, ఎంతలోపు వయస్సువారు సోషల్ మీడియా వాడకుండా నిషేధం ఉంటుందనేది ఆయన స్పష్టంగా వెల్లడించారు. 14 ఏళ్ల లేదా 16ఏళ్ల లోపు పిల్లలపై నిషేధం ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఆలోచనను డిజిటల్ హక్కుల కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. ఒక వేళ అలా చట్టం తీసుకువస్తే పిల్లలు ఫోన్లను చాటుగా ఉపయోగిస్తారని, ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.

లోకం తీరు



ఆశలన్నీ కేంద్రంపైనే..!

» నేడు, రేపు వరద ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

» కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో నష్టం అంచనా

» రెండు బృందాలుగా జిల్లాలకు.. రెండు రోజులు పరిశీలన

» నేటికల్లా గృహ నష్టం అంచనా పూర్తి కావాలి: ఆర్‌పీ సిసోడియా

అమరావతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలు సృష్టించిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనుంది. కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో రెండు రోజుల పాటు పర్యటించి వరద నష్టాన్ని అంచనా వేయనుంది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని ఆరుగురు సభ్యులతో కూడిన ఈ బృందం.. రెండు టీమ్‌లుగా విడిపోయి కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పర్యటిస్తుంది. ఇప్పటికే కేంద్రం ఆపన్న కోసం ఎదురు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆశలన్నీ కేంద్ర బృందంపైనే పెట్టుకుంది. కాగా, ఈ పర్యటనకు ముందు ఈ బృందానికి రాష్ట్రంలో జరిగిన వరద నష్టాన్ని వివరించేందుకు తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా నేతృత్వంలో జరిగే ఈ భేటీలో ఆయా శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు పాల్గొంటారు. ఈ సందర్భంగా వరద నష్ట తీవ్రతను సిసోడియా వారికి వివరిస్తారు.

కేంద్ర బృందం పర్యటన వివరాలివి..

కేంద్రం నుంచి వచ్చే అధికారుల్లో ఒక టీమ్ బుధవారం మధ్యాహ్నం 12.30 నుంచి 5.30 వరకు కృష్ణా జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనుంది. రెండో బృందం బాపట్ల జిల్లాలోని కొల్లూరు, వేమూరు, రేపల్లె, చెరుకుపల్లి మండలాల పరిధిలో పర్యటించనుంది. లంక గ్రామాలైన ఈపూరులంక, పెదల్లంకలో పర్యటించి దెబ్బతిన్న ఉద్యాన పంటలను పరిశీలిస్తుంది. కృష్ణా జిల్లాకు సంబంధించి ముస్తాబాద్ రోడ్, గన్నవరం నుంచి హనుమంతపురం రోడ్, గన్నవరం నుంచి బుడమేరు కెనాల్ బ్రిడ్జిలను టీమ్ పరిశీలిస్తుంది. మధ్యాహ్నం గన్నవరం ఎయిర్ పోర్టులో కృష్ణా జిల్లా అధికారులు వరద నష్టంపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. తర్వాత తోట్లవల్లూరు, పెనమలూరు, యనమలకుదురు, పెద్దపులిపాక, చోడవరం, కంకిపాడు మండలంలోని మద్దూరు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు, ఇళ్లు, ఇతర నష్టాన్ని పరిశీలించనున్నారు. గురువారం కేంద్ర బృందం ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించనుంది. ప్రకాశం బ్యారేజీని కూడా సందర్శించనుంది. అక్కడి నుంచి ఇబ్రహీంపట్నం, మైలవరం, బుడమేరు కాలువ, అజిత్ సింగ్ నగర్, అంబాపురం, వాంబేకాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తుంది.

ఎన్యుమరేషన్ యాప్‌లోనే డేటా అప్‌లోడ్: సిసోడియా

వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం నాటికి ఇంటింటి సర్వే పూర్తిచేయాలని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో ఉపయోగిస్తున్న ఎన్యుమరేషన్ యాప్‌లోనే డేటాను అప్‌లోడ్ చేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఏలూరు, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వరద నష్టం అంచనాపై బుధవారం నుంచే కేంద్ర బృందాలు రాష్ట్ర పర్యటన చేస్తాయని, ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు ఎక్కువ మందిని ఏర్పాటు చేసుకొని ఇంటింటి సర్వేను బుధవారానికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా, లంక గ్రామాలకు రవాణా సదుపాయం లేనందున తమకు మరో రోజు సమయం కావాలని కలెక్టర్లు కోరగా సిసోడియా అంగీకరించారు.

అరుణాచల్‌లోకి చైనా సైన్యం చొరబాటు..?

ఇటానగర్, సెప్టెంబరు 10: భారత్‌లోని ఈశాన్య రాష్ట్ర అరుణాచల్‌ప్రదేశ్ తమదే అంటూ తరచూ కయ్యానికి దిగే చైనా.. ఇటీవల ఏకంగా ఆ రాష్ట్రంలోకి అడుగుపెట్టినట్లుగా కూడా తెలుస్తోంది. డ్రాగన్ సైన్యం అరుణాచల్‌లోని అంజా జిల్లాలో 60 కిలోమీటర్ల మేర లోపలకు వచ్చినట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి. కపాపు ప్రాంతంలో కొద్ది రోజుల పాటు మకాం వేసినట్లుగానూ అందులో పేర్కొన్నారు. చైనా సైన్యం మంటలు వేసినట్లు, రాళ్లపై స్ప్రే చేసినట్లు, ఆహారం తిన్నట్లుగా కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. భారత రక్షణ శాఖ ఈ కథనాలను ఖండించింది. సరిహద్దుల్లో గుర్తించని ప్రాంతాల్లో భారత్-చైనా దళాలు పహారా కాస్తాయని, రాళ్లపై చైనా దళాలు వేసినది తాత్కాలిక మార్కింగేనని, ఆక్రమణకు దిగినట్లు కాదని పేర్కొన్నారు.

ప్రపంచంలో ఉత్తమ దేశం స్విట్జర్లాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: ప్రపంచంలో ఉత్తమ దేశంగా స్విట్జర్లాండ్ ఎంపికయింది. యూఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్ సంస్థ 2024 సంవత్సరానికి నిర్వహించిన ఉత్తమ దేశాల ర్యాంకింగ్‌ల్లో ఈ స్థానం లభించింది. ఉత్తమ దేశంగా స్విట్జర్లాండ్ ఎంపిక కావడం వరుసగా ఇది మూడోసారి కావడం విశేషం. ఆ తరువాతి స్థానాల్లో జపాన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలు ఉన్నాయి. భారత్‌కు 33వ స్థానం దక్కింది. గత ఏడాదితో పోల్చితే మూడు ర్యాంకులు తగ్గాయి. మొత్తం 89 దేశాల్లో సర్వే జరిపి ర్యాంకులు ఇచ్చారు. జీవన ప్రమాణాలు, సాహసాలు, వారసత్వం, వ్యాపార దక్షత, సాంస్కృతిక ప్రయోజనం తదితర పది అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రజాభిప్రాయం సేకరించారు. స్విట్జర్లాండ్‌లో జీవన నాణ్యత, వాణిజ్యంలో పారదర్శకత బాగున్నట్టు తేలింది. భారత్ విషయానికి వస్తే 'మూవర్స్', 'వారసత్వం' అంశాల్లో మార్కులు వచ్చాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడి పరిస్థితులకు త్వరగా అలవాటు పడేవారిని 'మూవర్స్'గా నిర్వచించారు.

సీతారాం ఏచూరి ఆరోగ్యం విషమం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దాదాపు పది రోజుల క్రితం ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పార్టీ కేంద్ర కమిటీ మంగళవారం తెలిపింది. డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ గౌరి నేతృత్వంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. ఇన్‌ఫెక్షన్ తొలగించేందుకు ఉపయోగించిన మందులు పనిచేయకపోవడంతో జపాన్ నుంచి ప్రత్యేక మందులు తెప్పిస్తున్నారని సమాచారం. వెంటిలేటర్‌పై ఉన్న సీతారాం ఏచూరి చికిత్సకు స్పందిస్తున్నారని వైద్యులు చెప్పారు.

ఆపరేషన్ భేడియా



ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్ జిల్లాలో కొన్ని నెలలుగా ప్రజలపై దాడులు చేస్తూ 8 మంది మరణానికి కారణమైన తోడేళ్ల గుంపులోని ఐదో తోడేలును అధికారులు మంగళవారం బంధించారు. మరో, ఆఖరి తోడేలు కోసం గాలిస్తున్నారు. తోడేళ్ల దాడుల్లో చనిపోయినవారిలో ఏడుగురు చిన్నారులే.

లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదు!

» ఈసీ ఇష్టారాజ్యంగా వ్యవహరించింది

» భారత్‌లో హక్కుల కోసం ఘర్షణ

» సిక్కులకు తలపాగా ధరించే హక్కు కూడా లేదు

» అమెరికాలో రాహుల్ వ్యాఖ్యలు

» దేశ ప్రతిష్ఠ మంటగలుపుతున్నారు

» ప్రతిపక్ష నేతపై మండిపడ్డ బీజేపీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగి ఉంటే బీజేపీ 240 సీట్లకు దరిదాపుల్లో కూడా వచ్చేది కాదన్నారు. అమెరికాలోని జార్జిటౌన్ యూనివర్సిటీలో మంగళవారం విద్యార్థులతో జరిగిన సమావేశంలో రాహుల్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు 3నెలల ముందు తమ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారన్నారు. ఫలితంగా బీజేపీకి లబ్ధి కలిగిందని, ఎన్నికల సంఘం కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. రెండు మూడు బడా వ్యాపార సంస్థలతో మోదీ ప్రభుత్వం కుమ్మక్కైందన్నారు. ఎన్నికలకు ముందు మోదీ భయాన్ని వ్యాపింపజేశారని.. ఎన్నికల తర్వాత ప్రజలకు భయం పోయిందని అన్నారు. 56 అంగుళాల ఛాతీ, దేవుడితో నేరుగా సంబంధాలు ఉన్నాయని చెప్పుకొన్న మోదీ.. ఎన్నికల తర్వాత నీరుగారిపోయారని ఎద్దేవా చేశారు. తాను మోదీని ద్వేషించనని, ఆయన ఆలోచనా విధానాన్ని వ్యతిరేకిస్తానని రాహుల్ తెలిపారు. భారతదేశంలో రాజకీయాల మధ్య ఘర్షణ జరగడం లేదని, ప్రాథమిక హక్కుల గురించి జరుగుతోందని చెప్పారు. ఒక సిక్కు తన తల పాగా, కడాను ధరించేందుకు అనుమతిస్తారా? అన్న దానిపై వివాదం ఉందని వ్యాఖ్యానించారు. ఇది కేవలం సిక్కులకే కాదని, అన్ని మతాలవారికీ వర్తిస్తుందని అన్నారు.

ఓబీసీ, దళితులకు భాగస్వామ్యం లేదు..

రాజ్యాంగాన్ని పరిరక్షించేవారికి, దాన్ని ధ్వంసం చేసేవారికి మధ్య జరిగిన పోరుగా పేదలు తాజా లోక్‌సభ ఎన్నికలను అర్థం చేసుకున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. కులగణన కూడా ఒక మౌలిక అంశంగా మారిందన్నారు. భారత్ ఒక మంచి దేశంగా మారినప్పుడు రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని తెలిపారు. ఓబీసీ, దళితులకు సమాజంలో భాగస్వామ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంద రూపాయల్లో ఆదివాసీలకు పది, దళితులు, ఓబీసీలకు 5 రూపాయలు మాత్రమే దక్కుతున్నాయన్నారు. అదానీ, అంబానీలకు లభించిన ప్రయోజనాలే అందరికీ దక్కినప్పుడే జనరల్ కేటగిరీలో ఉన్న వారికి లబ్ధి చేకూరుతుందని.. అయితే అందుకు అవసరమైన మార్గాలను మూసేశారని అన్నారు.

యూనియన్ అంటే బీజేపీ ఒప్పుకోదు

రాజ్యాంగంలో భారతదేశం ఒక యూనియన్ అని ఉందని.. బీజేపీ మాత్రం అందుకు ఒప్పుకోదని రాహుల్ చెప్పారు. దేశంలో కొన్ని రాష్ట్రాల కంటే కొన్ని రాష్ట్రాలు తక్కువ అని, కొన్ని భాషల కంటే ఇంకొన్ని భాషలు తక్కువ అని.. కొన్ని మతాల కంటే మరికొన్ని మతాలు గొప్పవని ఆరెస్సెస్ చెబుతోందని ఆరోపించారు. తమిళం, మరాఠీ, బెంగాలీ, మణిపురి.. ఇవన్నీ తక్కువ ప్రమాణాలు కలిగిన భాషలని అంటోందని.. ఆ సంస్థకు భారతదేశం అర్థం కాదని, ఇక్కడే తగువు మొదలవుతుందని రాహుల్ చెప్పారు. దేశంలో ఆర్థిక, సంస్థాగత సర్వేతో పాటు సమగ్ర కులజనగణన జరగాల్సిందేనని పేర్కొన్నారు.

రాహుల్‌వి దేశద్రోహ వ్యాఖ్యలు..

రాహుల్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాల్లో భారతదేశ ప్రతిష్ఠను మంటగలుపుతున్నారని ధ్వజమెత్తారు. సిక్కులను ఇక్కడ తలపాగాలు ధరించేందుకు అనుమతించరన్న రాహుల్ వ్యాఖ్యల్లో నిజం లేదని కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి అన్నారు. తాను ఆరు దశాబ్దాలుగా తలపాగాను ధరిస్తున్నానని చెప్పారు. 1947 తర్వాత తొలిసారి మోదీ హయాంలోనే సిక్కులు సురక్షితంగా ఉన్నారన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం అధికారంలో ఉన్నప్పుడే సిక్కులు అభద్రతతో బతికారని గుర్తుచేశారు. 1984లో సిక్కులను ఊచకోత కోశారని, 3 వేలమంది ప్రాణాలు బలిగొన్నారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన సిక్కుల ఊచకోతను రాహుల్ ఎలా మరిచిపోయారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే సిక్కుల తలపాగాలను తీసి తనిఖీ చేశారని, ఎందరో సిక్కుల గడ్డాలను కత్తిరించారని చెప్పారు. విదేశాల్లో భారత దేశ ప్రతిష్ఠను దిగజార్చడం దేశద్రోహమేనని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

విశాఖ నుంచి మరో వందేభారత్

» విజయనగరం, రాయగడ మీదుగా దుర్గ్‌కు...

» 15వ తేదీ నుంచే ప్రారంభం

విశాఖపట్నం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి ఇప్పటికే మూడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తుండగా.. ఇప్పుడు మరోటి అందుబాటులోకి రానుంది. దేశవ్యాప్తంగా ఈ నెల 15వ తేదీన పది కొత్త వందేభారత్ రైళ్లను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనుండగా, అందులో ఒకటి విశాఖకు కేటాయించారు. విశాఖపట్నం నుంచి దుర్గ్‌కు ఈ సర్వీస్ నడుస్తుంది. 20829/20830 నంబర్లతో నడిచే ఈ రైలు ప్రయాణం 7.55 గంటలు. గురువారాలు వినహా ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు దుర్గ్‌లో బయలుదేరి రాయిపూర్, లఖోలి, మహాసాముండ్, టిట్లాఘర్, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖపట్నానికి మధ్యాహ్నం 1.55 గంటలకు చేరుతుంది. తిరిగి ఇక్కడి నుంచి 20830 నంబరుతో మధ్యాహ్నం 2.50 గంటలకు బయలుదేరి రాత్రి 10.50 గంటలకు దుర్గ్ చేరుకుంటుంది. ఎనిమిది గంటల్లో (సగటున గంటకు 72 కి.మీ.వేగం)గమ్యస్థానం చేరుతుంది. ఈ రైలు ఛత్తీస్‌ఘడ్ ప్రాంతీయులకు బాగా ఉపయోగపడుతుంది.

ఇప్పటికే మూడు రైళ్లు

విశాఖపట్నం నుంచి ప్రస్తుతం మూడు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. మొదట విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య ఒక సర్వీసు ప్రారంభించారు. దీనికి బాగా డిమాండ్ ఉండడంతో రెండువైపులా ఉదయాన్నే ప్రయాణికులు వెళ్లేలా అదనంగా మరో సర్వీసు ప్రారంభించారు. అంటే ఇటు నుంచి ఒకటి, అటు నుంచి ఒకటి గంట తేడాలో బయలుదేరుతాయి. అలాగే రిటర్న్ జర్నీలోను ఇటు, అటు కూడా ఇవి అందుబాటులో ఉన్నాయి. మార్చి నెలలో విశాఖపట్నం-పూరీ మధ్య మరో కొత్త సర్వీసు (20841/20842) అందుబాటులోకి వచ్చింది.

చిక్కుల్లో ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం!

» సర్కారు రద్దుకు బీజేపీ విజ్ఞప్తి

» కేంద్ర హోం శాఖకు సిఫారసు చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: కేజ్రీవాల్ నాయకత్వంలోని ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం చిక్కుల్లో పడింది. ఆప్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ బీజేపీ నేతలు ఇచ్చిన మెమొరాండంను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. కేంద్ర హోం శాఖకు సిఫారసు చేశారు. ఢిల్లీ శాసనసభ ప్రతిపక్ష నేత విజేందర్ గుప్తా నేతృత్వంలోని బీజేపీ ఎమ్మెల్యేల బృందం ఆగస్టు 30న రాష్ట్రపతి ద్రౌపది ముర్మును స్వయంగా కలిసింది. మద్యం కుంభకోణం కేసులో జైలులో ఉన్నప్పటికీ కేజ్రీవాల్ తన సీఎం పదవికి రాజీనామా చేయకపోవడంతో పాలన గాడితప్పి రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొందని రాష్ట్రపతికి తెలియజేసింది. ప్రభుత్వం ఆరో ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేయలేకపోవడం, కాగ్ నివేదికపై స్పందించకపోవడాన్ని ఇందుకు ఉదాహరణలుగా పేర్కొంటూ ఓ మెమొరాండంను అందజేసింది. తమ విజ్ఞప్తిపై స్పందించిన రాష్ట్రపతి.. విషయాన్ని కేంద్ర హోం శాఖకు సిఫారసు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు విజేందర్ గుప్తా సోమవారం ప్రకటించారు. ఈ వ్యవహారంలో బీజేపీ తీరుపై ఆప్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ దొడ్డిదారిలో ప్రభుత్వాన్ని కూల్చాలని కుట్ర చేస్తోందని ఆప్ నేత, రాష్ట్ర మంత్రి అతిషి మంగళవారం ధ్వజమెత్తారు.

ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడి

వాయుసేనలో తన సీనియర్‌పై ఓ మహిళ ఫిర్యాదు.. ఉన్నతాధికారులకు చెబితే తననే వేధించారని వెల్లడి

» శ్రీనగర్‌లో ఘటన.. పోలీసులకు ఫిర్యాదు.. ఎఫ్ఐఆర్ నమోదు

» నిందితుడు వింగ్ కమాండర్.. బాధితురాలు ఫ్లైయింగ్ ఆఫీసర్

శ్రీనగర్, సెప్టెంబరు 10: తన పై అధికారి తన మీద లైంగిక దాడికి పాల్పడ్డాడని వాయుసేనకు చెందిన ఒక మహిళాధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జమ్ము కశ్మీర్‌లోని బుద్గాం పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దర్యాప్తు జరుపుతున్న పోలీసులకు సహకరిస్తున్నామని వాయుసేన అధికార వర్గాలు మంగళవారం వెల్లడించాయి. నిందితుడు వాయుసేనలో వింగ్ కమాండర్ కాగా, బాధితురాలు ఫ్లైయింగ్ ఆఫీసర్.. ఇద్దరూ కశ్మీర్‌లోనే పని చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 31వ తేదీన శ్రీనగర్‌లోని ఆఫీసర్స్ మెస్‌లో కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా.. తన సీనియర్ అయిన వింగ్ కమాండర్.. న్యూ ఇయర్ బహుమతులు తమ ఇంట్లో ఉన్నాయని చెప్పి అక్కడికి తనను తీసుకెళ్లాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ తాను అడ్డుకుంటున్నా వినిపించుకోకుండా తనపై లైంగికదాడికి పాల్పడ్డాడని, ముఖరతి జరిపాడని తెలిపారు. కొన్ని రోజులపాటు తీవ్రమైన మానసిక వేదనకు గురైన అనంతరం ఇద్దరు మహిళా అధికారుల సహకారంతో తమ విభాగంలో ఫిర్యాదు చేశానని, ఒక కర్నల్ స్థాయి అధికారి దీనిపై దర్యాప్తునకు నియమితులయ్యారని పేర్కొన్నారు. దర్యాప్తు సమయంలో నిందితుడిని తన పక్కన కూర్చోబెట్టి తనను ప్రశ్నించేవారని, ఈ విధంగా జరిగిన దర్యాప్తు ఏమీ తేల్చకుండానే ముగిసిందన్నారు. దీంతో తాను అంతర్గత కమిటీకి ఫిర్యాదు చేశానని, ఆ కమిటీ కూడా నిందితుడికి సహకరిస్తున్నట్లుగానే వ్యవహరించింది తప్ప బాధితురాలినైన తనకు అండగా నిలవలేదని వాపోయారు. పలు మార్లు తాను ఒత్తిడి చేస్తేగానీ తనకు వైద్యపరీక్షలు నిర్వహించలేదన్నారు. 'ఈ దారుణ పరిస్థితుల ఉపశమనం కోసం సెలవు అడిగితే ఇచ్చేవారు కాదు. కనీసం వేరే విభాగానికి గానీ, వేరే ప్రాంతానికి గానీ బదిలీ చేయమన్న విజ్ఞప్తిని కూడా పట్టించుకోలేదు. దీంతో, నాపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తితో కలిసి, అతడికి సహకరిస్తున్న అధికారులతో కలిసి రోజూ పని చేయాల్సి వచ్చింది' అని సదరు మహిళా అధికారి తన ఫిర్యాదులో వివరించారు. తనను సామాజికంగా వెలివేసినట్లుగా వ్యవహరించారని, తనతో ఎవరైనా మాట్లాడితే వారిని ఉన్నతాధికారులు వేధించేవారని, దీంతో తనను ఆత్మహత్య ఆలోచనలు చుట్టుముట్టాయని, దైనందిన కార్యకలాపాలన కూడా చేయలేని పరిస్థితికి చేరుకున్నానని బాధితురాలు వెల్లడించారు.

మా డిమాండ్లు నెరవేరేదాకా విధుల్లో చేరం

» సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోని పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్లు


కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ల ర్యాలీ

కోల్‌కతా, సెప్టెంబరు 10: కోల్‌కతాలో హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనల్లో పాల్గొంటున్న వైద్యులందరూ మంగళవారం సాయంత్రం 5గంటల్లోగా విధుల్లో చేరాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను జూనియర్ డాక్టర్లు పక్కన పెట్టారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు, బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. "కోల్‌కతా పోలీస్ కమిషనర్, రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్య సేవల విభాగం డైరెక్టర్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లను తొలగించాలి" అని వారు డిమాండ్ చేశారు. కాగా, ఆర్జీ కర్ కాలేజీ ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకల కేసులో మాజీ ప్రిన్సిపాల్ ఘోష్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ నెల 23వరకు జ్యుడీషియల్ కస్టడీని విధించింది.

నితీశ్ చూపులెటు?

తేజస్వితో తాజాగా భేటీ.. అధికారిక సమావేశమేనన్న సీఎంవో

» రాజకీయంగా తీవ్ర చర్చనీయం



పట్నా, సెప్టెంబరు 10: బిహార్‌లో రాజకీయాలు మరోమారు చర్చనీయాంశమయ్యాయి. జనతాదళ్(యూ) చీఫ్, సీఎం నితీశ్ కుమార్.. బిహార్ అసెంబ్లీలో విపక్ష నాయకుడు, ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్‌తో భేటీ కావడమే ఇందుకు కారణం..! వచ్చే ఏడాది జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు నితీశ్ ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారని, అందుకే తేజస్వీతో భేటీ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. అయితే.. కేవలం సమాచార కమిషనర్ నియామకానికి సంబంధించి వీరిద్దరూ భేటీ అయ్యారని సీఎం కార్యాలయం స్పష్టం చేసింది. సమాచార కమిషనర్ నియామక కమిటీలో విపక్ష నేత కూడా సభ్యుడేనని గుర్తుచేసింది. ఈ భేటీ తర్వాత తేజస్వీయాదవ్ చేసిన వ్యాఖ్యలు.. తాజా చర్చకు దారి తీశాయి. నితీశ్‌తో సమావేశం తర్వాత తేజస్వీ మీడియాతో మాట్లాడుతూ.. "65% రిజర్వేషన్ల అంశంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని నితీశ్ గుర్తుచేయగా.. న్యాయసమీక్షకు అతీతమైన రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో 65% రిజర్వేషన్ల అంశాన్ని చేర్చేలా కృషిచేయాలని నేను కోరాను" అని ఆయన వివరించారు. మంగళవారం సాయంత్రానికి ఈ భేటీ దేశవ్యాప్తంగా ఓ సంచలనం కావడంతో.. తేజస్వీ యాదవ్ మరోమారు మీడియాతో మాట్లాడారు. "నితీశ్‌ను నమ్మేది లేదు. ఆయన వాగ్దానాలపైనా నమ్మకం లేదు. బీజేపీతో చేరినందుకు క్షమాపణలు కోరుతున్నానని పేర్కొంటూ.. మా ఎమ్మెల్యేల ముందు చేతులు జోడించారు. రెండు సార్లు అధికారమిస్తే.. మోసం చేశారు. మరోమారు నితీశ్‌తో పొత్తు పెట్టుకునేది లేదు" అని తేల్చిచెప్పారు. అయితే, అదే సమయంలో నితీశ్ తిరిగి వస్తాడని, అతను తమవాడేనని ఆర్జేడీ నేత వీరేంద్ర విలేకరులతో చెప్పడం సంచలనంగా మారింది. "బీజేపీతో నితీశ్ అసంతృప్తిగా ఉన్నారు. సామ్యవాద భావాలున్న నితీశ్ బీజేపీతో ఉండలేరు" అని వ్యాఖ్యానించారు. దీన్ని జేడీయూ కొట్టిపారేసింది. జేడీయూ ప్రధాన అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ఈ అంశంపై మాట్లాడుతూ.. బీజేపీతో తమ పార్టీకి కెమిస్ట్రీ మెరుగుపడుతోందని వ్యాఖ్యానించారు. తేజస్వీతో నితీశ్ భేటిని ఎక్కువగా ఊహించుకోవద్దన్నారు.

రిజర్వేషన్లపై ఇద్దరిదీ ఒకేమాట?

రిజర్వేషన్ల పెంపుపై జేడీయూ, ఆర్జేడీలది ముందు నుంచి ఒకే మాటగా ఉంది. ఇరు పార్టీల పొత్తుతో ప్రభుత్వం ఉన్నప్పుడే కులగణన ఆలోచనకు బీజం పడింది. కులగణన తర్వాత నితీశ్ ప్రభుత్వం బిహార్‌లో రిజర్వేషన్లను 65శాతానికి పెంచింది. దీన్ని పట్నా హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు నిర్ణయాన్ని తేజస్వీ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. శుక్రవారమే ఈ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది. మరోవైపు, ప్రస్తుతం నితీశ్ జట్టుకట్టిన బీజేపీ కులగణనకు వ్యతిరేకంగా ఉంది. వచ్చే ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

రైలు ప్రమాదాలకు ఉగ్ర కుట్ర?

» అజ్మేర్‌లో రైలు పట్టాలపై సిమెంటు బ్లాక్‌లు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: రాజస్థాన్,ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో రైళ్లను పట్టాలు తప్పించడమే లక్ష్యంగా చోటుచేసుకున్న ఘటనలు కలకలం సృష్టించాయి. ఇది ఉగ్రవాదుల కుట్రేనని అనుమానిస్తున్నారు. మంగళవారం రాజస్థాన్‌లోని అజ్మేర్ జిల్లాలోని పశ్చిమ రవాణా కారిడార్‌లో లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలును పట్టాలు తప్పించే యత్నం జరిగింది. ఈ కారిడార్‌లోని సరధ్న- బంగడ్ మార్గంలో కొందరు దుండగులు రైలు పట్టాలపై రెండు సిమెంటు బ్లాక్‌లు పెట్టారు. ఆదివారం రాత్రి గూడ్స్ రైలు ఆ సిమెంటు బ్లాకులను ఢీకొట్టినప్పటికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ఇక సోమవారం భివానీ-ప్రయాగరాజ్ కళింది ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణించే మార్గంలో కూడా రైల్వే ట్రాక్‌పై ఎల్పీజీ సిలిండర్, ఓ సీసాలో పెట్రోల్, అగ్గిపెట్టెలు పెట్టినట్లు చెప్పారు. ఇక కళింది ఎక్స్‌ప్రెస్ రైలును పట్టాలు తప్పించేందుకు చేసిన యత్నంలో ఉగ్రవాదుల కుట్ర కోణం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ ఘటనకు ఐఎస్ఐఎస్ ఖొరాసన్ మాడ్యూల్‌తో సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. రామేశ్వరం కేఫ్‌లో పేలుళ్ల ఘటన సూత్రధారిగా పేర్కొంటున్న పాక్ ఉగ్రవాది ఫర్హతుల్లా ఘోరీ భారత్‌లో రైలు ప్రమాదాలకు ప్రణాళిక రూపొందించాలంటూ ఆడియో క్లిప్‌లో పిలుపునిచ్చిన వారం రోజులకే ఈ ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. అలాగే ఇటీవల జరిగిన రైలు ప్రమాదాలపైనా ఉగ్ర కుట్ర కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీ పోలీసులు ఇప్పటికే 14 మంది ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులను అరెస్టు చేశారు.

స్టీల్‌ప్లాంటు కార్మికుల రాస్తారోకో.. ఆందోళనకారుల అరెస్ట్



కూర్మన్నపాలెం జంక్షన్‌లో ధర్నా చేస్తున్న స్టీల్ ప్లాంటు కార్మికులు

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని, సొంత గనులు కేటాయించడంతో పాటు నిర్వహణ మూలధనం సమకూర్చాలని డిమాండ్ చేస్తూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ మంగళవారం చేపట్టిన రాస్తారోకో ఉద్రిక్తంగా మారింది. ప్లాంటులో ఉత్పత్తి రోజు రోజుకూ క్షీణిస్తుండడంతో పోరాట కమిటీ రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోకు పిలుపునిచ్చింది. ఈ మేరకు జాతీయ రహదారిపై కూర్మన్నపాలెం జంక్షన్ (స్టీల్‌ప్లాంటు స్వాగత ద్వారం) వద్ద వందలాది మంది కార్మికులు ధర్నా నిర్వహించారు. గంటన్నరలో ముగిస్తామని అనుమతి తీసుకున్న కార్మికులు జాతీయ రహదారిపైకి వచ్చి వాహనాలను అడ్డుకోవడంతో రాకపోకలు స్తంభించాయి. దాంతో పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేసి స్టేషన్లకు తరలించి, సాయంత్రం విడిచిపెట్టారు.

పశ్చిమ బంగ లారీల బంద్‌కు ఏపీ లారీ యజమానుల సంఘం మద్దతు

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబంగ రాష్ట్రంలో ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ ట్రక్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ రోజు నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న లారీల బంద్‌కు ఏపీ లారీ యజమానుల సంఘం మద్దతు ప్రకటించింది. మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ల వేధింపులకు నిరసనగా చేపడుతున్న ఈ బంద్‌కు తాము కూడా మద్దతు తెలుపుతున్నామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 12, 13వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పశ్చిమ బంగకు వెళ్లే అన్ని లారీలనూ నిలుపుదల చేసి తాము కూడా బంద్‌కు సంఘీభావం తెలుపుతామన్నారు.

ప్రత్యేక హోదాపై కేంద్రానికి హైకోర్టు నోటీసులు

- వ్యాజ్యాలను సీజే ముందు ఉంచాలని రిజిస్ట్రీకి ఆదేశం
- కేఏ పాల్ పిల్‌పై హైకోర్టులో విచారణ

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మంగళవారం విచారణ ప్రారంభమైన వెంటనే కేంద్ర ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ ఇదే అంశంపై మరికొన్ని వ్యాజ్యాలు దాఖలయ్యాయని, ప్రస్తుత పిల్‌ను కూడా వాటితో జత చేయాలని కోరారు. దీంతో వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న కేంద్ర హోం, ఆర్థిక శాఖ కార్యదర్శులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీతి ఆయోగ్ చైర్మన్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ప్రస్తుత పిల్‌తోపాటు మిగిలిన వ్యాజ్యాలను ఏ బెంచ్ విచారించాలనే అంశం పై నిర్ణయం తీసుకొనేందుకు అన్నింటినీ సీజే ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. పార్టీ ఇన్ పర్సన్ కేఏ పాల్ ఈ కేసులో వాదనలు వినిపించారు.

టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో బెయిలివ్వండి

- హైకోర్టులో మాజీ ఎంపీ నందిగం సురేశ్ పిటిషన్

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై మూక దాడితో తనకు సంబంధం లేదని... తాను అమాయకుడినని.. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో బెయిల్ కోరుతూ వైసీపీ సానుభూతిపరుడు, కేసులో 83వ నిందితుడిగా ఉన్న అవుతు శ్రీనివాస్‌రెడ్డి కూడా పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా.. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

నేడు జైల్లో సురేశ్‌తో జగన్ ములాఖత్

- బెంగళూరు నుంచి తాడేపల్లి చేరుకున్న మాజీ సీఎం

అమరావతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ గుంటూరు జైలులో మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను బుధవారం కలుసుకోనున్నారు. ఇందుకోసం బెంగళూరు నుంచి మంగళవారమే ఆయన తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు సురేశ్‌తో ములాఖత్ అవుతారు. పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఈవీఎంను ధ్వంసం చేసిన కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కూడా నెల్లూరు జైల్లో జగన్ ములాఖత్‌లో కలిసిన సంగతి తెలిసిందే.

స్కిల్ కేసులో నిందితులకు బెయిల్ సబబే!

- ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించిన 'సుప్రీం'... ఈడీ పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో నిందితులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెయిల్ ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ కేసులో సీమెన్స్ మాజీ ఎండీ సౌమ్యాద్రి శేఖర్ బోస్, పీవీఎస్పీ ఐటీ స్కిల్స్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ముకుల్‌చంద్ర అగర్వాల్, చార్టర్డ్ అకౌంటెంట్ సురేష్ గోయల్‌లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గత ఏడాది అరెస్టు చేసింది. తమను అక్రమంగా అరెస్టు చేశారని, బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆ ముగ్గురూ ఏపీ హైకోర్టును ఆశ్రయించగా.. నిరుడు మే నెలలో వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు తీర్పును ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఇరుపక్షాలను విన్న ధర్మాసనం.. హైకోర్టు బెయిల్ ఇవ్వడం సబబేనని స్పష్టం చేసింది. ఈడీ పిటిషన్‌ను తిరస్కరించింది.

లైంగిక వేధింపుల కేసును కొట్టివేయండి

- హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్యే ఆదిమూలం

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు పాల్పడ్డాననే ఆరోపణలతో తిరుపతి తూర్పు పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ టీడీపీ బహిష్కృత సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి ప్రాథమిక విచారణ చేయకుండా, ఆరోపణల్లో నిజానిజాలు శోధించకుండా పోలీసులు నేరుగా కేసు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. జూలై, ఆగస్టు నెలల్లో ఘటన జరిగిందని వరలక్ష్మి అనే యువతి తన ఫిర్యాదులో తెలిపారనీ, ఇంత ఆలస్యంగా ఫిర్యాదు ఎందుకు చేయాల్సి వచ్చిందో కారణాలు మాత్రం ఆమె పేర్కొనలేదన్నారు. మొత్తం ఘటన ఓ హనీ ట్రాప్ అని తెలిపారు. ఈపిటిషన్ బుధవారం జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి వద్ద విచారణకు రానుంది.

వాన్‌పిక్ కేసులో 4 వారాల్లో కౌంటర్ వేయండి

- సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశం.. విచారణ నవంబరు 19కి వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారానికి సంబంధించిన వాన్‌పిక్ భూముల కేసులో నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐని ఆదేశించింది. ఈ కేసులో తనను నిందితుడిగా చేర్చడంపై వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గతంలో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సుబ్బారెడ్డి సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. సీబీఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు ప్రారంభిస్తుండగా.. వాన్‌పిక్ కేసు విచారణ తర్వాత చేపడతామని ధర్మాసనం తెలిపింది. ఆ కేసుకు సుబ్బారెడ్డి పిటిషన్ జత చేసి ఉందని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. గత విచారణలో మరో ధర్మాసనం ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి ఆదేశాలిచ్చిందని, అయితే ఇందుకు తమకు మరింత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అంగీకరించిన ధర్మాసనం 4 వారాల్లో కౌంటర్ వేయాలంటూ విచారణను నవంబరు 19కి వాయిదా వేసింది.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు అస్వస్థత

సీతంపేట (విశాఖపట్నం), సెప్టెంబరు 10: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అస్వస్థతకు గురయ్యారు. ఆయన గత మూడు రోజులుగా వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. విశాఖపట్నంలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.

హజ్‌యాత్ర దరఖాస్తు గడువు పొడిగింపు

- ఈ నెల 23 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరణ: మంత్రి ఫరూక్

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): హజ్‌యాత్రకు దరఖాస్తు గడువును హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఈ నెల 23వ తేదీ వరకు పొడిగించిందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తున్నారని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.hajcommittee.gov.in, www.apstatehajcommittee.comలలో హజ్ దరఖాస్తుదారులను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 18004257873, అదేవిధంగా 08662471786, aphajcommittee@gmail.com మెయిల్ ద్వారా కూడా సమాచారం పొందవచ్చని వివరించారు.

'గో'మాఫియా!

(మొదటి పేజీ తరువాయి)

పశువుల అక్రమ రవాణాకు శ్రీకాకుళం సంతల్లోనే బీజం పడుతోంటే.. దారి పొడవునా ముఠాలు రూ.కోట్లు ఆర్జిస్తున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలువురు దళారులు కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్రకు పల్నాడు మీదుగానే పశువులను తరలిస్తుంటారు. అయితే గత ఐదేళ్లుగా అటుగా వెళ్లే ప్రతి వాహనానికి వేలు, ఒక్కోసారి లక్షలు కూడా చెల్లించాల్సి వస్తోంది. పల్నాడు ప్రాంతంలోని ఒక మాజీ మంత్రి అనుచరుడు.. ఆయా పశువుల దళారులను సైతం బెదిరించి పదుల కోట్ల రూపాయలు ఆర్జించాడు. ఎ వరైనా డబ్బు ఇవ్వలేదంటే కేసులు బనాయిస్తాడు. అప్పట్లో ఆ మంత్రికి జీ హుజూర్ అంటూ పనిచేసిన విజిలెన్స్ అధికారికి నెలనెలా మామూళ్లు ఇచ్చేవాడు. చిలకలూరిపేట సంతకు పశువులు విక్రయించేందుకు తీసుకొచ్చే రైతులను కూడా వదలకుండా వేలకు వేలు పిండేశాడు. ఏకంగా ఎమ్మెల్యే టికెట్ కోసం ఒక నేతకు కోట్లు ఇచ్చి పోగొట్టుకున్నానంటూ ఆ వ్యక్తి బహిరంగంగా మాట్లాడడం ఎన్నికల ముందు వైసీపీలో కలకలం సృష్టించింది. పశువుల రక్తమాంసాలతో సంపాదించిన సొమ్ములో.. తాడేపల్లి ప్యాలెస్‌లో ఉండే సదరు సకల శాఖల నాయకుడు వాటా తీసుకుని తనకు అన్యాయం చేశాడని ఆరోపించడం పెద్ద దుమారమే రేపింది. ఎన్నికల సమయంలో ఆ వ్యక్తి వసూళ్లు తగ్గించడంతో హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్న పశువుల వ్యాపారులకు ఇటీవల మళ్లీ కష్టమొచ్చింది. మాజీ మంత్రి అనుచరుడు ఇప్పుడు ప్రస్తుత అధికార పార్టీలోకి వచ్చాడు. తన పాత దందా కొనసాగిస్తున్నాడు. ఎమ్మెల్యేలు, పోలీసులు, ఇతర అధికారుల పేర్లు చెప్పి మళ్లీ వ సూళ్లకు తెరతీశాడు. ఒక్కో వాహనం నుంచి రూ.15 వేలకు తగ్గకుండా 35 వేల వరకూ పిండుతున్నాడు. పదుల సంఖ్యలో అనుచరులను ఏర్పాటు చేసుకుని దందా నడిపిస్తున్నట్లు ప్రభుత్వానికి, విజిలెన్స్, రవాణా, పోలీసులకు వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. అప్పటికే తగిన సమాచారం సేకరించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రంగంలోకి దిగింది. పశు మాఫియాకు ఉచ్చు బిగిస్తోంది. మాజీ మంత్రి అనుచరుడు, అతడి అనుయాయులు. దళారుల వెనకున్నది ఎవరు.. ఎంతెంత సంపాదించారు.. సంపాదిస్తున్నారో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. తదుపరి అరెస్టులు సహా చట్టపరమైన చర్యలకు ఉపక్రమించనుంది.

పశు రవాణా చట్టం ఏమి చెబుతోంది..?

పశువులను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే పశు రవాణా చట్టం-1978 ప్రకారం మండల స్థాయి తీర్మానాలు చేయాలి. ఒక వ్యానులో అయితే రెండు, లారీలో అయితే నాలుగు, చిన్నవైతే ఐదుకు మించి పశువులను తీసుకెళ్లరాదు. వాహనంలో వాటికి అవసరమైన గాలి, వెలుతురుతో పాటు ఆహారం, నీరు కూడా అందుబాటులో ఉంచాలి. ప్రతి గంటకోసారి వాహనం ఆపి పశువులను గమనించి.. వాటి పరిస్థితి సవ్యంగా ఉంటేనే ముందుకు కదలాలి. గాయాలున్నా, ఊపిరాడక పశువులు చనిపోయినా కదలడానికి వీల్లేదు. వ్యవసాయానికి పనికిరాని ఎద్దు, గేదెల్లాంటివి తప్ప ఆవులు, దూడల రవాణా పూర్తిగా నిషేధం. నిబంధనలు పాటించకుండా గోవులను తరలిస్తే గోవధ చట్టం ప్రకారం ఐదేళ్ల వరకూ శిక్షలు తప్పవు. మోటారు వాహన చట్టం ప్రకారం.. మూగ జీవాలను తరలించే వాహనాలు ప్రత్యేక రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. ప్రతి పశువుకు 2 చదరపు మీటర్ల వెడల్పు ఉన్న బాక్సును వాహనంలో ఏర్పాటు చేయాలి. కేవలం రాత్రి సమయాల్లోనే రవాణా చేయాలి. సంబంధిత మండల లేదా డివిజన్ పశుసంవర్థక శాఖ అధికారి అనుమతి తీసుకోవాలి. ఉల్లంఘిస్తే ఆర్‌టీఏ కనీసం రూ.50 వేల వరకూ జరిమానా విధించవచ్చు. శ్రీకాకుళం, విజయనగరం లాంటి జిల్లాల నుంచి పశువులను మన రాష్ట్రంలోని పలు జిల్లాల మీదుగా పొరుగు రాష్ట్రాలకు అమానుషంగా తరలిస్తున్నారు. ఏ సంతకు ఎన్ని పశువులు వస్తున్నాయి.. వాటిని ఎవరు కొనుగోలు చేస్తున్నారు.. ఏ వాహనంలో తీసుకెళ్తున్నారు.. తదితర వివరాలను సంబంధిత ప్రభుత్వ శాఖలు తీసుకోవాలి. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పశువులు తరలించే వాహనాలను సమర్థంటా ట్రాకింగ్ చేయాలి. ట్రక్కుల్లో ఆవులున్నా, దూడలున్నా, ఊపిరాడని స్థితిలో ఇతర పశువులు ఉన్నా కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కానీ పశువుల దళారులు ఈ నిబంధనలేవీ పాటించడం లేదన్న విమర్శలున్నాయి.

సజ్జల ఎక్కడ?

ఎన్నికల ఫలితాల తర్వాత
తగ్గిన సలహాదారు హడావుడి



- జగన్ ఉన్నప్పుడూ తాడేపల్లిలో కనిపించని వైనం
- హైదరాబాద్‌లో ఉన్నారంటున్న వైసీపీ వర్గాలు

అమరావతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి వచ్చాక.. ఐదేళ్లు సకల శాఖల మంత్రిగా వ్యవహరించిన ప్రభుత్వ సలహాదారు, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ అన్నీ తానై నడిపించిన ఆయన.. జూన్‌లో సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత అంత క్రియాశీలంగా లేరు. దీనికి తోడు వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఇటీవల బీజేపీ అనుబంధ విభాగంలో బాధ్యతలు నిర్వర్తించిన ఆళ్ల మోహన్ దత్‌కు పార్టీ నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. ఇప్పటిదాకా ఈ బాధ్యతలను రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డితో పాటు సజ్జల కూడా నిర్వహించేవారు. ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక వీరిద్దరూ తాడేపల్లి ప్యాలెస్‌కు పెద్దగా రావడం లేదు. ముఖ్యంగా సజ్జల ఎన్ని సార్లు వచ్చారో వేళ్లతో లెక్కబెట్టవచ్చని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. అధికారంలో ఉండగా ప్రభుత్వంపై విమర్శలు వస్తే.. పార్టీ తరఫున గానీ, ప్రభుత్వం తరఫున గానీ.. శాఖలతో సంబంధం లేకుండా అనుకూల మీడియా ముందు మాట్లాడేవారు. మంత్రులు మాట్లాడాల్సిన అంశాలనూ ఆయనే మాట్లాడేవారు. ఇప్పుడు ఆయన జాడ తెలియడం లేదు. జగన్ తరచూ బెంగళూరు యలహంక ప్యాలెస్‌కు వెళ్తూ ఎక్కువ రోజులు అక్కడే గడుపుతున్నారు. తన సన్నిహితులెవరైనా కేసుల్లో జైలుకు వెళ్తే పరామర్శించడానికి వస్తున్నారు. ఆ సమయాల్లో కూడా సజ్జల రాకపోవడం గమనార్హం. బెజవాడ వరద ప్రాంతాల్లో జగన్ పర్యటించినప్పుడు కూడా వెంట లేరు. దీంతో సజ్జల ఎందుకు దూ రంగా ఉంటున్నారన్న చర్చ పార్టీలో సాగుతోంది. ఇప్పటికే సజ్జల కుమారుడు భార్గవరెడ్డిని వైసీపీ సోషల్ మీడియా విభాగం నుంచి తప్పించారు. ఇప్పుడు సజ్జలను కూడా జగన్ దూరం పెట్టారా అని వైసీపీ నేతలు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోనే ఉంటున్నారని అంటున్నారు. విజయసాయిరెడ్డిని కూడా జగన్ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంచారని తెలుస్తోంది. ఢిల్లీలో కొన్నాళ్ల కిందట జరిగిన ధర్నా ఏర్పాట్ల బాధ్యతను ఆయనకు అప్పగించినా.. ఆ తర్వాత ఏ పనీ అప్పగించలేదు.

ఇసుక ఆన్‌లైన్ బుకింగ్
నేటి నుంచే

(మొదటి పేజీ తరువాయి)

తెలిసింది. ఈ విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి రావడానికి ఐదారు రోజులు పట్టొచ్చని అధికార వర్గాలు తెలిపాయి. దీంతోపాటు ఇసుక రవాణా, డెలివరీ వంటి అంశాలను వాస్తవిక సమయంలో పర్యవేక్షించేలా ప్రత్యేక విధానం అమల్లోకి రానుంది. అయితే, ఇసుక రవాణా చార్జీల విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. జిల్లాస్థాయి ఇసుక కమిటీలు ప్రతిపాదించిన రేట్లు చాలా ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. జగన్ ప్రభుత్వ హయాంలో 2021లో నిర్ణయించిన ధరలపై 30-50 శాతం మేర రవాణా చార్జీలు పెంచేలా అధికారుల ప్రతిపాదనలున్నాయి. ఆ ధరలు వద్దని సర్కారు స్పష్టం చేసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్రం అంతా ఒకేవిధంగా రవాణా చార్జీలు ఉండాలని, ఈ దిశగా కలెక్టర్లు, జిల్లా ఇసుక కమిటీలతో చర్చించాలని ప్రభుత్వం ఆదేశించింది. కాగా గత పాలసీ (2021)తో పోలిస్తే రవాణా చార్జీల పెరుగుదల ఐదు శాతానికి మించకుండా ఉండేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించింది. మరోవైపు ప్రభుత్వమే చార్జీల పెంపుదల విషయంలో ఓ ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం 4.5 టన్నుల ఇసుక ట్రాక్టర్‌కు తొలి పది కిలోమీటర్లకు రూ.547 చార్జీ వసూలు చేసేలా ప్రతిపాదించారు. అయితే, ఇవి ఇంకా ప్రతిపాదన దశలోనే ఉన్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన స్థాయిలో కలెక్టర్లు చార్జీలను నిర్ణయించలేకపోతే వీటినే ఆమోదించే అవకాశం ఉందని తెలిసింది.

ప్రతిపాదిత రవాణా చార్జీలు ఇలా...

దూరం (కి.మీ.)	ట్రాక్టర్ (రూ.ల్లో)	6 టైర్ల లారీ (10 టన్నులు) (రూ.ల్లో)	10 టైర్ల లారీ (10 టన్నులు) (రూ.ల్లో)
0-10	547	972	1,532
11-20	1,094	1945	3,063
21-30	1,641	2917	4,595
31-40	2,188	3,890	6,126
41-50	2,456	4,485	7,198
51-60	2,724	5,081	8,270
61-70	2,992	5,676	9,342
71-80	3,260	6,272	10,414
81-90	3,528	6,868	11,487

శీతాకాలం గజగజే!

- ఉత్తరాదిలో పడిపోనున్న ఉష్ణోగ్రతలు
- నేడు మధ్య భారతంలో వాయుగుండం
- వచ్చే వారం మరో అల్పపీడనం?

విశాఖపట్నం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ వేసవి తరువాత అసాధారణ వర్షపాతంతో దేశం అతలాకుతలమైంది. నైరుతి రుతుపవనాలు మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రానున్న శీతాకాలంలో చలి తీవ్రత కూడా పెరుగుతుందని భారత వాతావరణ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని, ప్రధానంగా ఉత్తరాదిలోని జమ్ము, కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, దానికి ఆనుకుని ఉన్న మరికొన్ని రాష్ట్రాల్లో చలి ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో మధ్య, దక్షిణ భారతంలో చలి సాధారణంగా ఉంటుందంటున్నారు. చలి తీవ్రత ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు సూచిస్తున్నారు. ప్రస్తుతం పసిఫిక్ మహా సముద్రంలో ఉన్న తటస్థ పరిస్థితులు ఈ నెలాఖరు నాటికి లానినోగా మారతాయని ఇప్పటికే అంతర్జాతీయంగా పలు వాతావరణ మోడల్స్ అంచనాకు వచ్చాయి. దీని ప్రభావంతో పసిఫిక్ మహా సముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయి. దీంతో పసిఫిక్ నుంచి వచ్చే చల్లని గాలుల ప్రభావం భారతదేశంలో చలికాలంపై ఎక్కువ ప్రభావం చూపుతుందని అంచనా వేస్తున్నారు.

నేడు వాయుగుండం

రెండు రోజుల క్రితం ఒడిశాలో తీరం దాటిన తీవ్ర వాయుగుండం ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనించి మంగళవారం నాటికి మధ్యప్రదేశ్‌లో ప్రవేశించి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. అయితే, ఇది మళ్లీ బలపడి వాయుగుండంగా మారేందుకు వాతావరణం అనుకూలించింది. దీనిపై బుధవారం ఒక స్పష్టమైన ఒక ప్రకటన చేస్తామని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఒడిశాలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో కుంభవృష్టిగా వర్షాలు కురిశాయి. ఇప్పుడు తాజాగా మధ్యప్రదేశ్‌లో తీవ్ర అల్పపీడనం బుధవారం నాటికి వాయుగుండంగా మారితే మరోసారి మధ్యభారతం, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లపై తీవ్ర ప్రభావం చూపుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. పది రోజుల క్రితం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో ఏర్పడిన వాయుగుండం గుజరాత్ మీదుగా ప్రయాణించి అరేబియా సముద్రంలో తుపాన్‌గా మారింది. దీంతో మునుపెన్నడూ లేనంతగా వరదలు సంభవించాయి. మళ్లీ అలాంటి పరిస్థితి తలెత్తుతుందా లేదా అనేది రెండ్రోజుల తరువాత చెప్పగలమని నిపుణులు పేర్కొంటున్నారు. ఇదిలావుండగా వచ్చే వారం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ నిపుణుడు ఒకరు అంచన వేశారు. దీనివల్ల రుతుపవనాలు మరికొంత కాలం దేశంలో కొనసాగుతాయని చెబుతున్నారు. కాగా, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మంగళవారం ఎండ కొనసాగింది. కావలిలో అత్యధికంగా 37.8 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. అక్కడక్కడ మాత్రం వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

నేవీ సివిలియన్ ప్రవేశ పరీక్ష రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేవీలో గ్రూపు-బీ, గ్రూపు-సీ ఉద్యోగాల భర్తీ కోసం మంగళవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సిన నేవీ సివిలియన్ ప్రవేశ పరీక్ష (ఐఎన్‌సీఈటీ-1/2024)ను రద్దు చేసినట్టు నేవీ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. సాంకేతిక, పరిపాలనా కారణాలతో రద్దు చేసిన ఈ ప్రవేశ పరీక్షను తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ ప్రకటిస్తామని పేర్కొన్నాయి.

మిజోరాం గవర్నర్ హరిబాబుకు ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్

- ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉంది... స్టార్ ఆస్పత్రి వెల్లడి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మిజోరాం గవర్నర్ హరిబాబు ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు స్టార్ ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశారు. సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ విక్రమ్ వర్మ, సీనియర్ పల్మనాలజీ, క్రిటికల్ కేర్ మెడిసిన్ డాక్టర్ చందనరెడ్డిల పర్యవేక్షణలో అన్ని విభాగాల వైద్య నిపుణులతో కూడిన బృందం హరిబాబుకు చికిత్స అందిస్తోందని స్టార్ ఆస్పత్రి హెల్త్ బులెటిన్‌లో వివరించింది.

దేకనకొండలో వైసీపీ, టీడీపీ వర్గీయుల రాళ్ల దాడి

12 మందికి గాయాలు.. పోలీసు పికెట్ ఏర్పాటు





ఇరువర్గాల విసురుకున్న రాళ్లు, క్షతగాత్రుని పరామర్శిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మి

కురిచేడు, సెప్టెంబరు 10: ప్రకాశం జిల్లా కురిచేడు మండలం దేకనకొండ గ్రామంలో సోమవారం రాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పడిన వివాదం ఘర్షణకు దారి తీసింది. టీడీపీ, వైసీపీ వర్గీయులు పోలీసుల సమక్షంలోనే ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. మంగళవారం తిరిగి రాళ్లదాడికి దిగారు. ఈ ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. పోలీసు ఉన్నతాధికారులు గ్రామానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పికెట్ ఏర్పాటు చేశారు. అందిన సమాచారం మేరకు టీడీపీ వర్గానికి చెందిన వారు నిమజ్జనం కోసం సోమవారం రాత్రి వినాయకుడి విగ్రహాన్ని మండపం నుంచి ట్రాక్టర్ మీదకు దించుతున్నారు. ఈక్రమంలో ట్రాక్టర్‌ను రోడ్డుమీద ఉంచారు. అదే రోడ్డులో వైసీపీకి చెందిన వారు పొలం నుంచి ట్రాక్టర్‌లో వస్తున్నారు. టీడీపీ వారిని వెంటనే ట్రాక్టర్ తీయాలని డిమాండ్ చేయడంతో వివాదం తలెత్తింది. కొద్దిసేపటికే ఇరు వర్గాలూ రాళ్లతో దాడి చేసుకున్నాయి. త్రిపురాంతకం సీఐ సుబ్బారావు, కురిచేడు ఎస్ఐ శివ గ్రామానికి చేరుకొని ప్రజలతో మాట్లాడి వారిని శాంతింపచేశారు. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం పోలీసులు గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉండగానే ఒక వర్గంవారు రాళ్లతో దాడులు ప్రారంభించారు. దీంతో రెండో వర్గం వారూ రాళ్లు రువ్వారు. అనంతరం సీసాలు, ఇనుప రాడ్లు విసురుకున్నారు. కొద్దిసేపటి తర్వాత పోలీసులు ఇరువర్గాలను కట్టడి చేశారు. ఈ ఘర్షణలో టీడీపీకి చెందిన పది మందికి, వైసీపీకి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, ముందు జాగ్రత్తగా పికెట్ ఏర్పాటు చేశామని సీఐ చెప్పారు. చికిత్స పొందుతున్న టీడీపీ వర్గీయులను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి పరామర్శించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


కుదరని పొత్తు

హర్యానాలో కాంగ్రెస్–ఆమ్ ఆద్మీపార్టీ మధ్య ఎన్నికల పొత్తు ఫలించకపోవడంతో రెండు పార్టీలు వేరువేరుగా తమ అభ్యర్థుల జాబితాలు విడుదల చేస్తున్నాయి. అక్టోబర్ 5న రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలకు గురువారంలోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఆఖరునిముషం వరకూ పొత్తుకోసం ప్రయత్నించామనీ, ఫలించకపోవడంతో ఒంటరిగా పోతున్నామని ఆప్ నాయకులు తేల్చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో జంటగాసాగి, 'ఇండియా' కూటమి ఐక్యతా సందేశాన్ని ఇటీవలే ఇచ్చామనీ, ఇప్పుడు వేరుపడితే బాగుండదని రాహుల్ భావించి, తదనుగుణంగా పొత్తుకోసం ఆయన రాష్ట్ర నాయకులమీద గట్టి ఒత్తిడి తెచ్చారు. ఇప్పుడు కనుక హర్యానాలో చేయి కలిపితే, ఫిబ్రవరిలో ఢిల్లీలో జరగబోయే ఎన్నికల్లో ప్రతిఫలంగా ఆప్ నుంచి ఎంతో సాధించవచ్చునని కాంగ్రెస్ ఆలోచన. కానీ, రాష్ట్ర పెద్దలకు, మరీ ముఖ్యంగా భూపీందర్ సింగ్ హూడాకు ఈ పొత్తువాసన గిట్టకపోవడంతో చివరకు వెన్నుపోటు పొడిచారని ఆప్ నాయకులు అంటున్నారు.

తొంభై అసెంబ్లీ స్థానాల్లో ఆదిలో పదిహేను, ఆ తరువాత పదిస్థానాలను డిమాండ్ చేసిన ఆప్‌కు హర్యానాలో అంతబలం లేదని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల వాదన. మరీముఖ్యంగా ఆ పార్టీ అడుగుతున్న వాటిలో కొన్ని బలమైన కాంగ్రెస్ అభ్యర్థులున్న, వారు సులువుగా గెలవగలిగే స్థానాలున్నాయి. అసలు ఆప్‌తో పొత్తే వద్దనీ, ఓ నాలుగైదు ఇచ్చినా కూడా అక్కడ ఆప్ గెలవకపోగా, కాంగ్రెస్ ఆ మేరకు నష్టపోతుందని స్థానికనాయకుల వాదన. లోక్‌సభ ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఆప్ పోటీచేసిన కురుక్షేత్రలో బీజేపీ గెలిచిందనీ, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాల ఆధారంగా చూసినప్పుడు ఒంటరి పోరే ఉత్తమం, జంటగా పోతే నష్టమేనని వారి నమ్మకం. ఐదేళ్ళక్రితం సగానికిపైగా స్థానాల్లో పోటీచేసిన ఆప్ ఒక్కటీ గెలవనిమాట నిజం. గెలుపోటముల లెక్కలను అటుంచినా, పొత్తుతో ఆప్‌ను హర్యానాలో బలోపేతం చేయడం కాంగ్రెస్‌కు భవిష్యత్తులో ఎనలేని నష్టం చేస్తుందని, అరవింద్ కేజ్రీవాల్‌ది భస్మాసుర హస్తమని కాంగ్రెస్ నాయకుల నమ్మకం. ఈ కారణంగానే, ఒక దశలో ఆప్ ఐదుస్థానాలకు సరిపెట్టుకుంటానని చెప్పినా కూడా అది ప్రతిపాదించిన సీట్లలో తాము కచ్చితంగా గెలుస్తామన్న నమ్మకంతో రాష్ట్ర నాయకులు పడనివ్వలేదు. అటు దేశరాజధాని ఢిల్లీలోనూ, ఇటు పంజాబ్‌లోనూ తాము అధికారంలో ఉన్నందున, ఈ రెండింటి మధ్యనా ఉన్న అరవింద్ కేజ్రీవాల్ స్వరాష్ట్రంలో పార్టీ ఎదుగుదల దృష్ట్యా కొన్ని స్థానాలు కీలకమైనవని, వాటినే తాము కోరుకున్నామని ఆప్ అంటోంది. ఇప్పుడు హర్యానాలో పొత్తుపొడవకపోవడంతో రేపు ఈ రెండు పార్టీల మధ్య ఢిల్లీలో పొత్తుఉండబోదని విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. ఆఖరు నిముషంలో ఏమైనా కొత్త మలుపులుంటాయోమో తెలియదు కానీ, ఈ రెండు పార్టీలూ విడివడటంతో అసలే కష్టాల్లో ఉన్న బీజేపీకి ఇప్పుడు కాస్తంత ధైర్యం వచ్చిందని అంటారు.

మంగళవారం బీజేపీ విడుదల చేసిన 21మంది అభ్యర్థుల జాబితాలో ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు దక్కలేదు. వీరిలో ఇద్దరు మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు సైతం ఉన్నారు. ఈ లిస్టుతో పార్టీలో అసంతృప్తిరేగి, తిరుగుబాట్లు, రాజీనామాలు సాగుతున్నాయి. గతవారం 67మందితో కూడిన తొలిజాబితా విడుదలైనప్పుడు కూడా పార్టీ ఇదేవిధమైన ప్రతికూలత ఎదుర్కొంది. నలభై సిట్టింగ్‌లను మార్చడం, ఇద్దరుమంత్రులతో సహా ఏడుగురు ఎమ్మెల్యేలకు టికెట్ ఇవ్వకపోవడం, కొద్దిగంటల్లోనే దానిని ఉపసంహరించుకొని కొన్ని సవరణలు చేయడం తెలిసినవే. ఈ రెండుజాబితాలతో రాష్ట్ర బీజేపీ కనివినీ ఎరుగనంత వ్యతిరేకతను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ స్థాయిలో ప్రక్షాళనచేయనిదే మూడోమారు అధికారంలోకి రావడం అసాధ్యమని పార్టీ పెద్దల నమ్మకం. ఇటీవలివరకూ బీజేపీతో పొత్తులో ఉన్న దుష్యంత్ చౌతాలా పార్టీనుంచి తిరుగుబాటుచేసిన వారికి పెద్ద ఎత్తున టిక్కెట్లు ఇవ్వడంతో ఈ చిచ్చురేగింది. ముఖ్యంగా అత్యంత కీలకమైన జాట్ ఓటుబ్యాంకు తనకు దూరమైందన్న భయం బీజేపీని పీడిస్తున్నది. రైతు ఉద్యమాలు, ఆ తరువాత మహిళా రెజ్లర్ల ఆందోళనలు, బ్రిజ్‌భూషణ్ శరణ్ పక్షాన బీజేపీ పెద్దల అనుచిత ప్రవర్తన ఇత్యాదివి జాట్లను పార్టీకి దూరం చేశాయి. ఖాప్ పంచాయితీలు సైతం పలు తీర్మానాలతో తమ అసంతృప్తిని బాహాటంగా ప్రకటించాయి. అంతర్గత కుమ్ములాటలు కాంగ్రెస్‌లోనూ ఉన్నాయి కానీ, వినేశ్ ఫోగాట్, బజ్రంగ్ పునియా ఇత్యాది యువ, జాట్ రెజ్లర్ల ప్రవేశంతో ఈ మారు జాట్ల మద్దతు కచ్చితంగా తనకు దక్కుతుందన్న సమధికోత్సాహంలో ఆ పార్టీ ఉంది. హ్యాట్రిక్ కోసం బీజేపీ, అధికారం కోసం కాంగ్రెస్ సాగిస్తున్న ఈ హోరాహోరీ పోరులో ప్రజలు ఏ పక్షాన ఉంటారో చూడాలి.

వణుకుతున్న నగరాలకు ఊరట ఎప్పుడు?



విజయవాడ, జైపూర్, చండీగఢ్, గురుగ్రామ్, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలను వర్షాలు ముంచెత్తిన తీరు మన ప్రభుత్వాల సమర్థ సమాయత్తతను ప్రశ్నార్థకం చేస్తోంది. బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని చెప్పడం, జనాన్ని మరో చోటకు తరలించడం, ఆహార పొట్లాలు సరఫరా చేయడం పాలకులకు అలవాటైంది. మరి వరదలు తగ్గిన తర్వాతనైనా భావి అవసరాల దృష్టిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరచడంపై శ్రద్ధ చూపుతారా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ఇప్పుడు దేశంలో వర్షం హోరు తప్ప మరేదీ వినపడడం లేదు. ఉదయం, రాత్రీ అన్న తేడా లేకుండా వర్షం కురుస్తున్న చప్పుడు వినపడుతోంది. ఆకాశంలో దట్టంగా అలముకున్న మేఘాలను చూస్తే భయం వేస్తోంది. దేశమంతా చిరపుంజీగా మారిందా అన్న అనుమానం వేస్తోంది. దేశ రాజధాని ఢిల్లీతో సహా ఇవాళ అనేక నగరాలలో వర్షాల వల్ల నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. రోడ్లను దాటి, సందుగొందులను చుట్టి ఇళ్లలోకి వస్తోంది. భవనాల నేలమాళిగలలోకి కూడా నీరు ప్రవహిస్తోంది. చెట్లు నేల కూలి నిస్సహాయంగా చూస్తున్నాయి. యమునా పరివాహక ప్రాంతాల్లో ఉన్న దిక్కుమొక్కులేని జనం ఫుట్‌పాత్‌లపైకి వచ్చి టెంట్లలో తల దాచుకుంటున్నారు. గత నెల ఢిల్లీలోని రాజేంద్రనగర్‌లో ఒక ఐఏఎస్ కోచింగ్ సంస్థ అండర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన లైబ్రరీలోకి నీరు ప్రవహించి ముగ్గురు విద్యార్థులు; ఒక పార్క్‌లో వాననీటిలో మునిగి ఒక ఏడేళ్ల బాలుడు మరణించారు. కేరళలోని వయనాడుతో ప్రారంభించి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిషా, గుజరాత్, హర్యానా, బిహార్, పశ్చిమ బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, గోవాలోని అనేక ప్రాంతాల్లో ఎందరో కుండపోత వర్షాలు, పెను వరదలకు గురై మరణించారు. అనేక చోట్ల వాహనాలు కొట్టుకుపోయాయి. ఫలితంగా ఎన్నో కుటుంబాలవారు తమ ఆప్తులను కోల్పోవడం జరిగింది. విజయవాడలో గత రెండు దశాబ్దాల్లో ఏనాడూ లేనంతగా సంభవించిన వర్షాలు, వరదలు అల్లకల్లోలం సృష్టించాయి.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే దేశంలో రాజస్థాన్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో మహిళలు తాగునీటికోసం మైళ్ళకొద్దీ నడవాల్సిన పరిస్థితి ఇప్పటికీ ఉన్నది! దేశవ్యాప్తంగా 60 కోట్లమంది తీవ్ర నీటి ఎద్దడికి గురవుతున్నారని, స్వచ్ఛమైన నీరు లభించనందువల్ల ఏటా 2 లక్షలమంది మరణిస్తున్నారని, దేశంలో 70 శాతం నీరు కలుషితమైందని సౌత్ ఆసియా ఫోరమ్ వెల్లడించింది. యేల్ యూనివర్సిటీ 2022లో చేసిన అధ్యయనంలో కలుషితమైన తాగునీటిపై నిర్ణయించిన సూచికలో 200 దేశాల్లో భారత్ 141వ స్థానంలో ఉన్నది. 'Water, Water every where but not a drop to drink' (ఎక్కడ చూసినా నీరే కాని చుక్క నీరు త్రాగలేము) అని ఒకప్పుడు సముద్రం గురించి మాట్లాడుకునేవారం. ఇప్పుడు ఆ సముద్రం మన వీధుల్లోకే వచ్చింది. జగత్తు అంతా జల ప్రళయం ఏర్పడితే దేవుడు ఒక పడవను పంపించి అందర్నీ కాపాడాడని బైబిల్‌లో ఒక కథనం ఉంది. ఇప్పుడు మనం రోజూ తిరిగే రోడ్లే నదులుగా మారినప్పుడు, నీటిలో ఇరుక్కుని కొట్టుకుపోతునప్పుడు ఎందరో మానవ దేవుళ్లు కాపాడాల్సి వస్తోంది.

మరో వారం రోజులు దేశమంతా ఇలాగే వర్షాలు కురుస్తాయని, ఒక చోట తగ్గినా మరో చోట వానలు ఆగవని ఢిల్లీలోని ఐఎండి అధికారులు చెబుతున్నారు. ప్రధానమంత్రి స్వంత రాష్ట్రమైన గుజరాత్‌లో కనీసం 15 జిల్లాల్లో పరిస్థితి ఘోరంగా ఉన్నది జామ్‌నగర్ నగరంలో వర్షాలు కురిసిన తర్వాత వీధులన్నీ భారీ చెత్తతో నిండిపోయాయి. వాటిని తొలగించేందుకు అధికారులు రాత్రింబవళ్లు పనిచేయాల్సి వచ్చింది. కచ్ ప్రాంతంలో పరిస్థితి పునరుద్ధరించడం ప్రభుత్వానికి తలకు మించిన పని అయింది. ముఖ్యంగా వడోదరా నగరంలో ఆగస్టు 26 నుంచి 12 రోజుల పాటు వర్షాలు కురిశాయి, వరదలు ముంచెత్తాయి. అజ్వా రిజర్వాయర్ నుంచి విశ్వామిత్రి నదికి నీరు వదలడంతో అనేక లోతట్టు ప్రాంతాలలో ఉన్న ఇళ్లు మునిగిపోయాయి. అపార్ట్‌మెంట్లలోకి కూడా నీరు ప్రవహిస్తోంది. వరద నీళ్లలో మొసళ్లు కూడా దర్శనమిస్తున్నాయి! వేలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఎన్ని ఆహారపొట్లాలు సరఫరా చేసినా సరిపోవడం లేదు. మృత్యుభయంతో వణికిపోతున్న ప్రజలు బీజేపీ నేతలు కనపడితే మండిపడుతున్నారు. విజయవాడలో చంద్రబాబునాయుడు, ఇతర నేతలు ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి వారికి భరోసా ఇవ్వడంతో పాటు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటుంటే గుజరాత్‌లో నేతలు కనీసం ప్రజల వద్దకు వెళ్లేందుకు సాహసించలేకపోతున్నారు.

నిజానికి నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రి అయిన తొలి రోజుల్లో ఎండిపోయిన సబర్మతీ నదీతలంపై పిల్లలు క్రికెట్ ఆడుతుంటే చూశారు. ఎక్కడికక్కడ ఆక్రమణలు జరగడం, పారిశ్రామిక కాలుష్య పదార్థాలు వదలడంతో అసలు ఆ నది అనేదే ఒకటున్నదన్న విషయం జనం మరిచిపోయారు. సర్దార్ సరోవర్ ఆనకట్ట ఎత్తు పెంచడం ద్వారా నీటి నిల్వను పెంచి కాలువల ద్వారా సబర్మతీ నదిలోకి నీరు మళ్లించారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాలకు ప్రవహించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సబర్మతీ నది కోసమే ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒకవైపు పాదచారులు, సైక్లిస్టులు వెళ్లేందుకు రహదారులు ఏర్పరిచారు. మరో వైపు విద్యాసంస్థలు, విహార స్థలాలు, వాణిజ్య సముదాయాలను నిర్మించారు. మరి ఇవే నిర్మాణ కార్యక్రమాలను వడోదరాలో ఎందుకు ఆయన చేపట్టలేకపోయారు?

తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులు, విశృంఖలమైన పట్టణ అభివృద్ధి, అస్తవ్యస్తమైన డ్రైనేజి వ్యవస్థ కారణంగానే ఈ వరదలు సంభవించాయని గాంధీనగర్‌లోని ఐఐటీ పరిశోధకులు తేల్చారు. మరి స్మార్ట్ సిటీల గురించి ప్రచారం చేసిన మోదీ తాను ముఖ్యమంత్రిగా ఉన్న 13 ఏళ్లలో స్వంత రాష్ట్రంలో నగరాలను ప్రజావసరాలకు తగ్గట్లుగా ఎందుకు తీర్చిదిద్దలేకపోయారు? మోదీ ప్రధాని అయ్యాక గంగానది ప్రక్షాళనకోసం నమామి గంగే ప్రాజెక్టును ప్రారంభించారు. కాని హరిద్వార్‌తో సహా చాలా చోట్ల ఇంకా ఘాట్‌ల వద్ద చెత్తాచెదారం పేరుకుని ఉన్నది. కాన్పూర్‌లో గంగానదిలో దురాక్రమణలు జరగడం, ప్రక్షాళన సరిగా లేకపోవడంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

అసలు స్మార్ట్ సిటీ అంటే ఏమిటి? రహదారులు, భవనాలు, కమ్యూనికేషన్ సౌకర్యాలు, మెట్రో రైలు మార్గాలు నిర్మించడమా? హైదరాబాద్‌లో జరిగినట్లు రియల్ ఎస్టేట్, కాంట్రాక్టర్ల స్వార్థాలకు అప్పజెప్పడమా? నదులను, చెరువులను నాశనం చేయడమా? పర్యావరణాన్ని కాలరాయడమా? మన సహజవనరులు, మన మానవవనరులు, మన చారిత్రక వారసత్వ సంపదను దృష్టిలో ఉంచుకోకుండా పైకి కళ్లకు జిగేలుమనిపించే ఎన్ని అందమైన నగరాలను నిర్మించినా అవి ఆధునిక సమాధులుగా మారతాయే కాని జీవన సౌందర్యాన్ని ప్రతిబింబించలేవు. మరే దేశంలోనైనా కొల్లేరు వంటి సరస్సు ఉంటే గొప్ప పక్షుల అధ్యయన కేంద్రంగా, పర్యాటన స్థలంగా అభివృద్ధి చేసి ఉపాధి కల్పించేవారని ప్రముఖ పర్యావరణవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత తల్లావఝ్ఝుల పతంజలి శాస్త్రి రాశారు. ఆ కొల్లేరు దురాక్రమణల దుష్ఫలితాలు కూడా ఈ వరదల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్నారు.

మోదీ ప్రధాని అయ్యాక కొత్త విద్యుత్ చట్టాలను ప్రవేశపెట్టారు. అయితే అన్ని రాష్ట్రాల్లో నదులు, చెరువుల భూములను దురాక్రమించే వారి ఆటకట్టించేందుకు కేంద్ర స్థాయిలో ఒక చట్టాన్ని ఎందుకు తీసుకురాలేకపోయారు? అటువంటి చట్టాన్ని ఒకదాన్ని ప్రవేశపెట్టి ఉన్నట్లయితే ఇవాళ తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా అన్న సంస్థను రంగంలోకి దించాల్సిన అవసరం ఉండేది కాదు. నాడు ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు కాంగ్రెస్ విధానాలు నిర్దేశించిన ప్రకారమే భూసంస్కరణలను అమలు చేశారు. దీని ఫలితంగా పీవీకి పదవీ ముప్పు ఏర్పడింది. అయితే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఆయనను పదవి కోల్పోకుండా కాపాడలేకపోయారు. ఇవాళ కొందరు కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ వద్దకు వెళ్లి హైడ్రాపై మొరపెట్టుకున్నా వారు పట్టించుకోకుండా రేవంత్‌నే బలపరచడం, ఆయన వివరణతో ఏకీభవించడం ఒక కీలక పరిణామం.

'మూసీ నది ఒడ్డున నిలబడి చూస్తుంటే కోటలు, గోడలు, బురుజులు, ఒక పక్క బేగం బజారు, చక్కటి చెట్లు, ఎంతో మనోజ్ఞమైన దృశ్యాలు. నదిలో పలువురు స్నానం చేస్తున్నారు. చెలమలు త్రవ్వి నీరు తీసుకుని వెళుతున్నారు. మీర్ ఆలం చెరువు ఎంతో విశాలంగా ఆకట్టుకుంటోంది..' అని 1860లో నైజాం రాజ్యంలో పని చేసిన మెడోస్ టైలర్ తన ఆత్మకథలో రాశారు. (ప్రముఖ జర్నలిస్టు జి. కృష్ణ ఈ ఆత్మకథను తెలుగులో అనువదించారు). 1908లో మూసీకి పెద్ద ఎత్తున వరదలు వచ్చి నగరం బాగా దెబ్బతిన్నది. అఫ్జల్‌గంజ్‌లోనే 11 అడుగుల ఎత్తుకు నీరు చేరుకుంది. దీనితో నిజాం ఒక ట్రస్టు నేర్పాటు చేసి, ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను ఉపయోగించుకున్నారు. ఆ తర్వాతే ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లను నిర్మించారు. వీటి వల్ల నగరానికి తాగునీరు పుష్కలంగా లభించేది. 'హైదరాబాద్‌ను ప్రతి ముఖ్యమంత్రీ ఏదో రకంగా తన ముద్ర పడేలా అభివృద్ధి పరిచారు. మరి మీ బ్రాండ్ ఏమి చూపించబోతున్నారు..?' అని ఇటీవల ఢిల్లీకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అడిగాను. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధిపరుస్తానని ఆయన చెప్పారు. అది నిజంగా జరిగినప్పుడే మెడోస్ టైలర్ తన ఆత్మకథలో వర్ణించినట్లు మూసీనదికి పూర్వవైభవం లభిస్తుంది.

ఏమైనా అసాధారణ వర్షం కురిసినప్పుడు, వాతావరణ శాఖ ఎంత హెచ్చరించినా మన ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేని స్థితి కనపడుతోంది. విజయవాడ, జైపూర్, చండీగఢ్, గురుగ్రామ్, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలను వర్షాల ముంచెత్తిన తీరు మన ప్రభుత్వాల సమర్థ సమాయత్తతను ప్రశ్నార్థకం చేస్తోంది. బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని చెప్పడం, జనాన్ని మరో చోటకు తరలించడం, ఆహార పొట్లాల సరఫరా చేయడం ప్రభుత్వానికి అలవాటైంది. కాని వరదలు తగ్గిన తర్వాతనైనా భావి అవసరాల దృష్టిలో మౌలిక సదుపాయాలను కల్పించడం, నగరాలను విస్తరించడం అవసరం. విశ్వనగరాలు, వికసిత్ భారత్‌లు ఏర్పరుస్తామన్న మన నేతలకు ఈ వర్షాలు, వరదలు ఎన్నో గుణపాఠాలు నేర్పాయనడంలో సందేహం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

'విపత్తు నిర్వహణ బిల్లు' లక్ష్యం నెరవేరుతుందా?

ప్రకృతి వైపరీత్యాలు దేశమంతటా విలయతాండవం చేస్తున్న వేళ రాజకీయాల్లోకి పోకుండా ఏ విధంగా నివారణకు ఉపక్రమించాలన్నది పెద్ద సమస్యగా మారింది! రెండు తెలుగు రాష్ట్రాలలో వరదలూ, వర్షాలూ, కట్టలు తెంచుకొని ప్రవహించే నదీ జలాలూ, ఆనకట్టలు కట్టు తెగి జలమయం చేస్తూ ప్రజలను కకావికలం చేస్తూ పరుగెత్తిస్తున్న వేళ ఏ విధంగా సహాయ చర్యలు అందించాలన్నది పెద్ద సమస్యగా మారింది!

ప్రభుత్వాలు ఈ సందర్భాలలో చర్యలు తీవ్రతరం చేయక తప్పదు. అయితే ఆ చర్యలు తీసుకోవటానికి ప్రకృతి సహకరిస్తుందా, వనరులు బాధితులు అందరికీ అందేవిధంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయా? రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల బాధ్యతలూ – నివారణ చర్యలూ ఏ విధంగా ఉండాలి? ఆర్థిక వనరులను ఏ విధంగా ఎవరు సర్దుబాటు చేయాలన్నది విపత్తులు సంభవించినప్పుడే జ్ఞాపకం వస్తున్నాయి. అసలు సమస్య బదులు కొసరు సమస్యను తీసుకొని రాజకీయ నాయకులు వైపరీత్యాలను ఆసరా చేసుకుంటూ 'బ్లేమ్ గేమ్'ను పండించే విధంగా ప్రయత్నించటం ఎంతవరకు సబబు?

ఆగస్టు 1, 2024న కేంద్ర ప్రభుత్వం డిజాస్టర్ మానేజ్‌మెంట్ (ఎమెండ్‌మెంటు) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అంతకుమునుపు వున్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్–2005ను మరింతగా కేంద్రీకరించే విధంగా (ఒరిజనల్ బిల్లు పూర్తి కేంద్రీకరణ పైనే దృష్టి పెట్టింది) ఈ కొత్త బిల్లు తయారు చేయబడిందా అన్నట్లు సాక్ష్యాధారాలు కనబడే రీతిలో బిల్లులోని విషయాలు ఉన్నాయి! యాక్ట్ ప్రకారం కేంద్ర, రాష్ట్ర, జిల్లాల స్థాయిలో అథారిటీ సంస్థలూ, కమిటీలు ఏర్పరచబడే వున్నాయి. కొత్త బిల్లు మరికొన్ని సంస్థలను అంటే నేషనల్ క్రైసిస్ మానేజ్‌మెంట్ కమిటీతో పాటు హైలెవల్ కమిటీని ఏర్పరిచేందుకు మాండేట్ సమకూర్చటం, విపత్తులలో అన్ని స్థాయిలలో తీసుకొనే చర్యలను మరింత కష్టతరంగా కాలయాపన చేసేందుకు దారితీసే విధంగా ఉంది! దీనివల్ల పైనుంచి చర్యలు ఉపక్రమించటానికి కాలయాపన వల్ల బాధితులకు ఉపశమనం మరింత దూరంగా అయ్యే ప్రమాదం ఉంది! యాక్ట్ ముఖ్యోద్దేశం సహాయ సహకారాలు త్వరితంగా అందించటానికి అని అనుకుంటే– అది నెరవేరే సౌకర్యం ఈ బిల్లు వల్ల లభించదు!

ఈ బిల్లు ముఖ్యోద్దేశం నేషనల్ డిజాస్టర్ మానేజ్‌మెంట్ అథారిటీని రాష్ట్ర అథారిటీతో బలోపేతం చేయటానికి, రాష్ట్ర, కేంద్ర స్థాయి ప్రణాళికల తయారీ కోసం అని చెప్తున్నా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీలు–స్టేట్ రాజధానులూ, మున్సిపల్ కార్పొరేషన్లు కూడా ఈ బిల్లు ద్వారా ఏర్పడతాయని స్పష్టపరుస్తున్నా, ఆర్థిక వనరులను – వికేంద్రీకరణ చేయనంత కాలం అనుకున్న ఫలితాలు రాకపోగా, మరిన్ని సమస్యలు ఉత్పన్నం కావటం ఖాయం!



ఈ డిజాస్టర్ ఎమెండ్‌మెంట్ బిల్లు కూడా పాత సమస్యలనే పునరావృతం చేస్తుందా అన్న సందేహం ఉంది. ఇప్పుడున్న పరిస్థితులలో సత్వర సహాయం విపత్తు బాధితులకు అందించటమే లక్ష్యంగా ఉన్నప్పుడు కేంద్రం ఫండ్స్‌ను తమ ద్వారానే అందించాలనే దృక్పథంతో ఈ బిల్లులోని ప్రొవిజన్స్ ప్రతిపాదిస్తే... అది మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉండదు. రాష్ట్రాలు ఇలాంటి సందర్భాలలో కేంద్రం వైపు చూస్తూ ఫండ్స్ కోసం పడిగాపులు కాయటం పరిష్కారం కానేకాదు!

ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోటానికి కావల్సింది డబ్బూ, పనిచేసే అధికారులూ, వాలంటీర్లు, ఎన్జీవోలతో పాటు, మానవత్వం కలిగిన అనేక ఆర్గనైజేషన్ల సముదాయాలు. ప్రకృతి ప్రసాదించిన వనరులను సమయానుకూలంగా సద్వినియోగం చేసుకోటానికి ప్రభుత్వాలు పైసా పైసా లెక్కకట్టి సహాయాలు వర్షాలూ, వరదలూ పోయిన నెలనాళ్ళకు మేమున్నాం– మా సహాయం ఇది అని చెప్పటానికి యంత్రాంగాలూ, యాక్ట్‌లూ, డిజాస్టర్ మానేజ్‌మెంట్ ప్రణాళికలూ అవసరం లేదు!

ఈ డిజాస్టర్ ఎమెండ్‌మెంట్ బిల్లు కూడా పాత సమస్యలనే పునరావృతం చేస్తుందా అన్న సందేహం ఉంది. ఇప్పుడున్న పరిస్థితులలో సత్వర సహాయం విపత్తు బాధితులకు అందించటమే లక్ష్యంగా ఉన్నప్పుడు కేంద్రం ఫండ్స్‌ను తమ ద్వారానే అందించాలనే దృక్పథంతో ఈ బిల్లులోని ప్రొవిజన్స్ ప్రతిపాదిస్తే... అది మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉండదు. రాష్ట్రాలు ఇలాంటి సందర్భాలలో కేంద్రం వైపు చూస్తూ– ఫండ్స్ కోసం పడిగాపులు కాయటం పరిష్కారం కానేకాదు! పాత బిల్లు, డిజాస్టర్స్‌ను ఎదుర్కోవటంలో లోటుపాట్లను పూరించలేకపోవటం వల్లనే ఈ కొత్త బిల్లు తలపెట్టారన్న విచక్షణను దూరం చేసుకోకూడదు! కానీ ఈ బిల్లు ఆ అవసరాన్ని తీరుస్తుందా? కేంద్రం ఇచ్చే ఆర్థిక వనరుల విషయంలో స్పష్టమైన అవగాహన, సత్వర పరిష్కార మార్గాలు – డిజాస్టర్స్ మేనేజ్‌మెంట్ ఎమెండ్‌మెంట్ యాక్ట్ ప్రతిబింబించాలి! అధికారాలు ముఖ్యంగా ఫండ్స్ విషయంలో క్రిందిస్థాయి అధికారులు వినియోగించే విధంగా ఉంటేనే ఫలితాలు ఈ యాక్ట్ విజయానికి తోడ్పడతాయి! కలెక్టర్ స్థాయి అధికారులకు ఎన్నో విషయాల్లో విచక్షణాధికారాలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్నప్పుడు, కేంద్రం ఇచ్చే విపత్తుకు సంబంధించిన ఆర్థిక వనరులను మొదటే ఎందుకు అందజేయకూడదు. ఇది ఆలోచించాల్సిన విషయం!

స్థూలంగా విశ్లేషిస్తే విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లుకు రాజ్యాంగపరంగా సాధికారత సంక్రమించిందా లేదా అన్నది కూడా నిర్ణయించాల్సిన అంశం. 'విపత్తు నిర్వహణ' (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అన్న పదం కేంద్ర–రాష్ట్ర ఉమ్మడి జాబితాల్లో ఎక్కడా లేదు. రాష్ట్ర జాబితాలలోని అంశాలు సైతం– ఉదాహరణకు చీడపీడల వంటివి– విపత్తుల జాబితాలో ఉన్నాయి. సామాజిక భద్రత, సామాజిక బీమా, ఉపాధి–నిరుద్యోగం అనే విషయాలకు సంబంధించిన ఎంట్రీ ఆధారంగా ఈ సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది. ఒక విధంగా ఇది రాష్ట్రాల శాసనాధికారాల్లోకి చొచ్చుకొని రావటమే! సామాజిక భద్రత కింద అన్ని విపత్తు అంశాలను చేర్చే అవకాశం లేదు కాబట్టి ఈ బిల్లు అసంపూర్ణమని న్యాయకోవిదులూ, విపక్షాలూ వాదిస్తున్నాయి! ముందు చెప్పినట్లు అధికారుల విధినిర్వహణలో స్పష్టత లేని విధానంతో గందరగోళం వల్ల విపత్తు సహాయక చర్యలకు ఆటంకం కలిగించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి!

విపత్తు నిర్వహణకు సంబంధించి కేంద్రానికి విస్తృత అధికారాలు ధారాదత్తం చేయటం స్పష్టంగా ఈ బిల్లు ప్రతిబింబిస్తున్నది! రాష్ట్రాలవారీగా... ఉదాహరణకు తెలుగు రాష్ట్రాలలో సంభవిస్తున్న సైక్లోన్లు, సునామీలూ, వరదలూ, వర్షాల పరిస్థితులకు అనుగుణంగా విపత్తు నిర్వహణ విధానాలూ, కార్యక్రమాల రూపకల్పన– ఈ రాష్ట్రాలకే ఇచ్చినట్లయితే ఎప్పటికప్పుడు నిర్వహణ సక్రమంగా వుండేది! అది లోపించిందన్నది ఈ బిల్లులో స్పష్టంగా కనపడుతున్నది! రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లోని మూడు జాబితాలలో ఏ ఒక్క జాబితాలో కూడా విపత్తు నిర్వహణ అంశం పేర్కొనకపోవటం వల్ల కేంద్రం అవశిష్ట అధికారం కింద తామే ఈ విషయంలో కూడా చట్టాలు చేయొచ్చని భావిస్తున్నది. అందువల్ల రాజ్యాంగబద్ధమే అని కూడా కేంద్ర ప్రభుత్వం అనుకోవటంలో తప్పులేదు కానీ, క్షేత్ర స్థాయి అనుభవాల దృష్ట్యా ఆర్థిక వనరులతో సహా అన్ని అధికారాలు రాష్ట్రాలకు ఇస్తే, మరింతగా విపత్తుల నిర్వహణ కార్యక్రమాలు సాఫీగా జరిగే అవకాశాలు వున్నాయి!

ఏది ఏమైనా 2005 ఒరిజినల్ యాక్ట్‌కు తలపెట్టిన ఎమెండ్‌మెంట్ 2024 బిల్లును మరింత లోతుగా అధ్యయనం చేసి, క్షేత్రస్థాయిలో ఎక్కువ అధికారాలు బిల్లులో కల్పిస్తేనే... ఈ విపత్తు నిర్వహణ ఎమెండ్‌మెంట్ బిల్లు లక్ష్యం నెరవేరుతుంది!

• రావులపాటి సీతారాంరావు

పారా ఒలంపిక్స్ విజేతలకు సెల్యూట్

పారిస్ వేదికగా జరిగిన విశ్వ క్రీడల సమరం ముగిసింది. ఒలంపిక్స్‌లో గతంలో కన్నా ఎక్కువగా మన క్రీడాకారులు రాణించకపోయిన పారా ఒలంపిక్స్‌లో మాత్రం మన క్రీడాకారులు అద్భుతంగా రాణించారు. ఆశించిన స్థాయి కంటే ఎక్కువ గానే రాణించి ఎక్కువ పతకాలు సాధించారు. గతంలో టోక్యో వేదికగా జరిగిన ఈ క్రీడల్లో 19 పతకాలకే పరిమితమైన మన క్రీడాకారులు ఈసారి పతకాల సంఖ్యను పెంచుకొని ఏడు స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలు... మొత్తం 29 పతకాలు సాధించి పతకాల పట్టికలో 16వ స్థానంలో మన దేశాన్ని నిలిపారు. అంచనాలకు మించి అద్వితీయమైన ప్రదర్శన చేసి మన దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఈ క్రీడలో పాల్గొన్న క్రీడాకారులది ఒక్కొక్కరిదీ ఒక్కొక్క విజయగాథ. ప్రస్తుత యువత వీరి విజయాలను గమనించాల్సిన అవసరం ఉంది. నేటి యువత టెక్నాలజీ ఉచ్చులో చిక్కుకొని తమ సమయాన్ని మొత్తం సోషల్ మీడియాకు అంకితం చేసి సమయాన్ని వృధా చేస్తున్నారు. అనేక మంది రీల్స్ పిచ్చిలో చిక్కుకొని విచిత్ర పోకడలకు పోయి మృతి ఒడిలోకి పోతున్నారు. కొందరు యువత మత్తు మందులకు బానిసలుగా మారి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. అలాంటి యువతకు ఈ క్రీడాకారులందరూ ఒక స్ఫూర్తిదాయకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరి విజయగాథలను పాఠ్యపుస్తకాల ద్వారా నేటి విద్యార్థి లోకానికి అందించాల్సిన అవసరం ఉంది.

– చింత ఎల్లస్వామి

కేంద్రానికి వక్ఫ్‌పై కన్నెందుకు పడింది?

నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో 1995 – కేంద్ర వక్ఫ్ చట్టానికి సవరణలు చేస్తూ 'వక్ఫ్ సవరణ బిల్లు – 2024' తీసుకొచ్చింది. ప్రస్తుతం వక్ఫ్ బోర్డులో ఉన్న అవినీతిని, భూ మాఫియాను అరికట్టి పారదర్శకతను తీసుకురావడానికి ఈ సవరణలు తీసుకొస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వాదిస్తున్నది. ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలతో పాటు మిగతా పార్టీల నేతలు కూడా ఈ సవరణ బిల్లు మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని, వక్ఫ్ ఆస్తుల రక్షణకు భంగం కలిగిస్తుందని, వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తుందని తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షాల విమర్శలకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ బిల్లును జాయింట్ పార్లమెంటు కమిటీకి పంపింది. మొత్తం 31మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ సెప్టెంబరు 17 వరకు తన అభిప్రాయాలను కేంద్రం ముందు పెట్టబోతుంది.

1954లో తొలిసారిగా వక్ఫ్ చట్టం రూపుదిద్దుకుంది. 1995, 2013లో కొన్ని సవరణలు జరిగాయి. ప్రస్తుత మోదీ ప్రభుత్వం మొత్తం 44 సవరణలు ప్రతిపాదిస్తూ ఈ బిల్లును తీసుకువచ్చింది. ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులలో పారదర్శకత కోసమే ఈ బిల్లు తీసుకొస్తున్నామని అన్నారు. తన ప్రసంగంలో సచార్ కమిటీ నివేదికలో వక్ఫ్ ఆస్తుల నిర్వహణ గురించి పేర్కొన్న కొన్ని విషయాలను ప్రస్తావించారు. జస్టిస్ రాజేందర్ సచార్ తన నివేదికలో వక్ఫ్ ఆస్తుల నిర్వహణ సరిగా లేదని, దీంతో రావాల్సినంత ఆదాయం రావట్లేదని అన్నారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణను పటిష్ఠం చేసి, తద్వారా మార్కెట్ రేటుకు అనుగుణంగా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని సూచించారు. బిల్లుపై చర్చ సందర్భంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ విషయాలనే పదే పదే వల్లెవేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వచ్చిన సచార్ కమిటీలో ఉన్న విషయాలనే ప్రస్తావిస్తున్నానని నొక్కి చెప్పారు. గత పదేళ్ల మోదీ పాలనలో ఒక్కసారైనా ఈ సచార్ కమిటీ నివేదికను పరిశీలించారా? వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడం కోసం ఏమన్నా చర్యలు తీసుకున్నారా? సచార్ కమిటీ సూచించిన 'ఆల్ ఇండియా వక్ఫ్ సర్వీసెస్' ఏర్పాటు చేశారా? ఇవేవీ మచ్చుకైనా లేవు. కానీ మూడవసారి అధికారంలోకి వచ్చాక వక్ఫ్ చట్టానికి ఏకంగా 44 సవరణలు ప్రతిపాదించడం దేన్ని సూచిస్తుంది? ఇది రాజకీయ ఎజెండాలో భాగం కాదా? ముస్లింలకు తాము వ్యతిరేకంగానే ఉన్నామనే రాజకీయ ఉద్దేశాన్ని ప్రదర్శించడం కాదా? తద్వారా త్వరలో జరిగే వివిధ రాష్ట్రాలలో మెజారిటీ వర్గం ఓట్లను రాబట్టుకోవడమనే వ్యూహం ఇందులో లేదా?

ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం దేశవ్యాప్తంగా మొత్తం వక్ఫ్ ఆస్తుల విలువ రూ. 1 లక్షా 20 వేల కోట్లు. వక్ఫ్ ఆస్తులను సక్రమంగా నిర్వహిస్తే సంవత్సరానికి వేల కోట్ల ఆదాయం వచ్చే మాట నిజమే. ఇలా వచ్చిన ఆదాయం పేద ముస్లింల విద్య, వైద్యం, సంక్షేమం కోసం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వాలకు కూడా కొంత భారం తగ్గుతుంది. కానీ వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. వక్ఫ్ గెజిట్‌లో ఉన్న ఆస్తులు పూర్తిగా వక్ఫ్ బోర్డుల ఆధీనంలో లేవు. దేశవ్యాప్తంగా అనేక చోట్ల ప్రభుత్వాల ఆధీనంలోను, ప్రయివేటు వ్యకుల చేతిలోను ఉన్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 70శాతం వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని నివేదిక ఉంది. వాస్తవ విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా దేశంలోనే రైల్వే, ఆర్మీ తర్వాత అత్యధిక ఆస్తులు కలిగిన సంస్థగా వక్ఫ్ బోర్డు ఉందని కేంద్రం ప్రచారం చేస్తుంది. ఇక మోదీ భక్తులయితే వెంటనే వక్ఫ్ ఆస్తులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద హిందువులకు పంచాలని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దేవాదాయ శాఖ కింద ఉన్న భూములతో పంపకాలు మొదలుపెడితే బాగుంటుదని అడిగితే ఏమని సమాధానం చెపుతారు?

వక్ఫ్ ఆస్తులను కబ్జాలు చేసుకుంటుంది కేవలం ప్రయివేటు వ్యక్తులే కాదు, ప్రభుత్వాలు కూడా వేలాది ఎకరాలను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నాయి. అనేక రాష్ట్రాలలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు వక్ఫ్ భూములలోనే నిర్మాణమయ్యాయి. చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శంషాబాద్‌లో ఉన్న ఇప్పటి ఏయిర్ పోర్ట్ నిర్మాణానికి 1100 ఎకరాల వక్ఫ్ భూమిని కేటాయించారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హాజరత్ హుస్సేన్ షా వలి దర్గాకు చెందిన 1600 ఎకరాల వక్ఫ్ భూమిని బహుళ జాతి కంపెనీలకు కట్టబెట్టారు. ఈ భూమి విలువ అప్పటి మార్కెట్ ధర ప్రకారమే రూ.32 వేల కోట్లు అని అంచనా. ఈ కేటాయింపుపై వక్ఫ్ బోర్డు నాడు వక్ఫ్ ట్రిబ్యునల్‌లో కేసు వేసింది. ట్రిబ్యునల్ భూమి కేటాయింపును రద్దు చేస్తూ, ఆ భూమి వక్ఫ్ బోర్డుదేనని అంతిమ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ కంపెనీలు ప్రభుత్వ సహకారంతో హైకోర్టును ఆశ్రయించాయి. హైకోర్టు కూడా ట్రిబ్యునల్ తీర్పును సమర్థిస్తూ కేసును కొట్టి వేసింది. కంపెనీలు చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారం సరిగా లేక వక్ఫ్ బోర్డు సుప్రీంకోర్టులో కేసు ఓడిపోయింది. ప్రస్తుతం ఉన్న చట్టంలోని కొన్ని లొసుగులతో వక్ఫ్ ఆస్తులు సంరక్షించబడడం లేదు. ప్రస్తుతం వక్ఫ్ బోర్డులకు జ్యుడీషియల్ అధికారాలు లేవు. ఇక ఈ చట్టానికి ఏకంగా 44 సవరణలు చేసిన తర్వాత వక్ఫ్ చట్టం ఎంత బలహీనంగా మారుతుందో ఒకసారి ఊహించండి.

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు తెస్తున్నది వక్ఫ్ ఆస్తులను రక్షించడం కోసం కాదు, ఈ ఆస్తులను తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని, వక్ఫ్ బోర్డుల పరిధిలో ఉన్న లక్షల ఎకరాలపై కేంద్రం కన్ను పడింది. కేంద్రం తన అనుకూల పారిశ్రామికవేత్తలకు ఈ భూములను కట్టబెట్టాలని చూస్తుంది. అందుకే ఆప్ నేత సంజయ్ సింగ్ ఇది వక్ఫ్ బిల్లు కాదు, అదానీ బిల్లు అని విమర్శించారు. బోర్డులో పారదర్శకత సాకుతో బోర్డుకు ఉన్న స్వయంప్రతిపత్తిని గుంజుకోవాలని ఆలోచిస్తుంది. పాత చట్టం ప్రకారం వక్ఫ్ ట్రిబ్యునల్ ఒక ఆస్తిని వక్ఫ్ బోర్డుదని నిర్ణయిస్తే, ఇక ట్రిబ్యునల్ తీర్పే అంతిమం. ఈ తీర్పు మీద సివిల్ కోర్టులలో ఛాలెంజ్ చేసే అధికారం లేదు. కేవలం హైకోర్టు, సుప్రీం కోర్టులలో మాత్రమే ఛాలెంజ్ చేసే అవకాశం ఉంది. నూతన సవరణ ప్రకారం ట్రిబ్యునల్ నిర్ణయమే అంతిమం కాదు. జిల్లా కలెక్టర్ నిర్ణయమే అంతిమం. ఫలానా భూమిని సర్వే చేసి అది వక్ఫ్ బోర్డుదా లేక ప్రయివేటుదా అని నిర్ణయించే అధికారం జిల్లా కలెక్టర్‌దే. అంటే ట్రిబ్యునల్ నామమాత్రమే. చాలా కేసులలో రెవెన్యూ శాఖకు, వక్ఫ్ బోర్డుల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. ఇలాంటి సందర్భాలలో జిల్లా కలెక్టర్ ఎటువైపు ఉంటాడు? ప్రభుత్వ పెద్దల మాటలను కలెక్టర్లు పూర్తిగా పెడచెవిన పెట్టే పరిస్థితి ప్రస్తుతం ఉందా?

మరో సవరణ ప్రకారం వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరులను నామినేట్ చేస్తారు. ముస్లిం ధార్మిక సంస్థలో ఇతరులకు ప్రవేశం ఎందుకు? ఈ జోక్యం దేనిని సూచిస్తుంది? ఎండోమెంట్ కమిటీలలో ఇతర మత మైనారిటీలకు ప్రవేశం కల్పిస్తారా? ఒక్క వక్ఫ్ బోర్డులోనే ముస్లిమేతరులు ఎందుకు? – ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. ముస్లిం మహిళలకు బోర్డులో సభ్యులుగా అవకాశం కల్పించడం కోసం మరో సవరణ చేశారు. దీంతో ముస్లిం మహిళలకు కూడా న్యాయం జరుగుతుందని కేంద్రం అంటుంది. మరి బిల్కిస్ బానోను రేప్ చేసిన నిందితులను క్షమాభిక్ష కింద విడుదల చేసింది ఎవరు? గత పదేళ్ల మోదీ పాలనలో ఎంతమంది ముస్లిం మహిళలకు న్యాయం చేశారు? పాత చట్టం ప్రకారం యజమాని తన ఆస్తిని ఇష్టపూర్వకంగా డాక్యుమెంట్ చేసి వక్ఫ్ బోర్డుకి దానం చేయవచ్చు. కానీ నూతన సవరణ ప్రకారం యజమాని తన కుటుంబ సభ్యుల సమక్షంలో మాత్రమే వక్ఫ్ చేయాలి. ఇలా మొత్తం 44 సవరణలు తెచ్చింది. ఈ బిల్లును బలోపేతం చేయడం కోసం కాదు, నిర్వీర్యం చేయడం కోసమే. దీంతో కబ్జాదారులకు మరింత బలం చేకూరుతుంది. వక్ఫ్ పరిపాలనలో ప్రభుత్వాల జోక్యం మరింత పెరుగుతుంది.

ప్రస్తుతం వక్ఫ్ బోర్డులలో పారదర్శకత లోపించడం, రాజకీయ జోక్యం ఉండడం, అవినీతి పేరుకుపోవడం నిజమే. ఆస్తులు ఉన్నా సరియైన ఆదాయం మాత్రం వక్ఫ్ బోర్డుకు రావడం లేదు. వందల ఏళ్లుగా ఒకే అగ్రిమెంట్ ప్రకారం లీజులు నడుస్తున్నాయి. కమర్షియల్ ఆస్తుల ద్వారా వచ్చే మొత్తం ఆదాయంలో కేవలం 7శాతం ఆదాయం మాత్రమే వక్ఫ్ బోర్డుకి వస్తుంది. మిగతాది లీజు మేనేజ్‌మెంట్ వారికి పోతుంది. మార్కెట్ రేటుకు అనుగుణంగా లీజు ధరలు పెంచలేదు. చాలా చోట్ల వక్ఫ్ ఆస్తులకు పర్యవేక్షులుగా ఉన్న ముతవల్లీలు, ముజావర్లు ఈ ఆస్తులు తమ తాతముత్తాల పేటెంట్‌గా భావిస్తూ పెత్తనం చలాయిస్తున్నారు. వక్ఫ్ బోర్డులో నిర్వహణ లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉంది. వీటిని సాకుగా చూపి వక్ఫ్ ఆస్తులను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని కేంద్రం ప్రయత్నించడం సిగ్గుచేటు.

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు తెస్తున్నది వక్ఫ్ ఆస్తులను రక్షించడం కోసం కాదు, ఈ ఆస్తులను తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని. వక్ఫ్ బోర్డుల పరిధిలో ఉన్న లక్షల ఎకరాలపై కేంద్రం కన్ను పడింది. కేంద్రం తన అనుకూల పారిశ్రామికవేత్తలకు ఈ భూములను కట్టబెట్టాలని చూస్తున్నది. అందుకే ఆప్ నేత సంజయ్ సింగ్ ఇది వక్ఫ్ బిల్లు కాదు, అదానీ బిల్లు అని విమర్శించారు.



■ సలీమ్ పాష
(తెలంగాణ ముస్లిం సంఘాల జేఏసీ)



ఆకలి ఆరాటం

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆకలి బాధలు ఇంకా తీరలేదు. సర్వం వరదపాలు కావడంతో ప్రభుత్వం అందించే భోజన ప్యాకెట్లు.. దాతలు పెడుతున్న ఆహారం కోసమే చాలామంది బాధితులు ఎదురుచూస్తున్నారు. పాయకాపురంలో మంగళవారం జరిగిన ఆహార పంపిణీలో పట్టెడన్నాన్ని ప్లేట్‌లో చూసి చిన్నారులు ఇలా ఆనంద పడిపోయారు.



వరద.. బురద.. : పాయకాపురంలో పరిస్థితి ఇదీ..



కష్టాల కన్నీరు : వరద అనంతరం ఇంటి పరిస్థితి చూసి రోదిస్తున్న మహిళ



మందులూ మిగల్లేదు : వైఎస్సార్ కాలనీలో ఓ మెడికల్ షాపు దుస్థితి



అయ్యో బియ్యం : వైఎస్సార్ కాలనీలో పాడైపోయిన రైస్



కన్నీరే మిగిలింది.. : వైఎస్సార్ కాలనీలో ఓ ఇంటి పరిస్థితి

వరద వేదన

- నరకయాతన అనుభవిస్తున్న వరద బాధితులు
- నామరూపాల్లేకుండా మారిన ఇళ్లు
- నాశనమైపోయిన వస్తువులు

కళ్లల్లో కడలంతా ఆవేదన.. గుండెల్లో కొండంత వేదన.. వరద చెర వీడినా చెదిరిపోయిన తమ బతుకులను తలచుకుంటూ ప్రశ్నార్థకంగానే ఇళ్లకు చేరుకుంటున్నారు వరద బాధితులు. నామరూపాల్లేకుండా పోయిన ఇళ్లను, నాశనమైపోయిన సామాన్లను చూసి నిశ్చేష్టులైపోతున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులే నెలకొన్నా.. అసాధారణంగా మారిన పరిసరాలను చూసి కంటతడి పెట్టుకుంటున్నారు. అజిత్‌సింగ్‌నగర్, వాంబేకాలనీ, వైఎస్సార్ కాలనీ, కేఎల్‌రావు నగర్, కబేళా, విద్యాధరపురంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఎవరిని కదిలించినా కన్నీరు తప్ప మరొకటి రావట్లేదు. మొరాయించిన వాహనాలతో అష్టకష్టాలు పడుతున్నవారు కొందరైతే, పూర్తిగా పాడైపోయిన దుకాణాలు చూసి బోరుమంటున్న వారు ఇంకొందరు. అస్తవ్యస్తంగా మారిన ఇళ్లలో అడుగుపెట్టి ఆశ్చర్యపోతున్నవారు కొందరైతే, ఇంకా ముంపులోనే ఉన్న ఇళ్లకు ఎప్పుడు వెళ్తామా అని ఎదురుచూసేవారు ఇంకొందరు. టన్నులకొద్దీ పేరుకుపోయిన వ్యర్థాలు, వస్తువులను నిరాటంకంగా తొలగిస్తున్నది పారిశుధ్య కార్మికులైతే, బాధితులకు ఇంకా భోజన సదుపాయాలు కల్పిస్తూ బాసటగా నిలుస్తున్నారు దాతలు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



వీడని చెర : ఇంకా ముంపులోనే పాతపాడులోని మీనాక్షి నగర్



నాడు

నాడు ఏరుగా సింగ్‌నగర్‌లోని డాబాకొట్లు సెంటర్



నేడు

నేడు ఊరుగా సింగ్‌నగర్‌లోని డాబాకొట్లు సెంటర్



బతుకు బండలు.. : వైఎస్సార్ కాలనీలో పరిస్థితి

ఆపరేషన్ బుడమేరు

పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : బీభత్సం సృష్టించిన బుడమేరుకు వరదలు తగ్గిపోవడంతో అధికారులు క్లీనింగ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. వరదకు కొట్టుకొచ్చిన చెత్తాచెదారాన్ని కాల్వ నుంచి తొలగించే పనులను వేగవంతం చేశారు. బుడమేరు నగరంలోకి ప్రవేశించే దగ్గర నుంచి నగరాన్ని వీడే వరకూ ఉన్న వ్యర్థాలను తొలగిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటి వరకు 8,860 మెట్రిక్ టన్నుల చెత్తాచెదారాన్ని తొలగించగా, అందులో 1,000 మెట్రిక్ టన్నుల వరకు బుడమేరు వ్యర్థాలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. బుడమేరు ప్రక్షాళన కోసం 30 ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేశారు. వీటిని తరలించేందుకు 50 నుంచి 60 టిప్పర్లను ఏర్పాటు చేశారు. ఈ ఆపరేషన్ మరో రెండు రోజులు కొనసాగే అవకాశముంది.

ఇన్స్యూరెన్స్.. ఇదిగో ఇక్కడ

సబ్ కలెక్టరేట్‌లో ఇన్స్యూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలోని సబ్ కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇన్స్యూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌కు పెద్ద సంఖ్యలో వాహనదారులు, దుకాణదారులు, వ్యాపారులు వస్తున్నారు. మొత్తం 27 ఇన్స్యూరెన్స్ కంపెనీలు ఈ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పనిచేస్తున్నాయి. ఇన్స్యూరెన్స్ క్లెయిమ్స్ చేసుకునే వారికి ఇది ఉపయోగపడుతుంది. రెండు రోజులుగా క్లెయిమ్స్ చేసుకోవటానికి వస్తున్నారు కానీ, ఆశించిన స్థాయిలో మాత్రం రావట్లేదు. ఈ ఇన్స్యూరెన్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన సమాచారం ఇంకా చాలామందికి తెలియకపోవడమే ఇందుకు కారణం. దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరముంది. ప్రస్తుతం వస్తున్న వారిలో ఆటోవాలాలు, మ్యాక్సీ క్యాబ్‌వాలాలు, ద్విచక్రవాహనదారులు, దుకాణదారులే ఉంటున్నారు.

కొండచరియలు జారిపడి

- మాచవరంలో ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు

6లో..

నేటి నుంచి రైట్‌రైట్

- 70 ఆర్టీసీ బస్సుల పునరుద్ధరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం నుంచి ఆర్టీసీ సేవలు ప్రారంభం కానున్నాయి. వరదల కారణంగా 70 ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. వీటిలో చాలా వరకు బుధవారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఎంతమేర బస్సులు తిప్పగలమన్న అంశంపై మంగళవారం ఆర్టీసీ అధికారులు పరిశీలన జరిపారు. అయితే, ప్రధాన రహదారులకు పెద్దగా ఇబ్బంది లేకపోవడంతో కొన్ని బస్సులను పునరుద్ధరించాలని నిర్ణయించారు. నున్న, నూజివీడు, విస్సన్నపేటకు వెళ్లే బస్సు సర్వీసులపై కొంత అనుమానాలు ఉన్నా.. వరద ఇబ్బంది లేకపోతే బస్సులు పంపిస్తామని అధికారులు తెలిపారు. వరదల కారణంగా వారం రోజులుగా సగానికి పైగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఇబ్రహీంపట్నం డిపో పరిధిలో 84 బస్సులకు 30 తిరిగేవి. విద్యాధరపురం డిపోలో 141 బస్సులకు 8 తిరిగేవి. ఈ డిపో మొత్తం నీట మునగడంతో 40 బస్సుల వరకూ దెబ్బతిన్నాయి. ఇక గవర్నర్ పేట-1 డిపో పరిధిలో 113 బస్సులకు 71, గవర్నర్ పేట-2 డిపో పరిధిలో 139 బస్సులకు 56 నడిచేవి. విజయవాడ, ఆటోనగర్ డిపోలకు సంబంధించి 80 శాతం బస్సులు తిరిగాయి. ప్రస్తుతం పరిస్థితులు చక్కబడుతున్న నేపథ్యంలో దాదాపు అన్ని బస్సులు పునరుద్ధరించాలని చూస్తున్నారు.

దసరా ఉత్సవ కమిటీలో మంత్రులు, ఉన్నతాధికారులు

6లో..



తోట్లవల్లూరులో నాశనమైన కంద



ఎంత కష్టం.. ఎంత నష్టం

- అన్నదాతకు తీరని వేదన మిగిల్చిన వర్షాలు, వరదలు
- నాలుగు నెలల్లో అనావృష్టి, అతివృష్టితో అష్టకష్టాలు

కోటి ఆశలతో ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభించిన రైతన్నకు నాలుగు నెలల్లోనే అనావృష్టి, అతివృష్టి పరిస్థితులు కోలుకోలేని దెబ్బతీశాయి. జూన్, జూలై నెలలో నారుమడులను కాపాడుకున్న రైతులు, నాట్లు వేసిన అనంతరం ఆగస్టులో సాగునీరు లేక అల్లాడిపోయారు. ఇక ఆగస్టు చివరి రెండు రోజులు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, వరదలకు నిండా మునిగిపోయారు. వరి పొలాలు ఇంకా నీటమునిగే ఉన్నాయి. లంక భూముల్లోని ఉద్యాన పంటలు నాశనమైపోయాయి. ఆక్వా సాగు కూడా అక్కరకు రాకపోవడంతో అన్నదాతలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఈ ఏడాది 1.65 లక్షల హెక్టార్లలో వరిసాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. ఆగస్టు నెలాఖరు నాటికి 1.20 లక్షల హెక్టార్లలో సాగు జరిగింది. ఆగస్టు 29, 30, 31 తేదీల్లో కురిసిన భారీవర్షాలకు 25 మండలాల్లోని 410 గ్రామాల్లో 41,542 హెక్టార్లలో పంట పొలాలు నీటమునిగాయి. అలాగే, ఈనెల 1వ తేదీ నుంచి వరద పోటెత్తి గుడివాడ, నందివాడ, పెదపారుపూడి, ఉంగుటూరు, గన్నవరం తదితర మండలాల్లోని పొలాలు మునిగిపోయాయి. వారం రోజులుగా వరిపైరు పరిస్థితి ఇదే. దుబ్బు దశలో నీటిలో ఉండిపోవడంతో పైరు కుళ్లిపోతోంది. కంకిపాడు మండలంలోని ఏల్చూరు మంతెన, ఉప్పులూరు, తెన్నేరు తదితర గ్రామాల్లో వరిపైరు ఇంకా నీటమునిగే ఉంది.

నాట్లు వేసే అవకాశముందా..?

భారీ వర్షాలు, వరద కారణంగా సాగు దెబ్బతినడంతో రైతులు ఏం చేయలేని స్థితిలో ఉండిపోయారు. పొలాల్లో నీరు తగ్గాక మళ్లీ నాట్లు వేసేందుకు నారు అందుబాటులో లేదు. మళ్లీ నాట్లు వేసినా నవంబరు, డిసెంబరుకు గానీ పంట చేతికి అందదు. అయితే, వరద నీరు తగ్గిన తరువాత నిర్ణయం తీసుకుంటామని రైతులు చెబుతున్నారు.

4,006.79 హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు

జిల్లాలోని కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, ఉయ్యూరు, పమిడిముక్కల, బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం, మచిలీపట్నం, చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, అవనిగడ్డ, మొవ్వ, పామర్రు, నాగాయలంక మండలాల్లో సాగుచేసిన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. 4006.79 హెక్టార్లలో ఆయిల్‌పాం, కూరగాయలు, తమలపాకు, పసుపు, కంద, బెండ, నిమ్మ, జామ, బొప్పాయి, మొక్కజొన్న, అరటి తదితర పంటలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. కౌలు సొమ్ముతో పాటు పెట్టిన పెట్టుబడి కూడా వరదలో కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోలుకోవడానికి రెండేళ్ల సమయం పడుతుందంటున్నారు. చల్లపల్లి మండలంలోని వెలివోలు గ్రామంలోని లంక భూముల్లో 55 ఎకరాల్లో చేపట్టిన మల్బరీ సాగు కూడా నాశనమైంది. అలాగే, పట్టు పురుగులను పెంచే షెడ్లు నీటమునగడంతో వాటిని సరిచేసుకునే పనిలో వెలివోలు గ్రామ రైతులు ఉన్నారు.



వెలివోలులో దెబ్బతిన్న పట్టు గూళ్లను చూపిస్తున్న రైతు

వివిధ శాఖలకు రూ.280 కోట్ల నష్టం

భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులు 24 దెబ్బతినగా, రూ.68.65 కోట్ల నష్టం జరిగింది. పంచాయతీరాజ్‌కు సంబంధించి 193 రహదారులు 308 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. వీటి నష్టం రూ.141 కోట్లు. మత్స్యశాఖకు సంబంధించి 2181.73 హెక్టార్లలో చేపలు, రొయ్యల చెరువులు నీటమునిగాయి. 40 బోట్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖకు రూ.64.16 లక్షల మేర నష్టం వాటిల్లింది. మొత్తంగా జిల్లావ్యాప్తంగా వివిధ శాఖలకు సంబంధించి రూ.280 కోట్ల మేర నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

వరద మిగిల్చిన.. కన్నీటి వ్యథ!

ఆదుకోండి..



కృష్ణానది వరద ముంపుతో కుళ్లిపోయిన కంద తోట

- గతంలో ఎన్నడూ లేనంతగా వరద
- ఇంకా ముంపులోనే పంట పొలాలు
- చేతికొస్తుందనుకున్న పంట నీటి పాలు
- వేల ఎకరాల్లో పంటలకు తీరని నష్టం

కృష్ణానది వరదకు తీర గ్రామాలు కకావికలమయ్యాయి. వందల కోట్లలో నష్టం వాటిల్లింది. ఇళ్లు నీట మునిగాయి. పంటలు సర్వనాశనమయ్యాయి. ఇప్పట్లో కోలుకోలేనంతగా దెబ్బతినటంతో బాధితులు అల్లాడిపోతున్నారు.

కంచికచర్ల/జి.కొండూరు/మైలవరం సెప్టెంబరు 10 : మండలంలో కృష్ణా తీర గ్రామాల్లో గనిఆత్కూరు ఒకటి. మొత్తం 16 వందలకు పైగా కుటుంబాలు గ్రామంలో నివశిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా కృష్ణానది వరద తీరని దుఃఖాన్ని మిగిల్చింది. గ్రామంలో ఎవరిని కదలించినా జరిగిన నష్టాన్ని తలుచుకుంటూ కంటతడి పెడుతున్నారు. గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల మేర వరద పోటెత్తింది. కొద్ది ఇళ్లు తప్ప అన్నీ వరద ముంపునకు గురయ్యాయి. ధాన్యం, ఎరువులు, ఇతర సామగ్రి దెబ్బతిన్నాయి. విద్యార్థుల పుస్తకాలు, విలువైన సర్టిఫికెట్లు నీటిలో నానిపోయాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టగా మొలకలు వస్తున్నాయి. నది మధ్యలో ఆరువందల ఎకరాలకు పైగా లంక భూములున్నాయి. కంద, పసుపు, అరటి, మొక్కజొన్న సాగుచేశారు. రోజుల తరబడి నీటిలో మునిగి ఉండటం వల్ల పంటలు పనికిరాకుండా కుళ్లిపోయాయి. రెండు వందల ఎకరాల్లో కంద ఖర్చు ఎకరానికి సగటున రూ. 2.50 లక్షలతో సాగుచేశారు. లంక భూముల్లోనే జరిగిన నష్టం కోట్లలో ఉంది. సుమారు వెయ్యి ఎకరాలకు పైగా మెట్ట పంటలు దెబ్బతిన్నాయి. పత్తి, మొక్కజొన్న ఎక్కువగా సాగు చేశారు. పంటలన్నీ దెబ్బతిన్నాయని, జరిగిన నష్టం అంతా ఇంతా కాదని తెలుగు రైతు నేత మూరకొండ ఏడుకొండలు ఆవేదన వెలిబుచ్చారు. పశువులకు మేత కరువైంది. ఒకవైపు పచ్చి మేత లేదు.. ఎండుగడ్డి కూడా లేదు. ప్రభుత్వ సాయం అందేలా కృషిచేస్తానని బాధితులకు భరోసా ఇచ్చారు.



తడిసిన ధాన్యానికి మొలకలు



వెలగలేరులో అడ్రస్ లేకుండా పోయిన మామిడి చెట్లు

నిండా ముంచిన బుడమేరు, పులివాగు..

బుడమేరు, పులివాగుకు వచ్చిన వరదలు రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. పులివాగు పోటెత్తడంతో తోట రామకృష్ణ అనే రైతుకు చెందిన బొప్పాయి తోట పూర్తిగా నేలమట్టమైంది. అంతర పంటలు నామరూపాలు లేకుండా పోయాయి. టమోటా, బంతి పూలు, మల్లి తోట దెబ్బంది. జి.కొండూరు మండలంలో బుడమేరు, పులివాడు వరదలకు, ఇబ్రహీంపట్నం మండలాల్లో కృష్ణా వరదలకు వరి మొత్తం నామరూపాలు లేకుండా పోయింది. ఇప్పటికీ వరి పొలాలు నీటిలోనే నానుతున్నాయి.

- కవులూరు-శాంతినగర్ రోడ్డుకు మూడు చోట్ల, కవులూరు-వెలగలేరు రోడ్డుకు మూడు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. మరోవైపు రెవెన్యూ అధికారులు దెబ్బతిన్న పంటలకు నష్టం అంచనా వేస్తున్నారు.
- మైలవరం చంద్రబాబు నగర్‌లో నివాసం ఉంటున్న కందుర్తి హైమావతి ఇల్లు బుడమేరు వరదకు నీరు రావడంతో కూలిపోయింది. కాయ కష్టం చేసి చిన్న గూడు నిర్మించుకుంటే వరదకు ముంచేసిందని, ఆదుకోవాలని కన్నీటి పర్యంతమైంది.



దెబ్బతిన్న బొప్పాయి తోట



నిండా మునిగాం..

జెట్టి శ్రీనివాసరావు సామాన్య రైతు.. లంకలో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని కంద, అరటి సాగు చేశాడు. ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని ఎంతో ఆశపడ్డాడు. ఆయన ఆశలు అడియాసలయ్యాయి. ఉప్పెనలా కృష్ణానది వరదకు తోటలు కకావికలమయ్యాయి. నాశనమైన తోటలను చూసి బాధతో కుమిలిపోతున్నాడు. రూ. 50 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. కృష్ణానది వరద మిగిల్చిన కన్నీటి వ్యథ ఇది. తీర గ్రామమైన గనిఆత్కూరు రైతులందరిదీ ఇదే పరిస్థితి. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.





బాధితులందరికీ నిత్యావసర సరుకులు

- ముంపు ప్రాంతాల్లో మంత్రి నారాయణ పర్యటన

విజయవాడ లీగల్ : వరద బాధితులందరికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని మంత్రి నారాయణ అన్నారు. ముంపు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. కుందా వారి కండ్రిక, నున్న-నూజివీడు రోడ్డులో ఇప్పటికీ వరద నీరు కొనసాగుతోంది. ఇళ్ల మధ్యన నీటిని మోటార్ల ద్వారా బయటికి తరలిస్తున్న పనులను మంత్రి పరిశీలించారు. భారీ మోటార్లు ఏర్పాటు చేసి.. రోడ్లకు గండ్లు కొట్టారు. పొక్లెయిన్‌లు, భారీ యంత్రాలతో నీటి తరలింపు పనులను పర్యవేక్షించారు. కండ్రిక చుట్టుపక్కల కొన్నిప్రాంతాల్లో ఇప్పటికీ ఉన్న నీటిని సాయంత్రంలోగా తరలించేలా ఏర్పాట్లు చేశారన్నారు. వరద నీరు తగ్గగానే పారిశుధ్య పనులు ప్రారంభించారు. ఇప్పటికే వరద నష్టం అంచనాల ప్రక్రియ కూడా జరుగుతోందని, నష్టంపై నివేదిక సిద్ధం కాగానే ఎంత పరిహారం ఇవ్వాలనేది సీఎం నిర్ణయం తీసుకొంటారన్నారు. ఇప్పటి వరకు లక్షా 75 వేల మందికి నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. సాయంత్రానికి పూర్తిగా అందరికీ అందిస్తామన్నారు.

ఎన్యూమరేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి : కలెక్టర్ సృజన

కృష్ణలంక : వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో టెలీకాన్ఫరెన్సులో అధికారులతో ఆమె మాట్లాడుతూ, నష్ట గణాంకాల నమోదులో కచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా యాప్‌లో వివరాలను నమోదు చేయాలని, ఎప్పటికప్పుడు యాప్‌లో అప్డేట్ చేస్తున్న అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బృందసభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏమైనా సందేహాలుంటే నోడల్ అధికారులను సంప్రదించి నివృతి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

విపత్తులోను జగన్ విధ్వంసకర రాజకీయాలు

- 90 రోజుల చంద్రబాబు పాలనకు జనం జేజేలు
- వరదలను సమర్థంగా ఎదుర్కొన్నాం : నెట్టెం రఘురాం



జగ్గయ్యపేట, సెప్టెంబరు 10 : విపత్తులోను మాజీ సీఎం జగన్ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడటం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, మాజీమంత్రి నెట్టెం రఘురాం విమర్శించారు. సీఎం చంద్రబాబు రేయింబవళ్లు వరద ముంపులో ఉన్న ప్రజలను ఎలా గట్టెక్కించాలా, ఎలా ఆదుకోవాలా అని పర్యవేక్షి స్తే, జగన్ బెంగుళూరు ప్యాలెస్‌లో విలాసాలు అనుభవిస్తూ ప్రభుత్వంపై ఎలా బురద చల్లాలా.. ప్రజలను ఎలా ఇబ్బందులు పెట్టాలా.. అని చూశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నెట్టెం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, జగన్ ఆలోచన విధానాన్ని ప్రజలు గమనించి జాగరూకతతో ఉండాలని కోరారు. అధికారం చేపట్టిన 90 రోజుల్లో అవిశ్రాంతంగా జగన్ విధ్వంసక, అరాచక పాలన దుష్ఫలితాలను తొలగిస్తు, గాడి తప్పిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటు, కేంద్రం నుంచి అమరావతి, పోలవరానికి నిధులు తెస్తున్న చంద్రబాబు పాలనను ప్రజలు హర్షిస్తున్నారని



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్బారావు

బాధ్యతాయుతంగా సర్వే నిర్వహించాలి : డీఈవో

చిట్టినగర్, సెప్టెంబరు 10 : బాధ్యతాయుతంగా అధికారులు విధులు నిర్వహించి ముంపు బాధితుల వివరాలను, ఆస్తి నష్టాన్ని నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. మంగళవారం చిట్టినగర్‌లో ముంపు నష్టం సర్వేపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి స్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేయాలన్నారు. ఇంట్లో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ తదితర గృహోపకరణాలు గుర్తించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, వార్డు సెక్రటరీలు, వీర్వోలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. 46, 47వ డివిజన్‌లలో మంగళవారం వరద ప్రభావిత ప్రాంతాలలో ఆస్తి నష్టపోయిన బాధితుల వివరాలను నమోదు చేశారు. డివిజన్‌లలో వార్డు సెక్రటరీలు, వలంటీర్ల క్లస్టర్ల ప్రకారం అధికారులు ముంపు ప్రాంతాలకు వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నారు.

కొండచరియలు జారిపడి..

- ఒకరి మృతి.. ఇరువురికి గాయాలు



కొండచరియలు పడిన ప్రదేశం.. మృతుడు ఇజ్జాడ రాము

గుణదల, సెప్టెంబరు 10 : చెట్టు కొడుతున్న క్రమంలో కొండచరియ విరిగిపడి ఒకరు చనిపోగా, ఇరువురికి గాయాలైన ఘటన మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల ఎదురు రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. మోడ్రన్ సూపర్ మార్కెట్ పక్క సందులో కొండ పక్కన నివాసితులు కొండపైన చెట్టును కొట్టేందుకు ముగ్గురు కూలీలను మాట్లాడారు. వారిలో ఇజ్జాడ రాము(55) చెట్టు ఎక్కి చెట్టు కొడుతుండగా వర్షానికి నాని ఉన్న కొండచరియ విరిగి పడింది. ఇజ్జాడ రాము అక్కడికక్కడే చనిపోగా, మరో ఇద్దరు బాసూరి కామయ్య(58), కల్లా రాజు(58)లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, బొప్పన భవకుమార్‌లు ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మాచవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంటల వ్యవధిలోనే రూ 5లక్షల పరిహారం అందజేత

కొండచరియ జారిపడిన ఘటనలో మృతుడు ఇజ్జాడ రాము కుటుంబానికి ప్రభుత్వ సాయం రూ. 5లక్షల చెక్కును ఎమ్మెల్యే ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన కొద్ది గంటల వ్యవధిలోనే స్పందించి రూ 5లక్షలు మంజూరు చేసింది.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

వినాయక చవితి ఫ్లెక్సీ వివాదం

జనసేన కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తల దాడి.. సోషల్‌మీడియాలో వైరల్.. కేసు నమోదు

మచిలీపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకల ఫ్లెక్సీలో ఫోటో వివాదం టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య దాడికి కారణమైంది. ఈ విషయం బయటకు రాకుండా కూటమి నేతలు రాజీ చేసినా.. సోషల్ మీడియాలో వైరల్ అవడంతో చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. నగరంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఘటనకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని ఎస్పీ ఆర్. గంగాధరరావు పోలీసులను ఆదేశించారు. దీంతో చిలకలపూడి స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నంలోని నాయర్ బడ్డీ సెంటరులో గణపతి నవరాత్రుల సందర్భంగా జనసేన కార్యకర్త యర్రంశెట్టి నాని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాడు. ఇందులో టీడీపీ కార్యకర్తల ఫొటోలు వేయలేదు. ఫ్లెక్సీలలో తమ పొటోలు వేయకపోవడాన్ని తప్పుబట్టిన టీడీపీ కార్యకర్త సంకు శ్రీను ఈనెల 8వ తేదీన ఫ్లెక్సీలను చించివేశాడు. మరుసటిరోజు యర్రంశెట్టి నాని నాయర్ బడ్డీసెంటరులోని తన బంధువైన శాయనశ్రీను ఇంటిలో ఉండగా అక్కడకు తన అనుచరులు 30 మందితో కలిసి సంకు శ్రీను వెళ్లాడు. యర్రంశెట్టి నాని, అతని బంధువులపై దాడిచేశారు. ఇంటిలోని సామగ్రిని ధ్వంసం చేశారు. ఫ్లెక్సీలలో తమ ఫొటోలు వేయకపోవడం తప్పేనని కాళ్లు పట్టుకుని మరీ చెప్పించారు. ఈ ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. వివాదం బయటకు రాకుండా ఇరువర్గాల మధ్య జనసేన నాయకులు రాజీ చేశారు. అయితే ఘటనకు సంబంధించిన వీడియోలు బయటకురావడం, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎస్పీ సీరియస్ అయ్యారు. యర్రంశెట్టి నాని, అతని బంధువులపై దాడిచేసిన వారిపై కేసునమోదు చేయాలని ఎస్పీ ఆదేశించడంతో చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. దీంతో పార్టీలకు సంబంధం లేదని, ఇరువర్గాల మధ్య ఉన్న విభేదాల కారణంగానే జరిగిందని, వైసీపీ నాయకులు ఘటనపై దుష్ప్రచారం చేస్తున్నారని మచిలీపట్నం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దసరా ఉత్సవ కమిటీలో మంత్రులు, ఉన్నతాధికారులు

- ప్రజలకు, ప్రభుత్వానికి ధైర్యం, స్థైర్యం కలిగేందుకు త్వరలో శాంతి యజ్ఞం
- ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



దుర్గగుడి అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఆనం

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో అక్టోబరు 3 నుంచి జరగనున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేయనున్న కమిటీలో హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రి పి. నారాయణ, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, పలువురు ఉన్నతాధికారులను నియమించనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దుర్గగుడి అధికారులతో మంగళవారం సమీక్ష అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఫెర్రీలో నిర్వహిస్తున్న నవ హారతులను ఇక నుంచి అమ్మవారి పాదాల చెంత దుర్గాఘాట్‌లోనే నిర్వహించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించినట్టు తెలిపారు. ఆలయ భద్రత కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే ఆలయ ఉద్యోగులను తొలగిస్తామని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు కూడా సక్రమంగా పనులు పూర్తిచేయకపోతే ఇతర కాంట్రాక్టర్లను తీసుకుని వారిచేత పనులు చేయిస్తామని స్పష్టం చేశారు. ఉత్సవాలను గతంకన్నా మిన్నగా, ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. బుడమేరు వరదలు, అధిక వర్షాలకు అపార నష్టం జరిగిందని, ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని.. ఇటువంటివి ప్రకృతిపరంగా, దైవికంగాగాని సంభవిస్తుంటాయని, ఉపద్రవ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు, ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధైర్యం, స్థైర్యం కలిగేందుకు అందరితో చర్చించి శాంతి యజ్ఞాన్ని నిర్వహించ తలపెట్టినట్టు తెలిపారు. ఏ విపత్తు వచ్చినా ముందుగా దైవాన్ని ప్రార్థిస్తామని అందుకే దైవానుగ్రహం కోసం ఈ శాంతి యజ్ఞాన్ని నిర్వహిస్తామన్నారు. దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రతాపరంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం కొన్ని తాత్కాలిక పనులు జరిగినప్పటికీ, దసరా ఉత్సవాల నాటికి ఒక సమగ్రమైన ప్రణాళిక ప్రకారం పటిష్ట చర్యలతో ఉత్సవ నిర్వహణకు కృషి చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణాన్ని, ఇక్కడ పరిస్థితులను అధ్యయనం చేసేందుకు తాను సంబంధిత అధికారులతో కలిసి వచ్చానని చెప్పారు. త్వరలోనే స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆలయ అధికారులతో ఒక సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశంలో చేయాల్సిన పనులపై, కొండ పటిష్టతపై మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి అమలు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పనులకు తోడు ఒక అనుబంధ రోడ్డు కూడా కావాలని అడుగుతున్నారని, దానికోసం కూడా ప్రయత్నిస్తామన్నారు. అంతకుముందు రామనారాయణ రెడ్డి కొండపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని చెప్పారు. ఏర్పాట్లు విషయంలో ఎటువంటి లోపం జరిగినా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా సంబంధిత అధికారులపై తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గతంలో జరిగిన లోపాలను, ఇబ్బందులను పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. దసరా ఉత్సవాలకు సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రెండు, మూడు రోజుల్లో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఆలయ ఈవో కె.ఎస్.రామారావు, చీఫ్ ఇంజనీర్ జీవీ శేఖర్, సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ సివిల్ డిపార్టుమెంట్ డీన్ పాండురంగారావు, దుర్గగుడి ఈఈలు, డీఈలు, ఏఈఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి ఆనం

కనకదుర్గమ్మవారిని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం.. శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.



చంద్రబాబుకు చెక్కు ఇస్తున్న మాలకొండయ్య

వరద బాధితులకు రూ. 6 లక్షలు

జి.కొండూరు : వరద బాధితుల సహాయార్థం ప్రముఖ వ్యాపార వేత్త కొండా మాలకొండయ్య రూ.5 లక్షల చెక్కును, ఈషా రెటీనా ఫౌండేషన్ ఐ ఆసుపత్రి అధినేత కొండ రాజేష్ రూ.1లక్ష చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, దేవరపు మాల్యాద్రి, కొండా మహేష్, మేడసాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మునేటిలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు

ఇంకా లభ్యంకాని చంటి ఆచూకీ..

నందిగామ, సెప్టెంబరు 10 : మునేటి వరదలో గల్లంతైన మాడుగల చంటి ఆచూకీ ఇంకా లభ్యంకాలేదు. సోమవారం మునేటిలో ఈతకు దిగి గల్లంతైన చంటి కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలిస్తున్నాయి. మరబోట్ల సాయంతో మధిర వంతెన వద్ద నుంచి కీసర వంతెన వరకూ నిశితంగా పరిశీలిస్తున్నారు. ఆర్డీవో రవీంద్రరావు, తహసీల్దార్ సురేష్‌ల పర్యవేక్షణలో గాలింపు జరుగుతోంది. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, బీజేపీ నేత బండారు కేధార్‌నాథ్ తదితరులు అధికారులతో మాట్లాడుతున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



జగ్గయ్యపేట రూరల్ : బూదవాడ గ్రామానికి చెందిన లావుడియా నాగేశ్వరరావు (53) కాలనీలోని కనదుర్గమ్మ ఆలయంలో ఇటీవల పాలేరు నదికి వచ్చిన వరదతో పేరుకుపోయిన చెత్తాచెదారం, బురద తొలగిస్తు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలోని 50 కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు

అమరావతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ ద్వారా పత్తి సేకరణకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఈ ఏడాది 50 కేంద్రాల ద్వారా పత్తి సేకరించనున్నారు. ప్రస్తుత సీజన్‌లో 5.79 లక్షల ఎకరాల్లో పత్తి సాగవ్వగా, 6లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం పొడవు పింజ పత్తి క్వింటా రూ.7,521, పొట్టి పింజ పత్తి రూ.7,121 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపింది. నోటిఫై చేసిన కేంద్రాల్లో సీసీఐ పత్తి సేకరణకు జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ప్రభుత్వం కమిటీలను నియమించింది. ఈ-క్రాప్ డేటా ఆధారంగా పత్తి రైతులను గుర్తించాలని, పత్తి కొనుగోలుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేసి, కొనుగోలు కేంద్రాల్లో సాయంత్రం 5గంటల్లోపు పత్తి సేకరించాలని సూచించింది.

చంద్రబాబు నివాసంపై దాడి కేసులో నిందితుడు దుర్గా ప్రసాద్ అరెస్టు

ఇబ్రహీంపట్నం : తాడేపల్లిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు నివాసంపై దాడి ఘటనలో పాల్గొన్న పాలడుగు దుర్గాప్రసాద్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కొంతకాలంగా దుర్గాప్రసాద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. గుంటుపల్లిలోని తన నివాసంలో ఉన్న దుర్గాప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చంద్రబాబు నివాసంతో పాటు మాజీ మంత్రి దేవినేని ఉమాపై దుర్గాప్రసాద్ దాడికి పాల్పడ్డాడు.

పీసీసీ ఉపాధ్యక్షుడిగా గురునాథం

విజయవాడ లీగల్, సెప్టెంబరు 10 : పీసీసీ ఉపాధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది, బార్ మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ వి.గురునాథంను నియమిస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ, దాదాపు 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో అంకితభావంతో పనిచేస్తున్నానని, రాహుల్‌ను ప్రధానిని చేయడమే తన లక్ష్యమని తెలిపారు. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. బార్ కౌన్సిల్ మెంబర్ సూరాబత్తుల మల్లేశ్వరరావు, బార్ న్యాయవాదులు తదితరులు గురునాథంను ఘనంగా సత్కరించారు.



గురునాథంను సత్కరిస్తున్న న్యాయవాదులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	119, 128, 139
చికెన్ విత్ స్కిన్	228
చికెన్ స్కిన్‌లెస్	238

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

ధర్మపథం వేదికపై

పురాణ పండిట్ వెంకటేశ్వర శాస్త్రి ప్రవచనం



వన్‌టౌన్, సెప్టెంబరు 10: దుర్గామల్లేశ్వర దేవస్థానం ధర్మపథం వేదికపై మంగళవారం దుర్గగుడి పురాణ పండిట్ వెంకటేశ్వర శాస్త్రి అమ్మవారి ప్రాశస్త్యం గురించి ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ముగ్గురమ్మల మూలపుటమ్మగా దుర్గాదేవి భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తోందని, ఆమె మహిమలు అపారమని, ఆమె మహిమాన్విత శక్తి భక్తులకు అనుభవంగా ఉందని ఆయన అమ్మవారి పాశస్త్యం గురించి బహు విధాలుగా వర్ణించారు. భక్తుల హర్షధ్వానాలు అందుకున్నారు.

దుర్గగుడి క్యూలలో ఫ్యాన్లు ఏర్పాటు

వన్‌టౌన్, సెప్టెంబరు 10: దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తుల సౌలభ్యం కోసం క్యూలలో దాదాపు 100 కొత్త సీలింగ్ ఫ్యాన్లను అమర్చుతున్నారు. ఈ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యంగా పండుగలు, పర్వదినాలు, సెలవు దినాలలో భక్తుల రాక అత్యధికంగా ఉంటోంది. ముఖ్యంగా ఉచిత క్యూలలో భక్తులు అమ్మవారి దర్శనం కోసం సుమారు రెండు నుంచి నాలుగు గంటలు సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఈ సమయంలో క్యూలలో ఉన్న భక్తులు గాలిలేక ఇబ్బందులు పడుతుంటారు. వారి ఇబ్బందులు తొలగిస్తూ కొత్త ఫ్యాన్లను అమర్చుతున్నారు. రానున్న దసరా ఉత్సవాల సమయంలో కూడా భక్తులు అధిక సమయం పాటు వేచి ఉన్న సందర్భంలో ఈ ఫ్యాన్లు ఉపయోగపడతాయని భావిస్తున్నారు.

వరద బాధితులకు ప్రభుత్వం అండ

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, సెప్టెంబరు 10: వరద బాధితులకు కూటమి ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. డివిజన్ పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం 4వ డివిజన్లోని వెంకటేశ్వరనగర్లో పర్యటించి పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వరనగర్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు లక్ష రూపాయలు, కాకతీయ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు లక్ష రూపాయలు వరద బాధితుల సహాయార్థం అందజేయాలని కోరుతూ చెక్కును గద్దె రామ్మోహన్‌కు అందజేశారు. వరద బాధితులకు సహాయం అందజేసేందుకు నగరంలోని కాలనీవాసలుఉ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ కార్యాలయంలోనే ఉంటూ వరద సహాయ కార్యక్రమాలు చూసుకంటున్నారని తెలిపారు. వైసీపీ నాయకులు ఇవేమీ పట్టనట్లుగా టీడీపీపై దుష్ప్రచారం చేయడమే పనిగా పెట్టుకోవడం నగర ప్రజలతోపాటు రాష్ట్ర ప్రజలంతా చూస్తునే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, కాలనీ వాసులు రావి కృష్ణారావు, ముసునూరి ఆనంద కిషోర్, కొల్లి ప్రసాద్, నాని, కోనేరు శివాజి, వజ్రా రామకృష్ణారావు, సింహాద్రి బాపినీడు తదితరులు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న బెజవాడ జ్యూయలరీ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు, ఆఫ్కాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ప్రతినిధి, సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, బీజేపీ ఆధ్వర్యంలో బియ్యం, రూట్స్ హెల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

ప్రతి ఒక్కరికీ కూటమి సాయం

● మంత్రి నాదెండ్ల మనోహర్

వన్‌టౌన్, సెప్టెంబరు 10: ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం తరఫున సహాయం అందుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం ఆయన జక్కంపూడి కాలనీలో పర్యటించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 వ్యాన్‌లను పెట్టి ప్రతి ఒక్క కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందచేస్తున్నామన్నారు. వరదల వల్ల ఏ కుటుంబానికి ఎంత నష్టం జరిగిందన్న దానిపై గణాంకాలు వేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందచేస్తున్న బియ్యం, నిత్యావసర సరుకులను బాధితులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, జనసేన నాయకురాలు తిరుపతి అనూష, టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, పేటేటి నాంచారయ్య, కూటమికి చెందిన పలువురు పాల్గొన్నారు.



బియ్యం, నిత్యావసర సరుకులు అందచేసిన మంత్రి మనోహర్, ఎమ్మెల్యే వసంత తదితరులు



ఐఏఎస్ గణేష్ కుమార్‌ను సత్కరిస్తున్న కూటమి నాయకులు

ముంపు ప్రాంతం స్పెషల్ ఆఫీసర్‌కు సత్కారం

విద్యాధరపురం, సెప్టెంబరు 10: విద్యాధరపురంలో వరద ముంపు ప్రాంతాల స్పెషల్ ఆఫీసర్ జి. గణేష్ కుమార్‌ను ఎన్డీయే నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. పశ్చిమ నియోజకవర్గం 43వ డివిజన్ పరిధి వరద ముంపు ప్రాంతాలకు ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్‌గా ఐఏఎస్ అధికారి జి. గణేష్ కుమార్‌ను నియవిుంచింది. ఆయన వరద బాధితులకు విశేష సేవలు అందించి బాధితులకు అండగా నిలబడ్డారు. ఆయన చేసిన సేవలు గుర్తించి 43వ డివిజన్ ఎన్డీయే నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు.

బాధితులకు బాసటగా...

విజయవాడ లీగల్, సెప్టెంబరు 10 : ముఖ్యమంత్రి సహాయనిధికి బెజవాడ జ్యూయలరీ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు జిల్లా కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం కలిసి రూ.5 లక్షల చెక్కును విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రతిభ జ్యూయలరీస్ అధినేత గోలి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరంలోని అన్ని అసోసియేషన్‌లు, సంస్థల ప్రతినిధులు కూడా ముఖ్యమంత్రి సహాయనిధికి ఆర్థికసాయం అందించాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసి చెక్‌ను సమర్పించిన వారిలో కేజీఎన్ ప్రసాద్, సీహెచ్.జగన్మోహనరావు, దినేష్, గోలి రవిరాజా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలంక: ఆఫ్కాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ చార యూనిట్ గుజరాత్ వైస్‌ప్రెసిడెంట్ ఐ.విద్యాసాగర్ చొరవతో ఉద్యోగులు ఒకరోజు వేతనం రూ.3.50 లక్షల డీడీని ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందచేశారు. సివిల్ ఇంజినీరింగ్ పట్టభద్రులు అయిన విద్యాసాగర్ తరఫున ఆయన ఇంజినీరింగ్ సహచర విద్యార్థి, సమాచార శాఖ అధికారి సీవీ కృష్ణారెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు విరాళాన్ని డీడీ రూపంలో అందజేశారు.

సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

సత్యనారాయణపురం: సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు మురళీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో మంగళవారం బుడమేరు వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. 10కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, పంచదార, చింతపండు, గోధుమరవ్వ, లీటర్ నూనె ప్యాకెట్, టీపొడి, నాలుగు పాలప్యాకెట్ల కిట్‌ను బుడమేరు మధ్యకట్ట, విజయదుర్గానగర్ వాసులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ఫ్యాన్స్ అధ్యక్షుడు నున్న శివనాగేశ్వరరావు, అప్పలరాజు, సత్యనారాయణ రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

5 టన్నుల బియ్యం పంపిణీ

పటమట : విజయవాడ వరద బాధితులను ఆదుకునే విధంగా బీజేపీ జిల్లా కార్యాలయం నుంచి ముంపు ప్రాంతాలైన సింగ్‌నగర్, పాయకాపురం, వాంబే కాలనీ, రామలింగేశ్వర్‌నగర్ ప్రజలకు నెల్లూరు బీజేపీ కార్మిక నాయకులు మాలకొండయ్య వారి మిత్ర బృందం 5 టన్నులు బియ్యంను మంగళవారం పంపిణీ చేశారు. 10 కేజీల చొప్పున ప్యాకెట్‌లను జక్కంపూడికి చెందిన వేద పాఠశాల విద్యార్థులు బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ మధుకర్, కొత్తూరి వెంకట సుబ్బారావు, తిరుపతిరావు, సగ్గుర్తి శ్రీనివాసరావు, విష్ణు గుప్త, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవల్లి శ్రీధర్, రమాదేవి, పిట్టల గోవింద్, తూర్పు కన్వీనర్ పోతంశెట్టి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.



బాధితురాలికి బ్యాగ్ అందిస్తున్న మంత్రి నారాయణ

బాధితులకు భోజనాలు పంపిణీ



వన్‌టౌన్: 64వ డివిజన్ కండ్రిక ప్రాంతంలో బాధితులకు ఏర్పాటు చేసిన భోజనాల పంపిణీ కార్యక్రమానికి మాజీ మంత్రి, టీడీపీ ఉపాధ్యక్షురాలు పీతల సుజాత, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిలతో కలిసి ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వరద బాధితుల సమస్యలు, కావాల్సిన వస్తుసామాగ్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో పది రోజులుగా పర్యటిస్తూ బాధితుల సమస్యలు తెలుసుకుంటూ వారికి అండగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి. ప్రసాద్, కె. రవికుమార్, పి. భాగ్యలక్ష్మి, కె.వరలక్ష్మి, గిరి, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాచౌక్: రజక అభ్యుదయ సంఘం, టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి వల్లూరు మధుసూదనరావు ఆధ్వర్యంలో నగరంలోని వరద బాధితులకు నిత్యావసర సరుకులు మంగళవారం పంపిణీ చేశారు. తొలుత గాంధీనగర్‌లోని రజక అభ్యుదయ సంఘం కార్యాలయంలో చిట్యాల ఐలమ్మ 38వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. బేబీ సరోజ, అల్లూరి శేషగిరిరావు, వల్లూరి ఈశ్వరరావు, రొంపవలస అప్పారావు, బెజ్జవరపు సింహాచలం, టీడీపీ 36వ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, బీసీ నేత బోను సుందరం పాల్గొన్నారు.

దహించు అగ్ని మినిస్ట్రీస్ సాయం

ధర్నాచౌక్: వారం రోజులుగా దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసరాలు, దుస్తులు తదితర వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వరద బాధితులకు సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం 1500 దుప్పట్లు, 1500 షర్టులు, 1500 చీరలు, 1500 నైటీలు, 4000 లగేజీ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. దహించు అగ్ని అధ్యక్షుడు డాక్టర్ థామస్ , టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు, టీడీపీ నేతలు పట్టాభిరామ్, పీతల సుజాత, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ అమర్లపూడి శేఖర్ పాల్గొన్నారు.

రూట్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

పటమట : రూట్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరద బాధితులకు మూడో విడత దుస్తుల పంపిణీని మంగళవారం ఆటోనగర్ గమేళా బజార్‌లో చేపట్టినట్లు ఆ సంస్థ ఛైర్మన్ డాక్టర్ పోలవరు విజయభాస్కర్ తెలిపారు. 150 మందికి దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. బాధితుల కోసం బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సభ్యులు శర్మ, విజయలక్ష్మి, తారకలక్ష్మిలు పాల్గొన్నారు.

డ్రెయినేజీ కాల్వపై ఐరన్ గ్రిల్ ఏర్పాటు


వన్‌టౌన్, సెప్టెంబరు 10: స్థానిక జెండాచెట్టు రోడ్డు డ్రెయినేజీ కాల్వపై మంగళవారం వీఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది కొత్త ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేశారు. గతంలో డ్రెయినేజీపై ఉన్న ఐరన్ గ్రిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో కొందరు ప్రమాదాల బారిన పడ్డారు. ఈ సమస్యను తెలుసుకున్న 53వ డివిజన్ కార్పొరేటర్ మహదేవ్ అప్పాజీరావు సంబంధిత కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మంగళవారం అధికారులు ఆ ప్రదేశాన్ని పరిశీలించి హుటాహుటిన మరో కొత్త ఐరన్ గ్రిల్‌ను ఏర్పాటు చేశారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న సతీష్‌కుమార్

బాధితులు, పారిశుధ్య కార్మికులకు చీరలు, దుప్పట్ల పంపిణీ

భవానీపురం, సెప్టెంబరు 10 : వాసవీ క్లబ్ గోమతి, వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో 43వ డివిజన్ హెచ్‌బీ కాలనీలోని వరద బాధితులు, పారిశుధ్య కార్మికులకు రూ.50వేలు విలువైన 180 మందికి చీరలు, దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లను గోల్డెన్ కేసీజీఎఫ్ జిల్లా గవర్నర్ కేఎల్‌వీ సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మంగళవారం భవానీపురంలో పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు పచ్చిపులుసు శివప్రసాద్, టీడీపీ వాణిజ్య విభాగం నాయకురాలు వల్లభనేని ప్రసన్నలక్ష్మిలు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ముంపు ప్రాంతాల్లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిల ప్రియ పర్యటన

చిట్టినగర్, సెప్టెంబరు 10: వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. మంగళవారం 47వ డివిజన్ వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత సర్కిల్-1 కార్యాలయంలో పాలు, మంచినీరు ఆహారం పంపిణీ కేంద్రం వద్ద అధికారులను, స్థానిక నాయకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డివిజన్‌లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అధైర్యపడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు తదితరులుబ పాల్గొన్నారు.



ఆత్మహత్యల నివారణ దినోత్సవం ర్యాలీ

కుటుంబ సమస్యలే ఆత్మహత్యలకు కారణం

● ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ ర్యాలీ

గవర్నర్‌పేట, సెప్టెంబరు 10: కుటుంబంలో ఎదురయ్యే అనేక సమస్యలు కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి 7 లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వాటిని నివారించడంలో కుటుంబం, సమాజంతో పాటు మానసిక వైద్యుల పాత్ర ఎంతైనా అవసరమని మానసిక వైద్యులు డాక్టర్ అయోధ్య ఆర్.కె అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం సూర్యారావుపేటలోని మానస హాస్పటల్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాజ మానస, డాక్టర్ సూరె పవన్‌కుమార్, సైకాలజిస్టులు శ్రావణి, ప్రసాద్, అబ్దుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్య మాట్లాడుతూ ఆత్మహత్యలకు పాల్పడే వారి సంఖ్యలో స్త్రీల కంటే పురుషులే అధికంగా ఉంటున్నారని, స్త్రీలు చాలా వరకు ప్రయత్నాలతోనే ఆగిపోతున్నారని, పురుషులు మాత్రం ప్రాణాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆత్మహత్యలకు పాల్పడే వారిలో టీనేజర్లు, వృద్ధులే అధికంగా ఉన్నారని వివరించారు.

హనుమద్ గణపతి అలంకారంలో బాలగణపతి



వన్‌టౌన్, సెప్టెంబరు 10: స్థానిక పూజారి వారి వీధిలో బాలగణపతి స్వామివారి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 39వ పూజా మహోత్సవాల్లో భాగంగా మంగళవారం బాల గణపతి స్వామి భక్తులకు హనుమద్ గణపతి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం స్వామిని ప్రత్యేక అలంకారం చేసి పూజలు, సహస్ర మోదక పూజలు చేశారు. రాత్రి 7 గంటలకు శ్రీకృష్ణ ప్రార్థనా సంఘం సభ్యులతో భగవద్గీత 18వ అధ్యాయం పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రెసిడెంట్ గ్రంధి శ్రీనివాసరావు, సెక్రటరీ మామిడి కృష్ణారావు, జాయింట్ సెక్రటరీ ఆతుకూరి రామనరసింహారావు, ట్రెజరర్ మండేపూడి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విద్యాధరపురం, సెప్టెంబరు 10: భవానీపురం పరిధిలో 11 కేవీ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ మందిరం రోడ్డు, స్వాతి రోడ్డు, పోపూరివారి వీధి, ఎస్.ఎస్.దాస్ వీధి, హనుమయ్య వీధి, గుడివాడ రామారావు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

రిటైనింగ్ వాల్‌ను పటిష్టపరచాలి

● సీపీఎం నాయకుడు దోనేపూడి కాశీనాథ్

కృష్ణలంక, సెప్టెంబరు 10 : కృష్ణలంక 21వ డివిజన్‌లోని కోదండరామా ఘాట్ నుంచి వారధి వరకు కృష్ణానదిపై కట్టిన రిటైనింగ్ వాల్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం సీపీఎం రాష్ట్ర నాయకుడు దోనేపూడి కాశీనాథ్ ఆధ్వర్యంలో బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ ప్రజా రక్షణ గోడకు క్రాక్స్ వచ్చాయని, కోదండరామా ఘాట్ నుంచి వారధి లోపు దాదాపు 10 చోట్ల ఈ క్రాక్స్ ఏర్పడ్డాయన్నారు. వీటిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. ఈ అంశంలో నిర్లక్ష్యం, అవినీతికి తావులేకుండా అవసరమైతే విచారణ చేపట్టాలని, రిటైనింగ్ వాల్ నిర్మాణం జరిగినా వరద వచ్చిన పరిస్థితులపై పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ, తాడి రమణ, శివాజీ పాల్గొన్నారు.

నిత్యావసరాల కిట్‌ల అందజేత



లబ్బీపేట, సెప్టెంబరు 10: వరద బాధితులకు అంద జేసే నిత్యావసర కిట్‌లను బిషప్ హైస్కూల్‌లో మంగళవారం ఆయా ప్రాంతాల సంఘ పెద్దలకు కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండ బిషప్ డాక్టర్ తంటేపూడి జార్జ్ కొర్నేలియాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రాంతాల్లో నష్టపోయిన కుటుంబాలకు తమ సంస్థ తరఫున 10 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేస్తున్నామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న తమ సంఘ పెద్దల ద్వారా వీటిని బాధితులకు అందజేస్తామని ఆయన తెలిపారు. డాక్టర్ జాషువా కుమారి, తంటేపూడి రవి కుమార్, అలెగ్జాండర్, సునేష్ రవి కుమార్ పాల్గొన్నారు.

ఓర్వలేకే అసత్య ప్రచారాలు

అభ్యుదయ గ్రామీణ కమిటీ డ్వాక్రా అధ్యక్షురాలు దేవకి దేవీ

ధర్నాచౌక్, సెప్టెంబరు 10: వరదలను సీఎం చంద్రబాబు సమర్థవంతంగా ఎదుర్కొన్నందుకు డ్వాక్రా సంఘాల తరుఫున అభ్యుదయ గ్రామీణ కమిటీ డ్వాక్రా అధ్యక్షురాలు దేవకి దేవీ మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 75 ఏళ్ల వయస్సులో చంద్రబాబు యువకుడిలా పని చేస్తున్నారని కొనియాడారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా బాధితులకు సహాయం అందిస్తున్నారన్నారు. ప్రజల నుంచి ఆయనకు వస్తున్న ఆరదణ చూసి ఓర్వలేక మాజీ సీఎం జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోకపోగా ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమాలు చేస్తున్నారని విమర్శించారు.

నారాయణ ఐఐటీ బాలికల వితరణ



నారాయణ ఐఐటీ ఏసీ క్యాంపస్ బాలికలు వరద బాధితులకు వెయ్యి పాలప్యాకెట్లు, వెయ్యి బ్రెడ్డు ప్యాకెట్లు, 800 ఫుడ్, ఐదు వేల వాటర్ బాటిళ్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోర్ డీన్ పి.శ్రీనివాసులు రెడ్డి, డీన్ సి.వెంకటేశ్వరరెడ్డి, ఏజీఎం తాతినేని వినయ్, ప్రిన్సిపాల్, స్టాఫ్ పాల్గొన్నారు.

(నిన్నటి దిక్సూచి తరువాయి)

6G టెక్నాలజీ భారత్ సంసిద్ధత

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

6జీ సాంకేతికత దిశగా భారత్ ప్రయత్నాలు

2030 నాటికి భారతదేశంలో 6జీ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి 2023లో ఒక 'విజన్ డాక్యుమెంట్'ను విడుదల చేసి, పరిశోధన, కార్యాచరణ నిమిత్తం 'భారత్ 6జీ మిషన్'ను రెండు దశల కార్యక్రమంగా అమలులోకి తెచ్చారు.

1) భారత్ 6జీ విజన్: 6జీ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్‌ను ముందువరుసలో నిలబెట్టడం; 6జీ టెక్నాలజీపరమైన సాంకేతిక సమస్యల పరిష్కారం, ఈ టెక్నాలజీ ప్రముఖ సరఫరాదారుగా భారత్‌ను తీర్చిదిద్దడం, మేధోసంపత్తిపరంగా, అధిక నాణ్యత పరంగా భారత్ 6జీ రంగంలో విశేష కృషి జరపడం ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యాలు. వీటి సాధనకు 6జీ విజన్ ఆరు ప్రధాన మూల స్తంభాలను నిర్దేశించింది. వాటిలో ఒక్కోదానికి ఒక్కో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది.

6జీ విజన్‌లోని '6' మూలస్తంభాలు

1. బహుళ ప్లాట్‌ఫాం నెక్స్ట్ జనరేషన్ నెట్‌వర్క్‌లు.
2. మల్టీ-డిసిప్లినరీ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్
3. 6జీ స్పెక్ట్రమ్ గుర్తింపు
4. 6జీ పరికరాలు, వ్యవస్థలు
5. అంతర్జాతీయ ప్రమాణాల సాధన
6. పరిశోధన, అభివృద్ధి నిధులు

2) భారత్ 6జీ మిషన్: 2030 నాటికి భారత్‌లో 6జీ సేవలు ప్రవేశపెట్టేవిధంగా రెండు దశల్లో ఈ మిషన్‌ను అమలుచేయనున్నారు.

తొలిదశ(2023-2025): ఈ మిషన్ తొలిదశ రెండు సంవత్సరాల్లో వినూత్న ఆలోచనలు, సవాళ్లతో కూడిన విధానాలు, ఆలోచనలు, విధానాల ఆచరణాత్మకతను పరీక్షించడం వంటి ప్రయోగదశ నడుస్తుంది.

మలిదశ(2025-2030): ఈ దశలో, తొలిదశలో గుర్తించిన ఆలోచనలు, విధానాలకు మేధోసంపత్తి హక్కుల కల్పనకు, ప్రోటోటైప్‌ల రూపకల్పనకు, టెస్ట్‌బెడ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. విజయవంతమైన విధానాల అమలు, వాటి వాణిజ్యీకరణతో 6జీ సాంకేతికత జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అమలులోకి వస్తుంది.

- ఈ రెండు దశల భారత్ 6జీ మిషన్ అమలు పర్యవేక్షణ, ప్రామాణీకరణ, గుర్తింపు వంటి విధుల నిమిత్తం ఒక అపెక్స్ కౌన్సిల్ సైతం ఏర్పాటైంది.

3) భారత్ 6జీ కూటమి: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మక టెలికాం దౌత్యాన్ని కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ పట్టాలకెక్కించింది. దీనిలో భాగంగా బీ6జీఏ ఏర్పాటైంది. ఈ బీ6జీఏ పరిశోధన, సాంకేతిక బదిలీ సహకారం కోసం అంతర్జాతీయంగా పలు ఒప్పందాలు కుదుర్చుకుని దేశీయంగా 6జీ పరిశోధన, అభివృద్ధి వేగవంతం అవడానికి సహకరిస్తుంది.

- బీ6జీఏలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రమాణాల గుర్తింపు సంస్థలు వంటివి భాగస్వాములుగా/ సభ్యులుగా ఉంటాయి. బీ6జీఏ యూరప్‌కు చెందిన 6జీ స్మార్ట్ నెట్‌వర్క్స్ అండ్ సర్వీసెస్ ఇండస్ట్రీ అసోసియేషన్(6జీ-ఐఏ)తోనూ, ఫిన్‌లాండ్‌కు చెందిన ఔలు యూనివర్సిటీ 6జీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌తోనూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.
- అంతేకాక 2023లో జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా 6జీ రంగంలో అత్యున్నతస్థాయి పరిశోధనలు నిర్వహించడానికి అమెరికా-భారత్ మధ్య ఒప్పందం కుదిరింది.
- అదేవిధంగా భారత్ ఇప్పటికే 6జీ రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు లభించిన 127 కంటే ఎక్కువ పేటెంట్లను కలిగి ఉంది.

6జీ టెక్నాలజీ - అంతర్జాతీయ కృషి

6జీ టెక్నాలజీ అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. దక్షిణ కొరియా తన 6జీ నెట్‌వర్క్ కె-నెట్‌వర్క్‌ను 2028 నాటికి ప్రారంభించేందుకు సమాయత్తమవుతోంది. యురోపియన్ యూనియన్ హెక్సాఎక్స్ పేరుతో చేపట్టిన 6జీ నెట్‌వర్క్ పరిశోధన కార్యక్రమం ఈ ఏడాది ముగియనుంది. జపాన్ ఇంటిగ్రేటెడ్ ఆప్టికల్, వైర్‌లెస్ నెట్‌వర్క్ ఫోరమ్ 6జీ నెట్‌వర్క్ కోసం విజన్ 2030ని కలిగి ఉంది. అదేవిధంగా భారత్, చైనాలు తమ తమ 6జీ నెట్‌వర్క్‌ల కోసం 2030ని మైలురాయిగా నిర్ణయించుకున్నాయి.

'6జీ' అభివృద్ధి చేయడంలో సవాళ్లు

1. భారత్, ఇతర అనేక దేశాల్లో 5జీ నెట్‌వర్క్ ఇంతవరకూ పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. పైగా దానికి మించిన వేగం గల 6జీని ప్రవేశపెట్టాలంటే సంబంధిత అవస్థాపన సౌకర్యాల పరంగా విశేష పెట్టుబడులు, వ్యవస్థల్లో మార్పులు భారీఎత్తున అవసరమవుతాయి.
2. వేగంతోపాటు వచ్చే భద్రత, ఇతర అంశాల పరమైన సమస్యల అంచనా, పరిష్కార యంత్రాంగ ఏర్పాటు కూడా అంతసులువుగా సాధ్యమయ్యే అంశాలు కావు. భారీఎత్తున అంతర్జాతీయ కృషి జరపాల్సి ఉంటుంది.
3. ప్రస్తుతం వినియోగదారుల వద్ద గల హ్యాండ్‌సెట్‌లు, ఇతరత్రా పరికరాలన్నింటినీ 6జీ కెపబిలిటీ(అనువర్తన) కోసం మార్చాల్సి ఉంటుంది. ఇది ఆర్థికంగా వినియోగదారులకు భారం అవుతుంది.

అయితే సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధిని ఆ కారణాలు చూపి అడ్డుకోజాలం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. కాకపోతే దాని దుష్ప్రభావాలను నివారించే సమాయత్తత కోసం ముందుగానే కృషి చేయాల్సి ఉంటుంది. కావాలంటే కృత్రిమమేధలో విశృంఖల అభివృద్ధిని నిలువరించేందుకు దాని వేగాన్ని తగ్గించే ప్రయత్నాలు జరిపినవిధంగా 6జీ దుష్ప్రభావాలను నివారించడానికి కూడా ఒక అంతర్జాతీయ అవగాహనతో ముందుకు వెళ్లవచ్చు.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

దిక్సూచి

SCHOLARSHIP ALERT

Santoor Scholarship

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.

Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.

Applicants must have: - passed Class 10 from a local government school. - passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And - enrolled in a full-time graduate programme starting in 2024-25.

- Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply. - Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum

Last Date to Apply: 23-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SWS7

Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

- Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

Last Date to Apply: 20-09-2024

Url: www.b4s.in/aj/ASPI2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి



హై వోల్టేజ్ యాక్షన్‌తో వస్తున్నాం

ఎన్టీఆర్

'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం తర్వాత నా సోలో మూవీగా 'దేవర' మీ ముందుకొస్తోంది. కొంచెం ఒత్తిడిగా ఉంది. రిలీజ్ కోసం మీతో పాటు నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. హై వోల్టేజ్ యాక్షన్‌తో ఈ చిత్రం రాబోతోంది' అని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'దేవర'. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. మంగళవారం ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. కరడుగట్టిన సముద్ర దొంగల నుంచి గ్రామాన్ని రక్షించేందుకు కథానాయకుడు చేసిన పోరాటం నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం అలరించింది. తండ్రీ కొడుకులుగా రెండు విభిన్న పాత్రల్లో ఎన్టీఆర్ పలికించిన భావోద్వేగాలు అలరించాయి. పల్లెటూరి యువతిగా జాన్వీ కనిపించారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ 'దేవర విజువల్స్ అద్భుతంగా ఉంటాయి. పతాక సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. సముద్ర జలాల అడుగున చిత్రీకరణ చేశాం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. శివ కొరటాల మాట్లాడుతూ 'సెట్స్‌లో ఒక్కసారి కెమెరా ఆన్ అయిందంటే ఎన్టీఆర్ సర్వం మర్చిపోయి పాత్రలో లీనమై నటిస్తాడు. అప్పట్లో సీనియర్ ఎన్టీఆర్-శ్రీదేవిలా ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్-జాన్వీకపూర్ జోడీ బాగుందని ప్రేక్షకులకు మెచ్చుకుంటున్నారు' అని చెప్పారు. జాన్వీకపూర్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌తో కలసి నటించాలనే నా కోరిక 'దేవర'తో తీరింది. ఆయనకు నేను పెద్ద అభిమానిని. ఎన్టీఆర్ నుంచి నటనకు సంబంధించి చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాను' అని తెలిపారు.



కాలేజ్ రోజులు గుర్తొచ్చాయి

దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర జంటగా నటించిన 'ఉత్సవం' చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో రెజీనా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చిత్రవిశేషాలు వెల్లడించారు.

- ఈ చిత్రకథను దర్శకుడు అర్జున్ సాయి చెప్పినప్పుడు అద్భుతంగా అనిపించింది. కథలో సోల్ ఉంది. నాటకరంగం గురించి ఆయన చాలా రిసెర్చ్ చేసి కథ తయారు చేశారు. స్కూల్‌లో, కాలేజీలో చదువుకొనే రోజుల్లో నాటకాలు వెయ్యడం, టికెట్లు అమ్మడం.. ఇవన్నీ నాకు వెంటనే గుర్తొచ్చాయి. సినిమాలో రంగస్థల నటుల గురించి చాలా అద్భుతమైన సన్నివేశాలు ఉన్నాయి. 'ఉత్సవం' సందేశాత్మక చిత్రం కాదు. కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా. నాకు బాగా నచ్చి వెంటనే ఒప్పుకొన్నా.
- చిత్రంలో నేను కార్పొరేట్ ఎంప్లాయిగా నటించాను. ప్రేమ మీద నా పాత్రకు పెద్దగా ఆసక్తి ఉండదు. కథలో ఎంతో కీలకమైన పాత్ర. ఇటువంటి పాత్ర చేసే అవకాశం రావడం ఆనందంగా అనిపించింది.
- నా కో స్టార్ దిలీప్ మంచి నటుడు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. తనతో వర్క్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను. నటుడిగా మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను.

కొన్నేళ్లుగా బాలీవుడ్ బాక్సాఫీసు.. థియేటర్లు సరైన హిట్లు లేక వెలవెలబోతున్న సంగతి తెలిసిందే. అలాంటి సమయంలో నేనున్నానంటూ బాలీవుడ్‌ను ఆదుకున్నాయి కొన్ని సినిమాలు. విచిత్రమేమిటంటే అందులో అధిక శాతం 'హారర్' జానర్‌కు చెందిన చిత్రాలే. అలా ఈ ఏడాది బాక్సాఫీస్‌కు కళ తెచ్చిన తెచ్చిన హారర్ చిత్రాలేంటో.. అలాగే త్వరలో ప్రేక్షకులను పలకరించే చిత్రాలేంటో చూద్దాం.

బాక్సాఫీస్‌కు హారర్ జోరు


ఏ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా రిలీజై సంచలన విజయం సాధించిన చిత్రం 'ముంజ్య'. ఆదిత్య సర్పోత్థార్ దర్శకత్వంలో అభయ్ వర్మ, శర్వారీ, మోనా సింగ్ కీలక పాత్రలు పోషించారు. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో జూన్ 7న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇందులో తన ప్రేయసిని ముంజ్యా (బ్రహ్మ రాక్షసుడు) నుంచి కాపాడుకునేందుకు హీరో పడే పాట్లు.. చేసే ఫీట్లు అందర్నీ తెగ నవ్వించాయి.











పిల్లలను నిద్రపుచ్చడానికి పెద్దలు చెప్పే జానపద కథలా.. కామెడీ హారర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే ఓటీటీలై విడుదలై అందరినీ అలరిస్తోంది.

వసూళ్ల వర్షం

శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో నటించిన సూపర్ నేచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2'. ఇది 2018లో తెరకెక్కి సూపర్ హిట్ సాధించిన 'స్త్రీ' సినిమాకు సీక్వెల్. రాజ్‌కుమార్ రావు కథానాయకుడు. ఆగస్టు 15న విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించి.. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించింది. ఇప్పటికే ఈ చిత్రం దాదాపు రూ.530 కోట్లు వసూలు చేసింది. బాలీవుడ్‌లో 'ఫైటర్', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలు సాధించిన కలెక్షన్లను అధిగమించింది. అంతేకాకుండా షారుక్ ఖాన్ నటించిన 'పఠాన్' చిత్రం ఇండియాలో సాధించిన లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసి.. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లు సాధించిన రెండో హిందీ మూవీగా 'స్త్రీ 2' నిలిచింది. ఈ కలెక్షన్ల పరంపర ఇలాగే కొనసాగితే త్వరలోనే ఇది ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లతో టాప్ ప్లేస్‌లో ఉన్న షారుక్ ఖాన్ 'జవాన్' సినిమాను దాటేస్తుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇక, ఈ సినిమా కథాంశానికి వస్తే.. చండేరి అనే ఓ ఊరిలో హఠాత్తుగా మహిళలు కనిపించకుండా పోవడం, వారిని కాపాడడం కోసం రాజ్‌కుమార్ రావు, తన స్నేహితులతో చేసే పనులు ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ.. ప్రేక్షకులకు సూపర్ థ్రిల్‌ను పంచాయి. అలాగే, ఈ సినిమాకు తమన్నా చేసిన ప్రత్యేక గీతం కూడా కలిసొచ్చింది. ఇప్పటివరకూ దేశంలో తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమా కూడా ఇదే. ఈ సినిమాకు మూడో భాగం ఉన్నట్లు చిత్రబృందం తెలిపింది.

మూడు రెట్ల లాభాలు

అజయ్ దేవ్‌గణ్, ఆర్.మాధవన్, జ్యోతిక నటించిన హారర్ థ్రిల్లర్ 'షైతాన్'. వికాశ్ భల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 8న విడుదలై మంచి హిట్‌గా నిలిచింది. రూ.65 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.200 కోట్లు రాబట్టింది. ఇందులో మాధవన్ వశీకరణం మాయలో పడిన తన కూతురిని రక్షించుకోవడం కోసం అజయ్‌దేవ్‌గణ్ చేసే పోరాటం సినిమాకే హైలెట్‌గా నిలిచింది. త్వరలోనే ఈ సినిమాకు సీక్వెల్‌గా 'షైతాన్ 2'ని తెరకెక్కించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.

త్వరలో మరిన్ని..

'స్త్రీ 2' చిత్రం ఊహకు మించిన సక్సెస్ సాధించడంతో బాలీవుడ్ చూపు ఒక్కసారిగా హారర్ ఫ్రాంఛైజీలపై పడింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న హారర్ చిత్రాల్లో 'భూత్ బంగ్లా', 'భేడియా 2', 'భూల్ భులయ్యా 3'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. 'భూత్ బంగ్లా' చిత్రం అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా, ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ హారర్ కామెడీని అక్షయ్‌కుమార్ బర్త్‌డే సందర్భంగా ప్రకటించారు. 'భేడియా 2' విషయానికి వస్తే.. ఇది 2022లో వరుణ్ ధావన్ ప్రధాన పాత్రలో నటించిన 'భేడియా' చిత్రానికి సీక్వెల్. కృతి సనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి అమర్ కౌశిక్ దర్శకుడు. ప్రస్తుతం రెండో భాగం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మరోవైపు, 'భూల్ భులయ్యా 3' చిత్రంలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్, త్రిప్తి దిమ్రి నటిస్తున్నారు. ఈ సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని రాబట్టాయి. మూడో భాగం దీపావళి సందర్భంగా నవంబర్ 1న విడుదలవుతోంది. వీటిలో ఏ చిత్రాలు 'స్త్రీ 2' లాగా సంచలన విజయాలు సాధిస్తాయో అని అందరూ వేచి చూస్తున్నారు.



ప్రభాస్‌కు కమల్ గిఫ్ట్..



కమల్ హాసన్ 'కేహెచ్' హౌస్ ఆఫ్ ఖద్దర్ అనే బ్రాండ్‌తో ఖాదీ దుస్తుల వ్యాపారంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవలే, న్యూయార్క్‌లో జరిగిన ఫ్యాషన్ వీక్‌లో ఈ దుస్తులకు చెందిన సరికొత్త కలెక్షన్ 'సుటూర'ను ప్రదర్శించారు. ఈ సరికొత్త కలెక్షన్‌ను కమల్ హాసన్ తన 'కల్కి 2898 ఏ.డీ' కో స్టార్ ప్రభాస్‌కు కానుకగా పంపారు. ఈ కానుకను అందుకున్న ప్రభాస్.. తన ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "ప్రేమతో ఈ గిఫ్ట్ పంపించినందుకు కృతజ్ఞతలు కమల్ సర్. మీ కొత్త కలెక్షన్‌కు ఆల్ ద బెస్ట్" అని పేర్కొన్నారు. కాగా, ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో.. భైరవ పాత్రలో ప్రభాస్.. 'సుప్రీమ్ యాస్కిన్' పాత్రలో కమల్ హాసన్ అదరగొట్టిన సంగతి తెలిసిందే.

విజయంపై నమ్మకంతో ఉన్నాం



మలయాళ హీరో టోవినో థామస్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'ఏఆర్ఎం' (అజయంతే రండం మోషణం). జితిన్ లాల్ దర్శకుడు. కృతిశెట్టి, ఐశ్వర్యారాజేశ్, సురభి లక్ష్మి కథానాయికలు. ఈ నెల 12న పలు భారతీయ భాషల్లో ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా టోవినో థామస్ మాట్లాడుతూ 'మైత్రీ మూవీ మేకర్స్ అంటే తెలుగు పరిశ్రమలో ఒక బ్రాండ్. వారు మా సినిమాను తెలుగులో విడుదల చేయడం గౌరవంగా భావిస్తున్నాం. ఇందులో మూడు పాత్రలు చేశాను. కృతి శెట్టి పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది. సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం. తెలుగు ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని కోరారు. కృతిశెట్టి మాట్లాడుతూ 'హీరోయిన్‌గా నాకు ఇది తొలి మలయాళ చిత్రం. దర్శకుడు అద్భుతమైన కథతో ఎనిమిదేళ్ల పాటు కష్టపడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు' అని చెప్పారు.



వరదబాధితులను ఆదుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి నిర్మాత దిల్‌రాజు, శిరీష్ విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. వారు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి రూ. 25 లక్షల చెక్కును అందజేశారు.

రాముడిగా...పరశురాముడిగా?



రణ్‌బీర్‌కపూర్ శ్రీరాముడి పాత్రధారిగా 'రామాయణ్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. నితేశ్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రాతో కలసి యష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సీతమ్మవారి పాత్రను సాయిపల్లవి పోషిస్తున్నారు. యష్ రావణుడిగా కనిపించనున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సన్నీడియోల్, లారాదత్తా, రకుల్ ప్రీత్‌సింగ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. 2026లో తొలి భాగం విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బాలీవుడ్‌లో వినిపిస్తోంది. రణ్‌బీర్‌కపూర్ ఇందులో డబుల్ రోల్‌లో కనిపించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. రాముడి పాత్రతో పాటు పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కనిపించనున్నారట. ఆయన లుక్ కూడా సరికొత్తగా ఉండబోతోందని చెబుతున్నారు. రామాయణంలో సీతా స్వయంవరంలో శ్రీరాముడు శివ ధనుర్భంగం నేపథ్యంలో పరశురాముడి పాత్ర కనిపిస్తుంది. 'రామాయణ్'లో అమితాబ్ బచ్చన్ కూడా భాగమవబోతున్నారట. అయితే ఆయన ఈ చిత్రంలో నటించడం లేదు. జటాయు పక్షి పాత్రకు అమితాబ్‌బచ్చన్ డబ్బింగ్ చెప్పేందుకు అంగీకరించాని సమాచారం. ఇక ఈ చిత్రంలో రావణుడి పాత్రలో నటిస్తున్న యశ్ డిసెంబర్‌లో చిత్రీకరణలో పాల్గొంటారని చెబుతున్నారు.

శింబు సాయం



ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడానికి భాషా పరిమితులు, ప్రాంతీయ భేదాలు ఉండవని తమిళ హీరో శింబు నిరూపించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఇబ్బందులకు గురైన వారిని ఆదుకోవడానికి ఆయన ముందుకు వచ్చారు. ఇతర తమిళ హీరోలందరికన్నా ముందుగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి తన వంతు సాయంగా రూ. ఆరు లక్షల విరాళం ప్రకటించి తన మంచితనాన్ని చాటుకున్నారు. అందరూ ఈ విపత్తు నుంచి త్వరలో బయటపడాలని ఆయన కోరుకున్నారు.

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా ప్రతాని



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌కు జరిగిన తాజా ఎన్నికల్లో అధ్యక్షపదవికి ప్రతాని రామకృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదహారు వేల మంది సభ్యులున్న అసోసియేషన్‌కు ఇలా అధ్యక్షపదవికి ఆయన ఎన్నిక కావడం ఇది ఆరోసారి. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు. ఈ రెండేళ్ల పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఔట్‌డోర్ షూటింగ్స్ సమయంలో యూనిట్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, చిన్న సినిమాలకు రాయితీలు వంటివి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం' అని చెప్పారు.

లైఫ్ స్టోరీ

కొత్తగా..



ఒక్కోసారి సాధారణ సంఘటనలే జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంటాయి. అలా జీవితంలోని రోజువారీ క్షణాలను మనసుకు హత్తుకొనే విధంగా తీసిన సంకలన చిత్రం 'లైఫ్ స్టోరీస్'. ఈ నెల 14న విడుదలవుతున్న ఈ సినిమాలో సత్య కేతినీడి, షాలిని కొండేపూడి, దేవియాని శర్మ, ఎం. వివాన్ జైన్ తదితరులు నటించారు.అన్ని వయసుల వారిని ఆకట్టుకునేలా స్వీయ దర్శకత్వంలో ఉజ్వల్ కశ్యప్ ఈ సినిమాను నిర్మించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
11 సెప్టెంబరు 2024



విన్నర్

విజయం ఎప్పుడూ మధురమే.
కానీ దానికి పునాది ఓటమి.
ఈ చేదు నిజం... బెలారస్ టెన్నిస్ తార
అరినా సబలెంక అనుభవ పాఠం.
అందుకే ఓడిన ప్రతిసారీ కెరటంలా ఉవ్వెత్తున ఎగసింది.
పట్టు వదలని ప్రయత్నంతో... మూడేళ్లుగా ఊరిస్తున్న
యూఎస్ ఓపెన్ టైటిల్‌ను ముద్దాడింది.
ఆమె ప్రయాణంలో గెలుపు మజిలీలే కాదు... నోరు జారి
కొని తెచ్చుకున్న వివాదాలు... మోడల్‌ను తలపించే
ఫ్యాషన్ పరేడ్‌లూ... ఇంకా ఎన్నో ఉన్నాయి.



రాకెట్‌లా దూసుకెళుతూ...

ఈ ఏడాది మార్చిలో సబలెంక మాజీ ప్రియుడు, ఐస్ హాకీ క్రీడాకారుడైన 42 ఏళ్ల కాన్‌స్టాన్టిన్ ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికే ఇద్దరూ విడిపోయినా... ఆ ఘటన ఆమెను తీవ్ర మనోవేదనకు గురి చేసింది. తన బాధను బహిరంగంగానే వ్యక్తం చేసింది. కానీ అంతటి విషాదంలోనూ... రాకెట్ పట్టి... ఆట కొనసాగించింది. అన్నిటికీ మించి మూడేళ్లుగా అందని ద్రాక్షలా ఉన్న యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. 2021లో ఈ టోర్నీ సెమీస్ వరకు వచ్చి నిరాశపర్చిన సబలెంక... మరుసటి ఏడాది కూడా అదే స్థానంతో సరిపెట్టుకుంది. అయితే గత ఏడాది మరో మెట్టు ఎక్కింది. తుది పోరుకు చేరి... రన్నరప్‌గా నిలిచింది. టైటిల్ సాధించాలన్న ఆమె కల మరోసారి నెరవేరలేదు. అలాగని అంతటితో ఆట అయిపోలేదు. మరింత ఫామ్‌ను సంతరించుకున్న సబలెంక... ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి... టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఎలాగైనా ఈసారి యూఎస్ ఓపెన్ కప్‌ను ముద్దాడాలన్న సకల్పంతో కఠోరంగా శ్రమించింది. దాని కోసం ఒలింపిక్స్‌ను సైతం త్యాగం చేసింది.



కల నెరవేరిన వేళ...

మాజీ ప్రియుడు చనిపోయిన తరువాత సబలెంక ఆడిన తొలి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్. ఒక్క మ్యాచ్ మినహా ఫైనల్‌తో సహా ఆమె వరుస సెట్లలో ప్రత్యర్థులను మట్టి కరిపించింది. జెస్సికా పెగులాతో జరిగిన అంతిమ పోరు తొలి సెట్‌లో సర్వీస్ కోల్పోయి తడబడింది. ఇక సెట్ గెలవడం కష్టం అనుకున్న దశలో చెలరేగింది. వరుసగా ఐదు పాయింట్లు గెలిచి, సెట్‌నూ సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో కూడా పెగులా నుంచి గట్టి పోటీ ఎదురైనా, అనుభవంతో దాన్ని అధిగమించి తన ఖాతాలో తొలి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను వేసుకుంది. కలల ట్రోఫీతో పాటు 3.6 మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీని ఇంటికి తీసుకువెళ్లింది. అంతేకాదు, ఒకే ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్‌లు గెలిచిన ఐదో మహిళగా ఆమె రికార్డులకు ఎక్కింది.

'నన్ను చూసి నేనే గర్వపడుతున్నా'...

మ్యాచ్ అనంతరం ఎంతో భావోద్వేగానికి లోనైన సబలెంక... 'నన్ను చూసి నేనే గర్వపడుతున్నా. ఇలా నేను ఎప్పుడూ మాట్లాడలేదు. కానీ ఈ విజయం నాకు అంతటి సంతృప్తిని, సంతోషాన్ని, నాపై నాకు ఎనలేని నమ్మకాన్ని ఇచ్చింది. నా కల నెరవేర్చుకొనే దిశలో నా నమ్మకాన్ని నేను ఎప్పుడూ కోల్పోలేదు' అంటూ తన ఉద్వేగంగా చెప్పిన సబలెంక... ఈ గెలుపును తన కుటుంబానికి అంకితమిచ్చింది. 'నా ఉన్నతి కోసం ఎంతో శ్రమించిన మా నాన్న చనిపోయినప్పటి నుంచి నా లక్ష్యం ఒక్కటే... టెన్నిస్ చరిత్రలో మా కుటుంబం పేరు చిరస్థాయిగా నిలవాలని. ట్రోఫీ మీద నా పేరు చూసిన ప్రతిసారీ నా కుటుంబాన్ని చూసి గర్వపడతా. నా కలలను వారివిగా చేసుకుని, అన్నింటా మద్దతుగా నిలిచి, ఎంతో ప్రోత్సహించారు' అంటూ ఉద్వేగానికి గురైంది 26 ఏళ్ల సబలెంక. ఐదేళ్ల కిందట అనారోగ్యంతో ఆమె తండ్రి సెర్గే మరణించారు. ఆయన ఐస్ హాకీ ఆటగాడు.

అనుకోకుండా అలా...

బెలారస్ రాజధాని మిన్‌స్క్ నగరంలో పుట్టిన సబలెంక అనూహ్యంగా టెన్నిస్ రాకెట్ పట్టింది. 'ఒక రోజు నాన్నతో కలిసి కారులో వెళుతుంటే... దారిలో టెన్నిస్ కోర్టులు కనిపించాయి. వెంటనే నన్ను అక్కడికి తీసుకువెళ్లారు. కోర్టుతో పాటు ఆట కూడా నాకు బాగా నచ్చింది. ఆ రోజంతా అక్కడ ఉత్సాహంగా గడిచిపోయింది. బాగా ఆస్వాదించాను. అలా టెన్నిస్ రాకెట్ పట్టాను. నాలోని ప్రతిభ చూసి 2014లో నాన్న నన్ను తీసుకువెళ్లి స్థానిక 'జాతీయ టెన్నిస్ అకాడమీ'లో చేర్చారు. మరుసటి ఏడాది చిన్న చిన్న టోర్నమెంట్లలో పాల్గొన్నాను. ఐటీఎఫ్ దిగువ స్థాయి పోటీల్లో డబుల్స్, సింగిల్స్ ఆడుతూ వచ్చాను' అంటూ చెప్పుకొచ్చిన సబలెంక... అంతకు రెండేళ్ల ముందే జూనియర్స్‌కు అర్హత ఉన్నా... ఐటీఎఫ్ ఉమెన్స్ సర్క్యూట్‌లో పోటీపడింది.

డబుల్స్‌తో మొదలుపెట్టి...

సబలెంక పేరు దేశ వ్యాప్తంగా పరిచయం అయింది 2017లో. ఆమె సారథ్యంలోని బెలారస్ 'ఫెడ్ కప్' టీమ్ రన్నరప్‌గా నిలిచింది. టాప్ 75 ర్యాంకుల్లో లేని జట్టు గెలుపు... అప్పట్లో సంచలనంగా మారింది. తరువాత అద్భుత విజయాలు నమోదు చేసుకున్న సబలెంక... 2018, 19 ప్రపంచ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో పదకొండో స్థానానికి ఎగబాకింది. రెండేళ్లకు రెండో ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. 2023లో ఆమె కెరీర్‌లోనే పెద్ద మలుపు. ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి, తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను తన పేరిట లిఖించుకుంది. ఈ ఏడాది ఆ టైటిల్‌ను నిలబెట్టుకోవడమే కాకుండా... ఎప్పటి నుంచో ఊరిస్తున్న యూఎస్ ఓపెన్ కూడా నెగ్గడం... సబలెంకలోని దీక్షాదక్షతకు నిదర్శనం. వీటికి ముందు ఆమె... ఎలైజ్ మెర్టెన్స్‌తో జతకట్టి యూఎస్ ఓపెన్ (2019), ఆస్ట్రేలియన్ ఓపెన్ (2021) డబుల్స్ గ్రాండ్‌స్లామ్ నెగ్గింది. సబలెంక కెరీర్‌లో ఇప్పటికి మొత్తం 22 టైటిల్స్ ఉన్నాయి. అందులో 16 సింగిల్స్, 6 డబుల్స్ టైటిల్స్. గత ఏడాది ప్రపంచ నెంబర్ వన్ ర్యాంక్‌కు దూసుకుపోయిన ఆమె... ప్రస్తుతం రెండో ర్యాంక్‌లో కొనసాగుతోంది.

'ది వారియర్ ప్రిన్సెస్'...

ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ క్రీడాకారులకు స్పాన్సర్లు దొరక్క ఇబ్బంది పడుతున్న తరుణంలోనూ... సబలెంక బడా బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తోంది. ప్రముఖ వెల్‌నెస్ బ్రాండ్స్‌లో పెట్టుబడులు కూడా పెట్టింది. టెన్నిస్ కోర్టులో శక్తిమంతమైన షాట్లతో ప్రత్యర్థులతో ఎంతలా ఆడేసుకొంటుందో... కోర్టు బయట విభిన్న ఆహార్యంతో అంతగా మతి పోగొడుతుంది. మోడల్స్‌కు మించిన ట్రెండీ టచ్‌తో నిత్యం తన అభిమానులకు పండగ చేస్తుంది. ఇన్‌స్టాలో ఆమెకు దాదాపు పాతిక లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఎప్పటికప్పుడు తన అనుభవాలను ఇన్‌స్టాలో పంచుకొంటూ... ఔత్సాహికుల్లో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపుతుంది. టెన్నిస్ సర్కిల్‌లో 'ది వారియర్ ప్రిన్సెస్'గా పేరు గడించిన ఈ తార... ప్రస్తుతం బ్రెజిల్‌కు చెందిన 'ఓక్‌బెర్రీ' బ్రాండ్ అధిపతి జార్జియస్ ఫ్రాంగులిస్ ప్రేమలో మునిగి తేలుతోంది.

వివాదాలకు కేంద్రం...

2023లో 'ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్' (ఐటీఎఫ్) నుంచి ప్రతిష్ఠాత్మక 'ప్రపంచ చాంపియన్ అవార్డు'ను అందుకున్న సబలెంక... బలమైన సర్వ్, గ్రౌండ్ స్ట్రోక్స్‌కు పెట్టింది పేరు. దూకుడుగా ఆడడం ఆమె శైలి. కోర్టులో ఉన్నంతసేపూ ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసే సబలెంక పేరు... నిత్యం ఏదో ఒక వివాదంలో వినిపిస్తుంటుంది. అందుకు ప్రధాన కారణం ఆమె నోటి దురుసు అనేది పలువురు సీనియర్ల మాట. ఒక మాజీ టెన్నిస్ ఆటగాడితో ముఖాముఖీలో కూడా అభ్యంతరకర పదం ఉపయోగించి మరోసారి అందరి నోట్లో నానింది. ఎందుకలా అని అడిగితే... 'బహుశా అది నా రక్తంలోనే ఉందేమో' అంటూ నవ్వేస్తుంది ఈ బెలారస్ భామ.

తెలుగు నేలమీద విరాజిల్లిన తొలి తరం సామ్యవాద, సంఘసంస్కరణ ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షి... **పరిటాల సరళా కుమారి**. సామాజిక, ఆర్థిక రంగ విశ్లేషకుడిగా తెలుగు పాఠకులకు గణాంకాల విలువలను తెలిపిన ప్రముఖ జర్నలిస్టు వి.హనుమంతరావు సతీమణి. ఆయన శతజయంతి సంవత్సరం సందర్భంగా తమ జీవిత విశేషాలను సరళా కుమారి 'నవ్య'తో పంచుకున్నారు.

ఆ పేరు పెట్టడమే ఆయన గొప్పతనం

"ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా 30 ఏళ్లకు పైగా పని చేశాను. పిల్లల కోసం ఎన్నో గేయాలు రాశాను. నా విద్యార్థులు ఎంతోమంది డాక్టర్లుగా, లాయర్లుగా, ఇంజనీర్లుగా... ఇలా వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. అయినా, ఒక టీచర్‌గా కన్నా ఒక నికార్సయిన జర్నలిస్టు భార్యగా మరింత గర్వపడతాను. నా భర్త వి.హనుమంతరావు మంచి పాత్రికేయుడు మాత్రమే కాదు, అంతకు మించి గొప్ప మానవతావాది. ఆయన ఔన్నత్యం గురించి చెప్పడానికి ముందుగా మా కుటుంబ నేపథ్యాన్ని ప్రస్తావించాలి. మా సొంతూరు కృష్ణా జిల్లా వెల్దిపాడు. నా చిన్నతనంలోనే మా నాన్న అనారోగ్యంతో మాకు దూరమయ్యాడు. పులి మీద పుట్రలా నాకన్నా పదేళ్ళు పెద్దయిన మా కృష్ణవేణి అక్క భర్తను పోగొట్టుకొని పుట్టింటికి చేరింది. దాంతో మా అమ్మ పరిటాల అనంతమ్మ మమ్మల్ని వెంటపెట్టుకొని నూజివీడు దగ్గర గొల్లపల్లిలోని తన తోబుట్టువు ఇంటికి చేరింది. అప్పటికే మా పెద్దమ్మ కొడుకు పొట్లూరి రాఘవయ్య భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త కావడంతో... మాకూ సామ్యవాదం పరిచయం అయింది. కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధాజ్ఞలు కొనసాగుతున్న సమయంలో బాల కొరియర్‌గా అజ్ఞాతంలో ఉన్న కొండపల్లి సీతారామయ్య, చండ్ర రాజేశ్వరరావు తదితర నాయకులకు సమాచారాన్ని బట్వాడా చేయడం, కరపత్రాలు పంచడం లాంటి పనుల్లో చురుగ్గా పాల్గొన్నాను.

సాహిత్య పరిచయం...

ఆనాటి కమ్యూనిస్టులు దోపిడీ వ్యతిరేక పోరాటానికే పరిమితం కాకుండా, సంఘ సంస్కరణ బాధ్యతనూ నెత్తికెత్తుకున్నారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు లాంటి సంఘ సంస్కర్తల వారసత్వాన్ని కొనసాగించారు. ఇది 1945 నాటి సంగతి. వితంతువైన మా అక్కకు మళ్లీ పెళ్లి చెయ్యాలని అన్నయ్య పట్టుబట్టి, ఇంట్లో వాళ్ళను ఒప్పించి... తన ఉద్యమ సహచరుడు తమ్మారెడ్డి గోపాలకృష్ణమూర్తితో అక్క కృష్ణవేణి పెళ్లి జరిపించాడు. కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి మా బావ ఊరూరా తిరుగుతుండటంతో అక్కకు తోడుగా వారి వెంట మేమూ నడిచాం. అప్పుడు మా అవస్థలు ఎన్నో. గ్రామాల్లో కమ్యూనిస్టులకు అంత త్వరగా ఇల్లు అద్దెకు ఇచ్చేవారు కాదు. మాతో మాట్లాడటానికి కూడా చాలామంది భయపడేవారు. నాకు చదువుకోవాలని కోరిక. కానీ నెలకొక ఊరు మారుతున్న పరిస్థితుల్లో, నన్ను కొండిపర్రు ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. ఆంక్షల కాలంలో ఎంతోమంది కమ్యూనిస్టులకు ఆశ్రయం కల్పించింది ఆ పాఠశాల. అక్కడే నేను హిందీ-విశారద కోర్సు పూర్తి చేశాను. సాహిత్య పఠనాన్ని పరిచయం చేశారు. అవన్నీ నన్ను తర్వాత కాలంలో హిందీ పండితురాలిగా, తెలుగు గేయ రచయిత్రిగా మలిచాయి.

పెళ్లయిన 20 రోజులకే...

కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు అట్లూరి చలపతి రావుతో నాకు మొదట వివాహం అయింది. అది సాఫీగా సాగుతోన్న నా జీవితంలో పెద్ద కుదుపు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న ఆయనను ఒక రోజు పోలీసులు అరెస్టు చేశారు. మిగతా దళసభ్యుల జాడ చెప్పమని చిత్రహింసలు పెట్టారు. అయినా, ఆయన నోరు విప్పలేదు. దాంతో విసిగిపోయిన పోలీసులు చలపతి రావును తుపాకీతో కాల్చి చంపారు. అదే అతను కనుక ఆ రోజు నోరు విప్పితే... నలభైమందికి పైగా ఉద్యమకారుల ప్రాణాలు గాల్లో కలిసేవి. అదీ ఆనాటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సభ్యుల నిబద్ధత, త్యాగం. అప్పటికి మాకు పెళ్లయ్యి 20 రోజులే. చలపతి రావు చనిపోయాక నేను మళ్లీ పెళ్లి చేసుకోవాలనుకోలేదు. మా బావ మీద ఆంధ్రాలో పోలీసుల నిఘా పెరగడంతో కుటుంబమంతా మద్రాసు చేరాం. తిరిగి చదువు కొనసాగించాను. హిందీలో ప్రవీణ కోర్సుతో పాటు బీఈడీ పూర్తిచేశాను. నాలుగేళ్ళ తర్వాత మళ్లీ పెళ్లి చేసుకోవాలని ఇంట్లో వారంతా నాకు నచ్చజెప్పారు. అప్పుడు మద్రాసులో 'విశాలాంధ్ర' విలేకరిగా ఉన్న పరుచూరి హనుమంతరావు (ప్రగతి ప్రింటర్స్ అధినేత) గారు "ఢిల్లీలో రిపోర్టరుగా పనిచేస్తున్న వి. హనుమంతరావు అయితే సరళకు తగిన వ్యక్తి" అని మా బావకు చెప్పారు. అలా 1954లో అత్యంత నిరాడంబరంగా హేతువాది తాపీ ధర్మారావుగారి చేతుల మీదుగా దండల మార్పిడి పద్ధతిలో మా వివాహం జరిగింది. పైగా మాది కులాంతర, సంస్కరణవాద వివాహం. ఆయన పూర్తి సంప్రదాయ కుటుంబంలో పుట్టినా... చాదస్తాలకు అతీతంగా జీవించారు. సమాజం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన అమరవీరులంటే ఎంతో ఆరాధనా భావం. ఆ గౌరవంతోనే నా మొదటి భర్త చలపతిరావు పేరును మా పెద్దబ్బాయికి పెట్టారు. ఇదొక్కటి చాలదా.. హనుమంతరావు గారి ఔన్నత్యం అర్థం కావడానికి.

సుందరయ్యతో అనుబంధం

హనుమంతరావుకు టైపింగ్, షార్ట్‌హాండ్ మీద పట్టుంది. రెండో ప్రపంచ యుద్ధసమయంలో మిలటరీ నేవీలో స్టెనోగ్రాఫర్‌గా ఉద్యోగంలో చేరారు. ఆయన సొంతూరు తూర్పుగోదావరి జిల్లా మండపేట. సమాజం పట్ల ఆనాటి కమ్యూనిస్టులకున్న ఆర్తిని చూసి హనుమంతరావు ప్రభావితమయ్యారు. పుచ్చలపల్లి సుందరయ్యగారికి టైపింగ్, షార్ట్ హాండ్ వచ్చిన వారి అవసరం ఉందని తెలిసి, నెలకు రూ.100 జీతం వచ్చే ప్రభుత్వ కొలువును వదిలేసి, 'విశాలాంధ్ర' విలేకరిగా కలం పట్టారు. సుందరయ్యగారు రాసిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పుస్తక రచన పది రోజుల్లో పూర్తికావడానికి ఎంతో తోడ్పడ్డారు.



స్థలం కూడా తీసుకోలేదు

మా అమ్మ ఊర్లో తనకున్న కొద్దిపాటి భూమి అమ్మేసి, ఆ డబ్బుతో అమీర్‌పేట నాగార్జుననగర్‌లో మాకు స్థలం కొని ఇచ్చింది. నా ఉద్యోగం మీద రుణంతో ఇల్లు కట్టుకున్నాం. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయిస్తూ, హనుమంతరావుకు కూడా జర్నలిస్టు కాలనీలో స్థలం మంజూరు చేసింది. "నాకు సొంతిల్లు ఉంది. కనుక స్థలం అవసరం లేదు" అని అది తీసుకోలేదు. ఇదీ హనుమంతరావు నిజాయితీ. ఆయన ప్రేరణతో నా ఉద్యోగ విరమణ సమయంలో వచ్చిన సొమ్ములో నుంచి రూ.50 వేలు 'మహిళా జర్నలిస్టుల ఫౌండేషన్'కు విరాళంగా ఇచ్చాం.



పార్లమెంట్‌లో తొలి తెలుగు విలేకరి

మొట్టమొదటి పార్లమెంటు సమావేశాలను రిపోర్టు చేసిన తొలి తెలుగు వ్యక్తి హనుమంతరావు గారే! తద్వారా నెహ్రూ, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, ఆచార్య కృపలానీ, రాంమనోహర్ లోహియా, ఏకే గోపాలన్, భూపేష్ గుప్తా లాంటి తొలితరం నేతల ప్రసంగాలను తెలుగు వారికి అందించారు. తర్వాత విమాన వాహక నౌక 'విక్రాంత్'లో ప్రయాణించి... బంగ్లాదేశ్ యుద్ధ వార్తలు రిపోర్టు చేశారు. 'డేటా న్యూస్ ఫీచర్స్' సంస్థ నెలకొల్పి, సామాజిక, ఆర్థిక రంగాలకు సంబంధించిన అంశాలపై కొన్ని వందల వ్యాసాలు రాశారు. కొన్ని సంవత్సరాలకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు, గణాంకాలు ఆయన నోటిలో ఎల్లప్పుడూ ఆడుతుండేవి. ఒక్కోసారి వారి జ్ఞాపకశక్తి చూసి నాకే ఆశ్చర్యం వేసేది. 'చివరి వరకు రాస్తూ ఉండాలి' అనుకొన్నారు. అలానే 2016, డిసెంబరు 13న చనిపోవడానికి ముందు రోజు కూడా ఒక వ్యాసం రాశారు. విలువైన సమాచారంతో 'డేటా ఆంధ్రప్రదేశ్', 'ఏపీ ఎట్ 50' లాంటి పుస్తకాలు తీసుకొచ్చారు. 'వీక్షణం' వ్యవస్థాపక సంపాదకుడిగా, 'ఎకనమిక్ టైమ్స్'లో వ్యాసకర్తగా... ఒకటా, రెండా... ఆయన నిర్వర్తించిన బాధ్యతలెన్నో. హనుమంతరావు గారి విద్వత్తును చూసి చాలామంది ఆయన్ను 'ప్రొఫెసర్' అని సంబోధించిన సందర్భాలున్నాయి. కానీ ఆయన చదువుకున్నది ఎస్సెస్సెల్సీ మాత్రమే. నిరంతర అధ్యయనమే హనుమంతరావును ఉత్తమ జర్నలిస్టుల్లో ఒకరిగా నిలిపింది అనడంలో సందేహం లేదు.

అదే నా కోరిక...

ఇప్పుడు నా వయసు 89 ఏళ్ళు. ప్రస్తుతం మా రెండవ అబ్బాయి సతీష్‌బాబు దగ్గర ఉంటున్నాను. బీపీ, షుగర్ లాంటి ఆరోగ్య సమస్యలంటూ ఏమీ లేవు. నా పనులు నేను చేసుకోగలుగుతున్నాను. ఉద్యోగ విరమణ పొందికూడా 30 ఏళ్ళు దాటింది. పిల్లల కోసం మన స్వాతంత్ర్య సమరయోధుల జీవిత గాథలు, పర్యాటక ప్రదేశాలు ఇతివృత్తంగా తెలుగులో గేయాలు రాశాను. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రాసిన 'ఆంధ్రుల చరిత్ర' గేయ కథనం, ప్రకృతి పరిరక్షణలో భాగంగా 'ప్రాణిప్రపంచం' తదితర రచనలు పుస్తకాలుగా వచ్చాయి. నా భర్త వి. హనుమంతరావుకు దామోదరం సంజీవయ్య, వైఎస్ రాజశేఖర్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రులతో పరిచయాలున్నా... వ్యక్తిగత అవసరానికి వాటిని ఎన్నడూ ఉపయోగించలేదు. ఇది ఆయన శతజయంతి సంవత్సరం. ఈ సందర్భంగా నిరంతరం అణగారిన వర్గాల సంక్షేమం కోసం పరితపించిన హనుమంతరావు పాత్రికేయ వృత్తి, వ్యక్తిగత జీవితం మీద సమాజంలో చర్చ జరగాలన్నది నా అభిలాష.

● **సాంత్వన్**/ ఫొటో: రాజ్‌కుమార్



కండెన్స్డ్ మిల్క్ చవకగా...

చాలా మంది పాయసంలోను.. ఇతర తీపి పదార్థాలలోను కండెన్స్ మిల్క్‌ను వాడతారు. బయట మార్కెట్లో దీని ఖరీదు చాలా ఎక్కువగా ఉంటుంది. దీనిని చవకగా ఇంట్లోనే ఎలా చేసుకోవాలో చూద్దాం.

కావాల్సిన పదార్థాలు: మిల్క్ పౌడర్ (100 గ్రాములు), వెన్న (100 గ్రాములు), చక్కెర (250 గ్రాములు), పాలు (500 మిల్లీలీటర్లు)



తయారుచేసే పద్ధతి: పాలను గోరువెచ్చగా వేడి చేయాలి. వేడి చేసిన పాలలో మిల్క్ పౌడర్, వెన్న, చక్కెర వేసి మిక్సీలో బాగా తిప్పాలి. ఈ కండెన్స్ మిల్క్‌ను ఫ్రిజ్‌లో పెట్టుకుంటే మూడు నెలల దాకా నిల్వ ఉంటుంది.

ఫ్యాషన్

ఈ అతిశయం పువ్వులదే!



కాటా ఫోలియేజ్ డ్రస్

ఆర్గానిక్ కాటన్ జెర్సీతో రూపొందే ఈ డ్రస్సులో చెట్టు వంపిరి వైపు చూస్తున్నట్టుండే డిజైన్లు కనిపిస్తాయి. చిక్కని ఆకులు, లతలు, కొమ్మలు కొమ్మలుగా స్పష్టంగా కనిపిస్తాయి. అయితే ప్రకృతిని మరిపించే ఈ డిజైన్ మొత్తంగా ఆకుపచ్చ రంగులోనే ఉంటుందనుకుంటే పొరపాటు. డిజైన్లు ప్రకృతిని మరిపించినా రంగుల్లో వైవిధ్యం కనబడుతుంది.

పూలు, లతలు ఎక్కడున్నా అందరి కళ్లూ అటు వైపే మళ్లిపోతాయి. కాబట్టే పూలు, లతల ఫ్యాషన్ ట్రెండ్ 'ఫోలియేజ్' యువతులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ కోవకు చెందిన ఫోలియేజ్ డ్రెసెస్ మీద ఓ లుక్కేద్దామా..

పువ్వులు, లతలు, కొమ్మలు... ఫోలియేజ్ డ్రస్సులో తప్పనిసరిగా కనిపించే అంశాలివి. ప్రకృతిని మరిపించే ఈ అంశాల్లో ప్రత్యేతల ఆధారంగా వినూత్నమైన మోడర్న్ డ్రస్‌లు తయారవుతూ ఉంటాయి. గాల్లో తేలుతున్నట్టుండే మెటీరియల్స్‌తో, సౌకర్యం, ఆధునికతలే తొలి ప్రాధాన్యంగా తయారయ్యే ఈ దుస్తులు వేర్వేరు సందర్భాలకు అనువుగా ఉంటాయి. ఫోలియేజ్ దుస్తులు, వైవిధ్యాన్ని కనబరచడం కోసం భిన్నమైన డిజైన్లలో కూడా తయారవుతూ ఉంటాయి.

ఆటమ్ ఫోలియేజ్



ఈ డ్రస్ సుతిమెత్తని ఫ్లోయీ మెటీరియల్‌తో తయారవుతుంది. కదిలేటప్పుడు, చెట్ల ఆకులు రాలి నేల మీద పడుతున్న శబ్దం వెలువడుతుంది. ఈవినింగ్ పార్టీలు, వేడుకల్లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా కనిపించడం కోసం ఈ డ్రస్‌ను ఎంచుకోవచ్చు. హుందాగా, ఫ్యాషనబుల్‌గా కనిపించేలా చేసే ఆటమ్ ఫోలియేజ్ ఫాల్ డ్రస్‌ను తేలికపాటి ప్లాటినం లేదా యాంటిక్ జ్యువెలరీ, హైహీల్స్‌తో మ్యాచ్ చేయాలి.

ఫోలియేజ్ లినెన్

బోహో స్టైల్‌లో అదరగొట్టాలంటే లినెన్ మెటీరియల్ ఫోలియేజ్ డ్రస్ ఎంచుకోవాలి. కాలర్ జోడిస్తే, ఈ డ్రస్‌కు మోడర్న్ లుక్ సమకూరుతుంది. అలాగే బెల్ట్ కూడా! పెద్ద బకిల్ ఉండే బెల్టులు ఈ దుస్తుల అందాన్ని రెట్టింపు చేస్తాయి. యాంకిల్ బూట్స్ అదనపు ఆకర్షణను తెచ్చి పెడతాయి.



వరదలు రావడం దురదృష్టం

- ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండడం అదృష్టం
- ముంపులోనూ బురద జల్లే.. విపక్ష నేతలు దేశ ద్రోహులు
- లోపాలపై గళమెత్తితేనే దేశద్రోహం కేసు
- ప్రకాశం బ్యారేజీపైకి పడవలను వదిలిన వారినేం చేయాలి?
- ఆక్రమణలపై ప్రభుత్వం దృష్టి పెడుతుంది: హోంమంత్రి అనిత



విశాఖపట్నం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'విపత్తుల నిర్వహణలో మన ముఖ్యమంత్రి చంద్రబాబు దేశానికే ఆదర్శం. ఆయన చేపట్టిన విధానాలు భవిష్యత్తులో కేస్ స్టడీ అవుతాయి' అని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. 'విజయవాడకు వరదలు రావడం దురదృష్టకరం. అయితే, సీఎంగా చంద్రబాబు ఉండడం అదృష్టం. హుద్‌హుద్, తిత్లీ, విజయవాడ వరదల నుంచి ప్రజలను కాపాడిన తీరే అందుకు నిదర్శనం. వరద ప్రాంతాల్లో పునరుద్ధరణ, సహాయక చర్యలను చేపట్టే విషయంలో కలెక్టర్లకు పూర్తి స్వేచ్ఛను, అవసరమైన నిధులను చంద్రబాబు ఇచ్చారు. రోడ్లతోపాటు ఇళ్లను కూడా శుభ్రపరచడం దేశంలో ఎక్కడా జరగలేదు. బుడమేరు గండ్లను అత్యంత వేగంగా పూడ్చాం. అది అంత సాధారణ విషయం కాదు. వరద బాధితులను ఆదుకోవాల్సిన ప్రతిపక్షం ఆపద తెచ్చేందుకు యత్నిస్తోంది. వరదలోనూ బురదజల్లే విపక్ష నాయకులు దేశద్రోహులు. ఉద్దండరాయునిపాలెం సమీపంలో ఉండాల్సిన పడవలు ప్రకాశం బ్యారేజీ గేట్ల వద్దకు ఎలా వచ్చాయి? అవి బ్యారేజీ గేట్లకు తగిలి ఉంటే పరిస్థితి ఊహకు కూడా అందేదికాదు. గత ప్రభుత్వ లోపాలపై గళమెత్తిన వ్యక్తులపై దేశద్రోహం కేసు పెట్టారు. మరి ఇటువంటి ప్రజలకు ముప్పు తెచ్చే పనులు చేసే వారిని ఏం చేయాలి? వరదలపై సోషల్ మీడియాలో వక్రీకరణ తగదు. 74 ఏళ్ల వయసులో తీరిక లేకుండా పనిచేస్తున్న సీఎంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు. కొల్లేరు, బుడమేరు, ఏలేరు పరీవాహక ప్రాంతాల్లో ఆక్రమణలపై ప్రభుత్వం దృష్టి పెడుతుంది. ఐదేళ్ల తరువాత క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లామని ఒక ఐఏఎస్ అధికారి చెప్పారు. దాన్నిబట్టి గత ప్రభుత్వ పనితీరు ఏమిటన్నది అర్థమవుతుంది. సాంకేతిక పరిజ్ఞానానికి కనీసం పైసా ఖర్చు చేయకుండా విపత్తు నిర్వహణ సంస్థను నిర్వీర్యం చేశారు. విశాఖలోని తెన్నేటి పార్కు, గోపాలపట్నం, సీతమ్మధార ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడకుండా తగిన చర్యలు చేపడతాం' అని మంత్రి అనిత చెప్పారు.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- సత్యవేడు ఎమ్మెల్యే ఘటన వెనుక పెద్దల హస్తం:సీపీఐ నారాయణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'ఏపీలో వర్షాలు, వరదల వల్ల భారీగా ఆస్తి నష్టం జరిగింది. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉన్నందున కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించి నిధులు విడుదల చేయాలి' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. 'సత్యవేడు ఎమ్మెల్యే అశ్లీల వీడియోల వ్యవహారంపై న్యాయవ్యవస్థ సుమోటోగా కేసు విచారణ జరపాలి. ఆ ఘటన వెనుక ఎవరున్నారనే దానిపై విచారణ చేపట్టాలి. ఆ ఘటన వెనుక పెద్దల హస్తం ఉంది' అని నారాయణ పేర్కొన్నారు.

బాధితులకు లక్ష పరిహారం ఇవ్వాలి: షర్మిల

- రాజరాజేశ్వరిపేటలో పర్యటించిన పీసీసీ అధ్యక్షురాలు

విజయవాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): బుడమేరు వరదతో సర్వం కోల్పోయిన బాధితుల కుటుంబాలకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణ సాయంగా రూ.15 వేలు ఇవ్వాలన్నారు. విజయవాడ పాత రాజరాజేశ్వరిపేటలో వరద బాధితులను ఆమె మంగళవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'బుడమేరు వరదపై టీడీపీ, వైసీపీ బురద రాజకీయాలు చేస్తున్నాయి. ఈ వరదలకు ఇద్దరూ కారణమే. చంద్రబాబు ఇచ్చిన కాంట్రాక్టులను, జగన్ సీఎం అయ్యాక రద్దు చేశారు. చంద్రబాబు పిల్లల నుంచి విరాళాలు సేకరించడం కాదు... కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు తీసుకురావాలి' అని షర్మిల వ్యాఖ్యానించారు.

వరద ప్రాంతాల్లో 'స్పెషలిస్ట్' సేవలు

- మంత్రులు సత్యకుమార్, నారాయణ వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో స్పెషలిస్టు సేవలు అందించేందుకు ప్రైవేటు మెడికల్ కాలేజీల యాజమాన్యాలు ముందుకొచ్చాయని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి నారాయణతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రైవేటు మెడికల్ కాలేజీలు 30 మంది వైద్యులు, పీజీలను వరద బాధిత ప్రాంతాల్లో సేవలందించేందుకు పంపించగా, మరో 42 మంది స్పెషలిస్టు డాక్టర్లు, ఎస్ఆర్‌లను పంపించేందుకు అంగీకరించాయని తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాల్లో ఎస్‌పీఎం విభాగాధిపతి నేతృత్వంలో స్పెషలిస్ట్ డాక్టర్లు 16 వార్డుల్లో వారం పాటు సేవలందిస్తారన్నారు.

5.35 లక్షల గుడ్లు పంపిణీ

- పాఠశాల విద్యాశాఖ సహాయ చర్యలు

విజయవాడలోని వరద ప్రాంతాల్లో పాఠశాల విద్యాశాఖ చొరవతో 5.35 లక్షల గుడ్లను బాధితులకు పంపిణీ చేశారు. సోమ, మంగళవారాల్లో ఈ పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు గుడ్లు పంపిణీ చేస్తుండగా మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో అధికారులు అదనపు గుడ్లు సమీకరించి వాటిని పంపిణీకి పంపారు. విజయవాడలోని మూడు కన్వెన్షన్ సెంటర్లలో వాటిని ఉడికించి, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో అందజేశారు. ప్రభుత్వం వాటిని బాధితులకు పంపింది. సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు నేతృత్వంలో ఈ సహాయ కార్యక్రమాలు జరిగాయి. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేసింది.

10 వేల నిత్యావసర కిట్ల విరాళం

- సీఎం చంద్రబాబుకు అందజేసిన అక్షయపాత్ర ప్రతినిధులు

మంగళగిరి, సెప్టెంబరు 10: విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో వరద బాధితులను ఆదుకునేందుకు అక్షయపాత్ర ఫౌండేషన్ యూఎస్ఏ ప్రతినిధులు మంగళవారం సీఎం చంద్రబాబుకు 10 వేల నిత్యావసర కిట్లను అందజేశారు. ఈ కిట్ల మొత్తం విలువ రూ.1.5 కోట్లు ఉంటుందని హరేకృష్ణ మూవ్‌మెంట్ గోకుల క్షేత్రం ప్రాంతీయ అధ్యక్షుడు వంశీధర దాస తెలిపారు.

సీఐఐ సాయం 6.77 కోట్లు



సామాజిక బాధ్యతలో భాగంగా వరద బాధితులను ఆదుకోవడానికి రూ.6.77 కోట్లను సీఎం సహాయ నిధికి భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) మంగళవారం అందజేసింది. ఇందులో రూ.4 కోట్ల చెక్‌ను సీఎం చంద్రబాబుకు, సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ, వైస్ చైర్మన్ మురళీకృష్ణ గన్నమనేని, ఇతర కార్యవర్గ సభ్యులతో కలసి అందజేశారు. మిగిలిన రూ.2.77 కోట్లను బాధితులకు నేరుగా ఆహారం, వాటర్ బాటిళ్ల అందించడానికి వెచ్చించారు.

ఎక్సైజ్ విరాళం 2.5 కోట్లు



ఎక్సైజ్ శాఖ రూ.2.5 కోట్ల విరాళం అందజేసింది. ఉద్యోగులు రెండు రోజుల మూల వేతనం రూ.1.5 కోట్లు ఇవ్వగా, బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి మరో రూ.కోటి విరాళంగా ఇచ్చింది. ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, డైరెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబును కలసి చెక్‌ను అందజేశారు. ఉద్యోగ జేఏసీ నేతలు బాబ్జీరావు, బి.నర్సింహులు, ఎం.కోటయ్య, లావణ్య, ఎస్.శ్రీనివాసరావు, కామేశ్వరరావు సీఎంను కలసిన వారిలో ఉన్నారు.



గొల్లప్రోలులో 216 హైవేపై వాహనదారుల ఇక్కట్లు



ఏలేరు కాల్వకు గండి పడ్డంతో మునిగిన రాజుపాలెం

ఏలేరు విలయం

(మొదటి పేజీ తరువాయి)

మునిగిపోయింది. ఇళ్లల్లో వస్తువులన్నీ వరదకు కొట్టుకుపోయాయి. ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ బురదలో కూరుకుపోయాయి. దుస్తులు, వంటపాత్రలు సైతం కొట్టుకుపోయాయి. ఇలా అనేక గ్రామాలు వరదతో నీటమునిగాయి. ముంపు గ్రామాల్లో పాడిపశువులు కొట్టుకుపోతాయనే భయంతో చాలామంది పశువులను ఇళ్లలోకి తెచ్చుకుని కాపాడుకుంటున్నారు. విద్యుత్ కోతతో బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. మంగళవారం నాటికి వరద మహోగ్రరూపం దాల్చింది. కాలువల సామర్థ్యం 10 వేల క్యూసెక్కులు కాగా, 32 వేల క్యూసెక్కులకు విుంచి వరద పారుతుండడంతో ఏడు మండలాల్లో 26 చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో వరద నీరు మొత్తం 45 వేల ఎకరాలకు పైగా ముంచేసింది. జిల్లాలో ఈ ఏడు మండలాల్లో ఎక్కడ చూసినా వరి చేలు నదులను తలపిస్తున్నాయి. వీటిపైన ఆరడుగులకు మించి వరద ప్రవహిస్తుండంంతో నష్టం భారీగా ఉంది.

తీవ్ర నష్టం

- వరద ఉధృతానికి సామర్లకోట-ప్రత్తిపాడు, పిఠాపురం-సామర్లకోట, కిర్లంపూడి-దివిలి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చేలల్లో ఉన్న ఇటుకబట్టీలు, బెల్లం క్రషర్లు, కోళ్లఫారాలు కొట్టుకుపోయాయి. హోటళ్లు, దాబాలు, గోదాముల్లోకి వరద వచ్చేసింది.
- ఏలేరు వరదతో పిఠాపురం నియోజకవర్గం అతలాకుతలంగా మారింది. గొల్లప్రోలు, ఏలేరు వరదకు సుద్దగడ్డ వరద కూడా తోడవడంతో వరద నష్టం తీవ్రంగా ఉంది. ఈ ఒక్క మండలంలోనే 8,500 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి.
- 216 జాతీయ రహదారి వెంబడి చేలన్నీ భారీ నదులను తలపిస్తున్నాయి. ఏలేరు కాలువకు అత్యధికంగా గొల్లప్రోలు మండలంలో 6 చోట్ల గండ్లు పడ్డాయి. పది గ్రామాలు నీటమునిగాయి.
- పిఠాపురం మండలంలో ఏలేరు కాలువకు 9 చోట్ల గండ్లు పడడంతో 14 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు మునిగిపోయాయి. వరద నీరు ప్రధాన రహదారులపైకి వచ్చేయడంతో ఏడింటిని మూసేశారు. 15 గ్రామాలు వరదలో చిక్కుకున్నాయి.
- కిర్లంపూడి మండలంలో ఏలేరు కాలువకు మొత్తం పదిచోట్ల భారీ గండ్లు పడ్డంతో 16వేల ఎకరాల్లో వరి, ఇతర వాణిజ్య పంటలు పూర్తిగా వరదలో మునిగిపోయాయి. కాలువలకు గండ్లు పడ్డంతో మొత్తం 21 గ్రామాల్లో వరద చేరిపోయింది.
- పిఠాపురం నుంచి గొల్లప్రోలు వెళ్లే దారిలో రాపర్తి నుంచి టోల్‌గేట్ వరకు వరద జాతీయ రహదారిపైకి వచ్చేసింది. ఉదయం మోకాల్లోతులో ఉండే వరద సాయంత్రానికి ఆరు అడుగులకు చేరిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో పోలీసులు ఒకవైపు రాకపోకలను నిలిపివేశారు.
- గొల్లప్రోలు, పిఠాపురం శివారు ప్రాంతాల్లోని అనేక కాలనీలను మంగళవారం రాత్రి వరద ముంచేయడంతో బాధితులు ఆకలితో అలమటించారు. ఇళ్లలోకి నీరు వచ్చేయడంతో బయటకు వచ్చే మార్గం లేక అటు సాయం చేసేవారు లేక ఇబ్బందులు పడ్డారు.
- ఏలేరు వరద సహాయక చర్యలపై సైనిక బలగాలు దృష్టి సారించాయి. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోట తదితర గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో సహాయక చర్యలు చేపట్టనున్నాయి. చుట్టుపక్కల ఉన్న 500 కుటుంబాలు ఏలేరు వరద కారణంగా ప్రమాదకర స్థితిలో ఉన్న నేపథ్యంలో సైనిక బలగాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నాయి. ఏదైనా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడితే చర్యలు చేపట్టేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్, బోట్ అసాల్ట్ యూనిట్లను కూడా సిద్ధం చేశారు.

ప్రమాదకరంగా ఏలేరు

ఎగువప్రాంతాల నుంచి వరద నీరు అధికంగా వస్తుండడంతో ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టు పరిస్థితి ప్రమాదకరంగానే ఉంది. మంగళవారం రిజర్వాయర్‌లో 86.56 మీటర్ల నీటిమట్టానికిగాను 85.60 మీటర్ల మేరకు నీరు ఉంది. రాత్రి 10 గంటలకు ఏలేరు రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 18,102 క్యూసెక్కులుగా ఉండగా.. 18,360 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

వంశధారలో వరద ఉధృతి

రెండు రోజులుగా ఒడిశాలో కురిసిన వర్షాలకు మంగళవారం వంశధార నదిలో నీటి ప్రవాహం పెరిగింది. మధ్యాహ్నం ఒంటిగంటకు 30,500 క్యూసెక్కులకు చేరింది. దీంతో శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఆర్‌డీవో సుదర్శనదొర, ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు, తహసీల్దార్ వెంకటరమణ గొట్టా బ్యారేజి వద్దకు చేరుకుని వరద పరిస్థితిని పరిశీలించారు. సాయంత్రం నుంచి వరద ప్రవాహం తగ్గుతూ వచ్చింది. సాయంత్రం 7 గంటలకు ఇన్‌ఫ్లో 22,356 క్యూసెక్కులు ఉండగా బ్యారేజి 19 గేట్లు ఎత్తి 26,661 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు.

నిండుగా కృష్ణా ప్రాజెక్టులు

- శ్రీశైలంలో ఆరు గేట్లు ఎత్తి..
- 2.86 లక్షల క్యూసెక్కులు విడుదల

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో కృష్ణా పరివాహక ప్రాజెక్టులు దాదాపు నిండాయి. ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883.60 అడుగులు ఉంది. డ్యాంలోకి 2,57,873 క్యూసెక్కులు వస్తుండగా.. ఆరు క్రస్టు గేట్లు ఎత్తి, ఆంధ్ర, తెలంగాణ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ద్వారా 2.86 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు 2.78 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. 26 గేట్లను ఎత్తి 2,09,248 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కుడి కాలువ ద్వారా 8,067 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 2,210, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,313, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 589.50 అడుగులు కాగా.. ప్రస్తుతం 589.4 అడుగులు ఉంది. సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో పులిచింతలకు ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో 8 గేట్లు ఎత్తి 2.30 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో ప్రకాశం బ్యారేజీకి వరద పెరిగింది. బ్యారేజీలో 65 గేట్లు ఎత్తి 2,05,867 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

ఉగ్ర గోదారి

- శబరి, సీలేరు ఉపనదులతో పాటు పొంగి ప్రవహిస్తున్న వాగులు
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 10 లక్షల క్యూసెక్కులు



చింతూరు ఒడ్డు వద్ద ధర్నా చేస్తున్న వరద బాధితులు

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/కూనవరం/చింతూరు/ సెప్టెంబరు 10: గోదావరి నది ఉగ్రరూపం దాల్చుతోంది. అటు శబరి, సీలేరు ఉపనదుల నుంచీ భారీ వరద చేరుతోంది. దీంతో ఏజెన్సీ ప్రజలు మళ్లీ హడలెత్తుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని కూనవరం మండలంలో మంగళవారం గోదావరికి వరద పోటెత్తడంతో పలు గ్రామాలను జలదిగ్బంధం చేసింది. భద్రాచలం-కూనవరం మధ్య సంబంధాలు తెగిపోగా, ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికే పాఠశాలలు మూతపడగా మూడు రోజుల నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు కూడా ఆగిపోయాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవడంతో శబరి ఉపనది వేగంగా గ్రామాలను చుట్టుముట్టింది. కూనవరంలో శబరి గోదావరి సంగమం కావడంతో ఆ ప్రదేశం సముద్రాన్ని తలపిస్తోంది. ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు లాంచీలు సిద్ధం చేశారు. ప్రధానంగా శబరి గోదావరి సంగమం వద్ద ఉన్న వంతెనను తాకి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. అటు చింతూరు మండలంలో శబరి, సీలేరు ఉపనదులతో పాటు సోకిలేరు, చంద్రవంక, చీకటివాగు, కుయుగూరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో 22 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మంగళవారం సాయంత్రానికి 34 గ్రామాల పరిసరాల్లోకి వరద నీరు చేరింది. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి , అధికారులు తరలివెళ్లి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పర్యటించారు. జనరేటర్లు, నిత్యవసర వస్తువులు, సహాయ శిబిరాలకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేశారు. అంబులెన్సులు ఏర్పాటు చేసి గర్భిణులను సురక్షితంగా ఆస్పత్రులకు చేరుస్తున్నారు. సహాయ శిబిరాలను ఏర్పాటుచేశారు. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 44 అడుగుల వద్ద, భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48 అడుగుల వద్ద ప్రవహిస్తుండడంతో 326, 30వ నంబరు జాతీయ రహదారులపై రాకపోకలు నిలిచిపోయి చట్టి గ్రామం వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వీఆర్ పురం మండలంలో గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో మండలంలోని ప్రధాన రహదారులపై భారీగా వరదనీరు చేరుకుని దాదాపుగా 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముంచంగిపుట్టు మండల పరిధిలో గల జోలాపుట్టు సమీపంలో ఉన్న ఆంధ్రా-ఒడిశాలను కలిపే వంతెన వరద నీటి ఉధృతికి దెబ్బతింది. వరద ఉధృతి బుధవారం మరింత పెరిగే అవకాశం ఉండడంతో అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత నీటిమట్టం 48.20 అడుగులుగా ఉంది.పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 10,39,627 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. ధవళేశ్వరం బ్యారేజీలో 175 గేట్లు ఎత్తి రాత్రికి 10.01 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నీటిమట్టం 11.30 అడుగులకు చేరింది. 11.75 అడుగులకు చేరగానే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. బుధవారం నాటికి వరద 12-13 లక్షల క్యూసెక్కులకు చేరవచ్చని అంచనా.

వరద బాధితులకు 'తానా' సాయం

- 11 నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ
- ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్ వల్లేపల్లి వెల్లడి



ఎన్టీఆర్ జిల్లా ఈలప్రోలు గ్రామంలో కిట్లు పంపిణీ చేస్తున్న శశికాంత్ వల్లేపల్లి

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులకు సహాయం చేసేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఫౌండేషన్ రంగంలోకి దిగింది. తానా ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్ వల్లేపల్లి ఆధ్వర్యంలో 11 నిత్యావసర వస్తువులతో కూడిన కిట్ల పంపిణీ చేపట్టింది. విజయవాడ పరిసర ప్రాంతాల్లో సాయం అందని ప్రాంతాలకు వెళ్లి బాధితులకు వీటిని అందిస్తోంది. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామంలో 1,645 మంది వరద బాధితులకు ఈ కిట్లను పంపిణీ చేశారు. ఐదుకేజీల బియ్యం, కందిపప్పు, చింతపండు, మంచినూనె తదితర వస్తువులను ఒక కిట్‌గా అట్టపెట్టెల్లో ప్యాక్ చేసి బాధితులకు అందించారు. మూడు నాలుగు రోజుల్లో పదివేల మందికి ఈ కిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తానా ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్ వల్లేపల్లి తెలిపారు. వీటితోపాటు 5వేల మందికి చీరలు, దుప్పట్లు, టవల్స్ కూడా అందిస్తామన్నారు. 11 గ్రామాలలో సహాయ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. తెలంగాణలోనూ వరదబాధితులకు సాయం అందించనున్నట్లు తెలిపారు. హరేకృష్ణ మిషన్‌తో కలిసి తానా ఈ సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో హరేకృష్ణమిషన్ ప్రతినిధి మహాక్రతు కూడా పాల్గొన్నారు.

నేనున్నానంటూ ఆపన్న హస్తం

- కష్టాలను చూసి కదులుతున్న సాయం
- విద్యుత్ ఉద్యోగులు ఒక రోజు వేతనం
- సర్పంచుల సంక్షేమ సంఘం 3.92 కోట్లు
- పంచాయతీరాజ్ చాంబర్ 7.7 కోట్లు విరాళం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



సీఎంకు లేఖ అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు



డిప్యూటీ సీఎం పవన్‌కు లేఖ అందజేస్తున్న సర్పంచుల ప్రతినిధులు

బెజవాడకు బుడమేరు తెచ్చిన కష్టాన్ని చూసి చలించని మనస్సు లేదు. ఎవరికి తోచిన పద్ధతుల్లో వారు.. ఆపన్నులకు సాయం అందిస్తున్నారు. మంగళవారం విజయవాడ కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబును కలిసి ఏపీ ఐఏఎస్ అధికారులు ఒక రోజు వేతనాన్ని విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇక, మంత్రి గొట్టిపాటి రవికుమార్ నేతృత్వంలో విద్యుత్ ఉద్యోగుల జేఏసీ తమ ఒక రోజు జీతం కింద రూ.10,61,18,694,
H ‡G D‰ C f-˘ ˘
$ ˘ *.3.47 M‡r˘
చెక్కును సీఎంకు అందజేశారు. కియా ఇండియా ప్రైవేట్ లిమిడెట్ నుంచి కియా ఇండియా సీఈవో కబ్ డాంగ్ లీ తమ ప్రతినిధులతో కలిసి రూ.3 కోట్లు, నారాయణ విద్యా సంస్థల నుంచి రూ.2.50 కోట్ల విరాళాన్ని సంస్థ ప్రతినిధులు పీ సింధూర, పీ శరణి, పునీత్, ప్రేమ్‌సాయి అందజేశారు. సౌత్ కొరియాకు చెందిన ఎల్‌జీ కంపెనీ గ్లోబల్ కార్పొరేట్ అఫైర్స్ డైరెక్టర్ పాల్ కౌన్ రూ.2 కోట్లు, దేవి సీ ఫుడ్స్ పోట్టు బ్రహ్మానందం, రమాదేవి రూ.2 కోట్లు, అవంతి ఫీడ్స్ నుంచి అల్లూరి ఇంద్రకుమార్, అల్లూరి నిఖిలేష్ రూ.2 కోట్లు, జెమినీ ఎడిబుల్ ఆయిల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ కాకినాడ, కృష్ణపట్నం అక్షయ్‌చౌదరి రూ.2 కోట్లు, ఎకోరెన్ ఎనర్జీ ఎండీ ఎర్నేని లక్ష్మీప్రసాద్ రూ.కోటి, వీసీ జనార్దనరావు రూ.కోటి, తిరుమల కాలేజీస్ చైర్మన్ నున్నా తిరుమలరావు రూ.50 లక్షలు, ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ రూ.50 లక్షలు, ఏపీ సీడ్స్ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి రూ.25 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు, మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, ఏపీ సీడ్స్ ఎండీ శివప్రసాద్ అందజేశారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ రూ.25 లక్షలు, విష్ణు కెమికల్ లిమిటెడ్ అధినేత కృష్ణమూర్తి రూ.25 లక్షలు, రేస్ పవర్ ఇన్ఫ్రా లిమిటెడ్ డైరెక్టర్ సంజయ్ గూడవల్లి రూ.25 లక్షలు, అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ రూ.25 లక్షలు, జింకా రామాంజనేయులు రూ.15 లక్షలు, జస్టిస్ ఎన్వీ రమణ రూ.10 లక్షలు, కోమటి జయరాం, కోమటి కల్పన రూ.10 లక్షలు, టీడీపీ మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ రూ.10 లక్షలు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు రూ.10 లక్షలు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి రూ.10 లక్షలు, సరస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.10 లక్షలు, విజయవాడ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ వెండర్స్ వెల్ఫేర్ సొసైటీ రూ.10 లక్షలు, గాంధీ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ విజయవాడ రూ.10 లక్షలు, డీవీ ఇన్‌ఫ్రా అండ్ ప్రాజెక్ట్స్ రూ.10 లక్షలు, గన్నమనేని మురళీకృష్ణ రూ.10 లక్షలు, పొట్లూరి జనార్దన్‌మూర్తి రూ.10 లక్షలు, వీ వెంకటేశ్వరరావు రూ.10 లక్షలు అందజేశారు. గోవాడ గ్రామస్తులు రూ.6 లక్షలు, కృత్తివెన్ను మండల టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు రూ.3,64,720 అందజేశారు.

డిప్యూటీ సీఎం పవన్‌కు..

ఆపన్నులను ఆదుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపునకు మంచి స్పందన వస్తోంది. ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం 3.92 కోట్లు, పంచాయతీరాజ్ చాంబర్ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా 13,097 మంది సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఒక నెల గౌరవ వేతనం 7.7 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ విలేజ్ సర్వేయర్లు తమ ఒక రోజు మూల వేతనం రూ.80 లక్షలు పత్రాన్ని అందించారు. తాపేశ్వరం సురుచి ఫుడ్స్ అధినేత పీవీవీఎస్ మల్లికార్జునరావు రూ.20 లక్షలు, డ్రీమ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీకృష్ణ మణినేని రూ.10 లక్షలు, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు పెనుగొండ సుబ్బారాయుడు 10 పంచాయతీలకు కలిపి రూ.10 లక్షలు విరాళం ఇచ్చారు.

మంత్రి లోకేశ్‌కు...

విజయవాడలో మంత్రి లోకేశ్ పలువురు దాతలు విరాళాలు అందజేశారు. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన విజయవాణి ప్రింటర్స్ అండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ యజమాని ఎన్.చంద్రకళ రూ.25 లక్షలు, విజయవాడకు చెందిన సీవెల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఎం వీరయ్య రూ.10 లక్షలు, కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు, టీడీపీ నేతలు కలసి రూ.4,59,867, విజయవాడకు చెందిన వీరమాచనేని పవన్ రూ.3,66,666, విజయవాడకు చెందిన వికాస విద్యా వనం ట్రస్టు చైర్మన్ ఎస్ఆర్ పరిమి రూ.2.50 లక్షలు, ఏపీఎస్ఏసీఎస్ ల్యాబ్ టెక్నీషియన్స్



డిప్యూటీ సీఎం పవన్‌కు చెక్ ఇస్తున్న పి.సుబ్బారాయుడు



సీఎం చంద్రబాబుకు చెక్ ఇస్తున్న నారాయణ కాలేజీ ప్రతినిధులు

'హ్యాపీ'నెస్ట్‌కు ఊపిరి!

(మొదటి పేజీ తరువాయి)

పిలిచింది. అమరావతి రాజధాని ప్రాంతంలోని నేలపాడులో 14.5 ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 18 అంతస్తులతో మొత్తం 12 టవర్లను నిర్మించనున్నారు. డిజైన్ అండ్ బిల్డ్ విధానంలో 1200 ఫ్లాట్లను నిర్మిస్తారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధానిలోని ఇతర ప్రాజెక్టుల తరహాలోనే హ్యాపీనెస్ట్‌కు కూడా పాతర వేసింది. ఇది సీఆర్‌డీఏ చేపట్టిన టౌన్‌షిప్ ప్రాజెక్టు కాబట్టి వైసీపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ లబ్ధిదారులు రియల్ ఎస్టేట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా)కు ఫిర్యాదు చేశారు. సీఆర్‌డీఏ ఈ ప్రాజెక్టును చేపట్టాలని రెరా ఆదేశించినా..జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ పేరుతో కొంత కాలం కాలయాపన, రీ టెండర్ల పేరుతో మరికొంత కాలం సాగదీతతో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు గడిపేసింది. ఆ జాప్యం వల్ల తాజాగా టెండర్లు పిలవటానికి మరో రూ.230 కోట్ల అదనపు భారం సీఆర్‌డీఏపై పడుతోంది. దీంతో ఈ అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించేందుకు సిద్ధమవుతోంది. అందువల్ల హ్యాపీనెస్ట్ లబ్ధిదారులకు నయా పైసా కూడా భారం పడే అవకాశం లేదు. అమరావతి మెగా అభివృద్ధి ప్రాజెక్టులతో పాటు హ్యాపీనెస్ట్ వంటి వినూత్న తరహా ప్రాజెక్టుకు 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. అమరావతి రాజధానిలో బయటి ప్రాంతాల ప్రజలు కూడా అందుబాటు ధరలలో ఇళ్లను కొనుగోలు చేసేందుకు వీలుగా సీఆర్‌డీఏ నేతృత్వంలో మెగా టౌన్‌షిప్ నిర్మాణ ప్రాజెక్టుగా హ్యాపీనెస్ట్‌ను తీసుకొచ్చారు. నేలపాడులో 14.5 ఎకరాల విస్తీర్ణంలో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును కడతామని నాడు ప్రభుత్వం ప్రకటించింది. ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, మొదటి వచ్చిన వారికి మొదట అన్నట్టుగా ప్రాధాన్యం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షన్నర మందికి పైగా దరఖాస్తులు చేసుకోగా 1200 మందిని ఎంపిక చేశారు. లబ్ధిదారులు పూచీకత్తు డిపాజిట్ కూడా చెల్లించారు. నిర్మాణ పనులకు గత టీడీపీ ప్రభుత్వంలోనే టెండర్లు పిలవగా, పనులు మొదలు పెడుతున్న దశలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఈ ప్రాజెక్టుకు గండి పడింది. గత ఐదేళ్లు లబ్ధిదారులు చేయని పోరాటం లేదు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్న ఉద్దేశ్యంతో రెరా వంటి సంస్థను ఆశ్రయించి న్యాయపోరాటం చేశారే తప్ప బయటకు వచ్చి ఆందోళన చేయలేదు. ప్రభుత్వం మారుతుందని, ఎప్పటికైనా తమ కలల ప్రాజెక్టు పనులు మళ్లీ మొదలవుతాయన్న ఆశతో ఈ ప్రాజెక్టు నుంచి వైదొలగడానికి ఎవ్వరూ సిద్ధపడలేదు.

అమరావతికి మణి మకుటాయమైన టౌన్‌షిప్..

అమరావతికే సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలిచే టౌన్‌షిప్ హ్యాపీనెస్ట్. జీ ప్లస్ 18 విధానంలో 12 టవర్లు పక్కపక్కనే ఉంటాయి. 12 రకాల కేటగిరీలతో ఫ్లాట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. అన్ని టవర్లకు ఉమ్మడిగా టెన్నిస్ కోర్టు, బాస్కెట్ బాల్ కోర్టు, స్విమ్మింగ్‌పూల్, ఆంపీ థియేటర్, క్లబ్ హౌస్, క్లబ్ హౌస్-2, పూర్తిస్థాయి ఎయిర్ కండిషన్డ్ జిమ్, ఏరోబిక్స్ హాల్, యోగా/మెడిటేషన్ రూమ్, స్పా, సెలూన్, మసాజ్ రూమ్, సూపర్ మార్కెట్, క్లినిక్, ఫార్మసీ డెస్క్, ట్రావెల్ డెస్క్, ఏటీఎంలు, ప్రాజెక్ట్ మెయింటినెన్స్ ఆఫీసు, మెడిటేషన్ గార్డెన్, గూడ్స్ లిఫ్ట్, ఫర్నిష్డ్ ఎయిర్ కండిషన్డ్ గెస్ట్ రూమ్స్, ఔట్ డోర్ ఫిట్నెస్ స్టేషన్, జాగింగ్ - రన్నింగ్ ట్రాక్, రిఫెక్సాలజీ పార్క్ వంటివి ఏర్పాటు చేయనున్నారు.

సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి టెండర్లు

ఏపీసీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.160 కోట్ల వ్యయంతో సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. గత కిందటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే భవనం స్ట్రక్చర్ పనులు జరిగాయి. భవనంలో ఆర్కిటెక్చర్, ఫినిషింగ్ పనులు, ఇతర పనులు, బయట చేపట్టవలసిన అభివృద్ధి పనుల కోసం మంగళవారం టెండర్లు పిలిచారు.


విజయవాడలోని పాయకాపురంలో ఒక వస్త్ర దుకాణంలో బురదను కడుగుతున్న అగ్నిమాపక సిబ్బంది


సింగ్ నగర్‌లో ఓ ఇంటిని శుభ్రం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


విజయవాడలోని భారతీ నగర్‌లో డ్రైనేజీని క్లీన్ చేస్తున్న పారిశుధ్య కార్మికులు


కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చిస్తున్న పయ్యావుల కేశవ్

వరదలతో తీవ్ర నష్టం

- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలకు తెలిపిన పయ్యావుల
- బాధితుల బ్యాంకు రుణాల చెల్లింపుల వాయిదాకు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల బ్యాంకు రుణాల చెల్లింపులు వాయిదా వేయాలని, వడ్డీలు తగ్గించేందుకూ కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తరపున రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు రాష్ట్ర అధికారులు మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రితో భేటీ అయ్యారు. విజయవాడ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వరదల నష్టం వివరాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రాథమిక నివేదిక కాపీని ఆమెకు అందించారు. చిన్న, మధ్య తరహా వ్యాపారాలు దెబ్బతిన్నాయని, వృత్తిపరమైన వ్యాపారులు భారీగా నష్టపోయారని తెలిపారు. తమ విజ్ఞప్తిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని, తుది నివేదికను కూడా త్వరగా ఇవ్వాలని కోరారని పయ్యావుల మీడియాకు తెలిపారు.

ఆపరేషన్ బెజవాడ!

(మొదటి పేజీ తరువాయి)

గడిపారు. అనంతరం తిరిగి విజయవాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ కొంతసేపు అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళ్లారు.

ఊపందుకున్న సహాయక చర్యలు..

'ఆపరేషన్ విజయవాడ' ముమ్మరమైంది. బుడమేరు గండ్లను ఇప్పటికే పూడ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. గట్లను పెంచి పటిష్ఠం చేసే పనులను వేగవంతం చేసింది. వరద ప్రాంతాల్లో గృహ నష్టం అంచనాకు చేపడుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియ రెండో రోజు, మంగళవారం కూడా కొనసాగింది. బుధవారంతో ఈ సర్వేను ముగించాలని సర్కారు టార్గెట్ పెట్టుకుంది. ముంపు ప్రాంతాల్లో చాలావరకు వరద తగ్గిపోయింది. అయితే, చాలా ప్రాంతాల్లో ఇళ్లలోని బురద ఇంకా వదలలేదు. దీంతో ఇళ్లలో వంట చేసుకునే పరిస్థితి చాలా కుటుంబాలకు లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆహార పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తోంది. బాధితులు తిరిగి నిలబడేవరకు వారికి అందిస్తున్న సాయాలను కొనసాగించాలని కూడా భావిస్తోంది. మరోవైపు, వరద నీటిలో నిన్నటిదాకా మునిగి పాడైపోయిన తమ వాహనాలను బాగు చేయించుకునేందుకు వస్తున్నవారితో నగరంలోని మెకానిక్ షాపులు కిక్కిరిసిపోతున్నాయి. ఒక్కో షాపు వద్ద వందల బైకులు కనిపిస్తున్నాయి. ఇంకోవైపు ప్రభుత్వం పురమాయింపుతో రంగంలోకి దిగిన మెకానిక్కులు ఇంటింటికి వెళ్లి ఇళ్లలోని వస్తువులు, వాహనాలను రిపేర్లు చేస్తుండటం కనిపించింది.

సవాలుగా స్వీకరించి..

విజయవాడలో వరదలకు సుమారు రెండున్నర లక్షల కుటుంబాలకు చెందిన ఏడు లక్షల మంది ప్రభావితమయ్యారు. రోజుల తరబడి ముంపులో ఉండిపోయారు. ఆ నీటి మధ్య బాధితులకు సాయం అందించడం...వారిని బయటకు తీసుకురావడం అధికార యంత్రాంగానికి కత్తిమీద సాముగా పరిణమించింది. మరోపక్క గండ్లను పూడ్చడానికి రాష్ట్ర ప్రభుత్వం రాత్రింబవళ్లూ పనిచేసింది. బాధితుల సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుకు వెనకాడకుండా అధికార యంత్రాంగాన్ని పరుగులెత్తించింది. సుమారుగా కోటి ఆహార ప్యాకెట్లు, తొంభై లక్షల మంచినీళ్ల బాటిళ్లు, పాతిక లక్షల లీటర్ల పాల ప్యాకెట్లు బాధితులకు పంచారు. అవన్నీ మారుమూల ప్రాంతాల్లో ఉన్నవారికి మినహా మిగిలిన వారికి లేదనకుండా అందాయి. 150 ఫైర్ ఇంజన్లు, జేసీబీ యంత్రాలు, టిప్పర్లు, ఏడు వేలమంది పారిశుధ్య కార్మికులను పిలిపించి బురదతో నిండిన రోడ్లు శుభ్రం చేయించారు. చెత్త ఎత్తివేయించారు. కాల్వల్లో పూడిక తీయించారు. చరిత్రలో లేనివిధంగా ఫైర్ ఇంజన్లతో ఇళ్లలో బురదను కడిగించారు. అవి వెళ్లలేని సందుల్లోకి పోర్టబుల్ యంత్రాలు పంపి వాటితో కూడా ఇళ్లలో బురదను వదిలించే ప్రయత్నం చేశారు. డ్రోన్లను ముంపు ప్రాంతాల్లోకి పంపి పారిశుధ్య కార్యక్రమం ఎలా జరుగుతోందో వాటికి ఉన్న కెమెరాలతో పరిశీలించారు. ఇటువంటి ప్రయత్నం గతంలో జరగలేదు.

అడిగిందే తడవుగా...

వరద బాధితులను ఆదుకొనే విషయంలో చంద్రబాబు చాలా ఉదారంగా వ్యవహరించారు. బాధితులు అడిగిందే తడవుగా ప్రతి ఇంటికి ఒక జత వస్త్రాలు ఉచితంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. బాధితులకు ప్రతి కుటుంబానికి పాతిక కిలోల బియ్యం, కందిపప్పు, చక్కెర, పామాయిల్, ఆలుగడ్డలు, ఉల్లిపాయలు, నూడుల్స్ ప్యాకెట్లు, బిస్కట్లు, పాల ప్యాకెట్లు, యాపిల్స్ వంటివి పంపిణీ చేయించారు. ఇళ్లలో చెడిపోయిన వస్తువుల రిపేర్ల కోసం తయారీ కంపెనీల ప్రతినిధులను ముఖ్యమంత్రి పిలిపించి వీలైనంత తక్కువ ఖర్చులో రిపేర్లు చేయించడంపై దృష్టి పెట్టారు. బీమా కంపెనీల వారిని పిలిపించి పరిహారం త్వరగా ఇచ్చేలా మాట్లాడారు. బాధితులకు నష్ట పరిహారం ఇచ్చే విషయంలో కేంద్ర సాయం రాబట్టడానికి కూడా ఆయన గట్టి ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి రెవెన్యూ అధికారులు, ఉద్యోగులను పిలిపించి ఇంటింటి సర్వే వేగంగా జరిపిస్తున్నారు. సర్వే పూర్తయి నష్టంపై ఒక అంచనాకు వస్తే తదనుగుణంగా పరిహారం నిర్ణయించాలని అనుకొంటున్నారు.


ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వెళ్తున్న చంద్రబాబుకు వీడ్కోలు చెబుతున్న కలెక్టర్

బాబు బృందానికి బాధితుల మన్ననలు

సహాయ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం చంద్రబాబు విజయవాడ కలెక్టరేట్‌కు మకాం మార్చి అక్కడ బస్సులోనే తన బస ఏర్పాటు చేసుకొని పనిచేశారు. ప్రతిరోజూ ముంపు ప్రాంతాలను విధిగా సందర్శించి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ముంపు తగ్గి బాధితుల్లో అత్యధిక శాతం మందికి ఉపశమనం కలిగిన తర్వాత మంగళవారం రాత్రి ఆయన ఉండవల్లిలోని తన ఇంటికి వెళ్లారు. మంగళవారం ఆయన పెళ్లి రోజు అయినప్పటికీ వేడుకగా చేసుకోలేదు. రోజువారీ పనుల్లోనే ఉండిపోయారు. మంత్రివర్గంలో సగం మంది మంత్రులు, పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు, విజయవాడ ఎంపీ తదితరులు ఈ వరదల్లో బాగా కష్టపడ్డారు. మహిళా మంత్రులు సైతం మోకాలి లోతు నీళ్లలో తిరుగుతూ పనిచేశారు. తద్వారా బాధితులకు చేతనైనంత సాయం చేశారని, వారికోసం కష్టపడ్డారనే ప్రజల ప్రశంసను ప్రభుత్వం పొందగలిగింది. ముఖ్యమంత్రి పడుతున్న శ్రమ రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందడంతో బాధితులను ఆదుకోవడానికి ఈసారి విరాళాలు ఇవ్వడానికి అనేకమంది ముందుకు వచ్చారు. వారి సంఖ్య గతంతో పోలిస్తే బాగా ఎక్కువగా ఉంది. కాగా, సీఎం చంద్రబాబు బుధవారం కాకినాడ జిల్లా ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. అలాగే, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో నీట మునిగిన కొల్లేరు పరివాహక ప్రాంతాలను ఏరియల్ వ్యూ ద్వారా సీఎం పరిశీలించనున్నారు.





కండ్రికలోని ప్రధాన రోడ్డు... మంగళవారం ఈ రోడ్డుపై నీరు పూర్తిగా తొలగిపోయిన దృశ్యం

విపక్షంలోకి వచ్చినా..

కుట్రలు మానలేదు

- వైసీపీది జాతి ద్రోహం.. మనసు నిండా విద్వేషం: చంద్రబాబు
- దాని తప్పుడు పనులకు లక్షల మంది నాశనం
- బుడమేరును గాలికొదిలి అందరినీ ముంచేశారు
- త్వరలో బుడమేరు ఆపరేషన్: ముఖ్యమంత్రి

అమరావతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీది జాతి ద్రోహం.. ఆ పార్టీ మనసు నిండా విద్వేషం. అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ చేసిన తప్పుడు పనులకు ఇప్పుడు లక్షల మంది నాశనమయ్యారు. ప్రతిపక్షంలోకి వచ్చాక కుట్రలు మానలేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. లక్షల ఎకరాలకు నీరందించే ప్రకాశం బ్యారేజీని కూడా దెబ్బ తీయాలని చూశారని ధ్వజమెత్తారు. మంగళవారం సాయంత్రం బుడమేరుకు గండ్లు పడిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. అక్కడే విలేకరులతో మాట్లాడారు. 'ఐదేళ్ల పాలించిన వైసీపీ ప్రభుత్వం బుడమేరుకు పడిన గండ్లను పట్టించుకోకుండా వదిలేసింది. ఆ పార్టీ నేతలు బుడమేరు ప్రవాహ మార్గాన్ని ఆక్రమించుకున్నారు. ప్లాట్లు చేసి అమ్ముకున్నారు. ఆ పాపం వల్లే ఇప్పుడు విజయవాడ నగరాన్ని వరదలు ముంచెత్తాయి. 7లక్షల మంది తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. లక్షల కుటుంబాలు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతిన్నాయి. దుర్మార్గ పాలన వల్ల లక్షల మంది ఎన్ని కష్టాలు పడాల్సి వచ్చిందో ఇదో కేస్ స్టడీ. ఇంత నష్టం చూసిన తర్వాత కూడా వైసీపీ నేతల మనసుల్లో మార్పు రాలేదు. కృష్ణా నదికి కనీవినీ ఎరుగని వరద వస్తే.. ఆ సమయంలో పెద్ద పెద్ద ఇనుప బోట్లను నదిలోకి నిర్లక్ష్యంగా వదిలేశారు. అవి వచ్చి ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీకొట్టాయి. 17 టన్నుల బరువు ఉండే కౌంటర్ వెయిట్లు విరిగిపోయాయి. ఆ బోట్లు బ్యారేజీ ఖానాలను ఢీకొడితే మొత్తం ప్రాజెక్టుకే ప్రమాదం వాటిల్లేది. ఇదంతా బయటకు రావడంతో ఆ బోట్లతో తమకు సంబంధం లేదని దబాయిస్తున్నారు. మీకు సంబంధం లేకపోతే వాటికి మీ పార్టీ రంగులు ఎలా వచ్చాయి? అధికారంలో ఉన్నప్పుడు వాటితో దొంగ ఇసుక వ్యాపారం చేశారు. ఇప్పుడు బ్యారేజీని నాశనం చేయడానికి వాడారు. ఈ తప్పులు కప్పి పుచ్చుకోవడానికి సొంత టీవీ, పేపర్‌తో విషప్రచారం చేస్తున్నారు. ఎదురుదాడి చేస్తున్నారు. ఈ తప్పుడు పనులు చేసిన వారిని వదిలిపెట్టేది లేదు. నేరగాళ్లు రాజకీయ ముసుగు వేసుకొస్తే వదిలిపెట్టం' అని వైసీపీ నేతలను హెచ్చరించారు. ఇంకా ఏమన్నారంటే..

> సీనియర్ ఐఏఎస్ అధికారుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకూ వేల మంది ఎంతో శ్రమకోర్చి పనిచేశారు. వారందరికీ చేతులెత్తి మొక్కుతున్నా. మీడియా కూడా మా శ్రమకు తోడుగా నిలిచింది. వారికీ ధన్యవాదాలు.
>
> వరద పనులు పూర్తి కాగానే ఆపరేషన్ బుడమేరు మొదలవుతుంది. ఆక్రమణలు తొలగిస్తాం. వాగు మార్గాన్ని వెడల్పు చేసి అడ్డంకులు లేకుండా నీరు వెళ్లే ఏర్పాటు చేస్తాం. కొంత భాగం లైనింగ్ చేస్తాం.
>
> - సీఎం చంద్రబాబు

రాత్రింబవళ్లూ యంత్రాంగం పనిచేసింది..

వరదలపై చేసిన యుద్ధంలో గెలిచాం. కానీ వరదలు మిగిల్చిన నష్టం వెంటాడుతోంది. చివరి వ్యక్తి వరకు సాయం అందించేందుకు తీవ్రంగా ప్రయత్నించాం. కానీ కొంత మందికి అందకపోవడం మాకు బాధ కలిగించింది. ప్రతి కుటుంబానికీ నష్టం వాటిల్లింది. వారిని ఎంతో కొంత ఆదుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. ఇళ్లలో ఉండే రకరకాల పరికరాలు నీళ్లలో దెబ్బతిని పోయాయి. ఆ కంపెనీల వారిని ఈ రోజు పిలిపించి మాట్లాడాను. లేబర్ చార్జీ లేకుండా ఉచితంగా చేస్తామని, విడి భాగాలు సగం ధరకు ఇస్తామని కొన్ని కంపెనీలు చెప్పాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమం కింద విడి భాగాలు కూడా ఉచితంగా ఇవ్వాలని కోరాను. కొల్లేరు, ఏలేరు, బాపట్ల జిల్లాలోని లంక గ్రామాలు, ఉత్తరాంధ్రలో కొన్ని ప్రాంతాల్లో వరద నష్టం సంభవించింది. అక్కడ కూడా సాయం చేయడానికి ప్రయత్నిస్తున్నాం. విపత్తు నిధి నుంచి రాష్ట్రానికి కేంద్రం నుంచి సాధారణంగా అందే సాయం మామూలుగానే వస్తుంది. కానీ రాష్ట్రానికి ప్రత్యేకంగా సాయం చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం.



నేటితో ఎన్యుమరేషన్ పూర్తి చేయాలి: సీఎం

వరద ముంపు, నష్టంపై బుధవారం సాయంత్రానికి ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఒక్కరిని కూడా వదలకుండా జాగ్రత్తగా చేయాలని స్పష్టం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 10వ రోజు సహాయ చర్యలపై ఆయన మంగళవారం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి.. భారీ వర్షాలు, తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. 'మనది తుఫాన్లు అధికంగా ఉండే ప్రాంతం. దానికి అనుగుణంగా సమర్థ వ్యూహాన్ని సిద్ధం చేసుకోవాలి. కలెక్టర్లు అప్రమత్తత కొనసాగించాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాలు, వాగులు, వంకలపై పూర్తి అప్రమత్తంగా ఉండాలి' అని సూచించారు. విజయవాడ వీధుల్లో వరద నీరు క్లియర్ అవుతోందని.. పారిశుధ్య పనులు కొనసాగాలని స్పష్టం చేశారు. నిత్యావసర వస్తువుల పంపిణీ బాగా జరుగుతోందని.. సరుకుల పంపిణీ కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జల్లెడ పడతాం

- కాల్వలు, చెరువుల ఆక్రమణలపై సమగ్ర సర్వే
- ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేక చొరవ
- ఆక్రమణల తొలగింపునకు చట్ట ప్రకారమే చర్యలు
- అవసరమైతే కొత్త చట్టం తెస్తాం: మంత్రి నారాయణ

అమరావతి (ఆంధ్రజ్యోతి), విజయవాడ లీగల్, సెప్టెంబరు 10: విజయవాడ వరదలు మిగిల్చిన చేదు అనుభవాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కాలువలు, డ్రెయిన్లు, చెరువుల్లో ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ ఆక్రమణలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా జల్లెడ పడతామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఆక్రమణల తొలగింపునకు సమగ్ర సర్వే నిర్వహించి, కాలువలు, డ్రెయిన్ల ఆధునికీకరణకు చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఇప్పటికే ఇరిగేషన్‌శాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మంగళవారం విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని మీడియా పాయింట్ వద్ద మంత్రి మాట్లాడారు. "ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళనకు త్వరలోనే శ్రీకారం చుడతాం. ఆక్రమణల తొలగింపునకు చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కొత్త చట్టం చేసేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. 200 ఏళ్ల కాలంలో ఎప్పుడూ లేని విధంగా భారీ వర్షాలు కురవడంతో కృష్ణానదికి 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు పోటెత్తింది. బుడమేరుకు పడిన గండ్లు కారణంగా విజయవాడ నగరంలోని 64 డివిజన్లలో 32 డివిజన్లు పది రోజులపాటు ముంపులోనే ఉన్నాయి. బుధవారం ఉదయానికల్లా నీరు పూర్తిగా పోయేలా అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ చేపట్టారు" అని నారాయణ తెలిపారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు నష్టాన్ని అంచనా వేస్తున్నాయని, అవసరమైతే మరిన్ని బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. "ఎన్యుమరేషన్ సమయంలో బాధితులు తమ ఇళ్ల వద్ద లేకపోతే వారు తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ ఆ ప్రక్రియను చేపడతాం. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విజయవాడ వరద ప్రాంతాల్లో ఇప్పటికే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 7,500 మంది పారిశుధ్య కార్మికులతోపాటు విజయవాడ నగరంలో ఉన్న మూడు వేల మంది కలిపి మొత్తం 10 వేల మంది రేయింబవళ్లు పని చేస్తున్నారు" అని మంత్రి తెలిపారు. అయితే, వాటర్ కనెక్షన్ల ద్వారా వచ్చే నీటిని ఈనెల 12వ తేదీ వరకు తాగడానికి, వంటకు ఉపయోగించవద్దని నారాయణ సూచించారు. ఇంకా ఎలాంటి సమస్యలున్నా ఫీడ్‌బ్యాక్ తీసుకుని పరిష్కరించేలా సంబంధిత అధికారులు, సిబ్బందికి ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారని మంత్రి నారాయణ వివరించారు.


గండ్ల వద్ద కొనసాగుతున్న పనులు

తుదిదశకు బుడమేరు గండ్ల పూడ్చివేత

జి.కొండూరు (ఎన్టీఆర్ జిల్లా), సెప్టెంబరు 10: బెజవాడ ముంపునకు ప్రధాన కారణమైన బుడమేరు మళ్లింపు కాలువ (బీడీసీ) గండ్ల పూడ్చివేత పనులు తుదిదశకు చేరుకున్నాయి. గండ్లను విజయవంతంగా పూడ్చిన అధికార యంత్రాంగానికి సీపేజీ నియంత్రణ సవాల్‌గా మారింది. అధికారులు రెండ్రోజులుగా ముమ్మరంగా కృషి చేస్తుండడంతో మంగళవారం నాటికి 95శాతం పనులు పూర్తయ్యాయి. ఇందుకు వినియోగించిన జియో మెంబ్రేన్ షీట్లు (పట్టాలు) సత్ఫలితాలిచ్చాయి. 3.9 కిలోమీటరు వద్ద ఏర్పడిన 100 మీటర్ల అతిపెద్ద గండి లోపల కట్టకు ఈ షీట్ల ఏర్పాటు పూర్తి చేశారు. 4.1 కిమీ వద్ద గండి నుంచి ఒకే ఒక్కచోట కొద్దిగా లీకవుతోంది. ఆ లీకు వద్ద నుంచి.. 3.9 కిమీ వద్ద పడిన గండి మొత్తానికి మెంబ్రేన్ షీటు వేశారు. ఇసుక బస్తాలతో ఆ షీటును కదలకుండా చేశారు. లీకవుతున్న కట్ట పక్కనే సైఫన్ వరకు మరో కట్టను ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం సాయంత్రానికి ఆ కట్టను పూర్తిచేసి.. లీకవుతున్న కొద్దిపాటి నీటిని కూడా కట్టడి చేయాలని భావిస్తున్నారు. ఇంకోవైపు.. సీఎం చంద్రబాబు మంగళవారం సాయంత్రం గండ్లు పూడ్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. గండ్లను పూడ్చిన విధానం, సీపేజీ నియంత్రణ ఎలా చేశారు.. అందుకు ఏం వినియోగించారో అడిగి తెలుసుకున్నారు. గండి పడిన ప్రదేశం నుంచి విజయవాడ వైపు ముంపునకు గురైన పంట పొలాలను కూడా చూశారు. గండ్ల పూడ్చివేతను యుద్ధప్రాతిపదికన విజయవంతంగా పూర్తి చేయించిన జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడిని, సిబ్బందిని అభినందించారు.

గండ్ల పని పట్టండి

- ఇరిగేషన్ ఇంజనీర్లకు ఇదే కార్యక్రమం: మంత్రి నిమ్మల

అమరావతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, వాగులకు గండ్లను గుర్తించి అత్యవసరంగా వాటిని పూడ్చే పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జల వనరుల శాఖ ఇంజనీర్లను ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. మంగళవారం ఆయన విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. "గుర్తించిన గండ్లను పూడ్చడమే తొలి ప్రాధాన్యంగా పెట్టుకోవాలి. కృష్ణానదికి వచ్చిన వరదలకు ఉమ్మడి కృష్ణా జిల్లా సర్కిల్‌లో 381 గండ్లు, గుంటూరు సర్కిల్‌లో 438 గండ్లు..మొత్తం 819 గండ్లు పడ్డాయి. వీటిలో 170 గండ్లు పూడిక పనులు పూర్తి అయ్యాయి. ఇంకా 649 గండ్లు పూడిక పనులు పూర్తి చేయాల్సి ఉంది" అని మంత్రి తెలిపారు. ప్రకాశం బ్యారేజీ కవర్ స్లూయిజ్ గేట్ల చైన్లు పనిచేయడం లేదన్నారు. వీటిని ఎప్పుడు ఏర్పాటుచేశారు. ఎప్పటివరకూ నిర్వహించారనేది సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ధవళేశ్వరం ప్రాజెక్టు వద్ద వరద పది లక్షల క్యూసెక్కులకు చేరవచ్చునని మంత్రి తెలిపారు. అక్కడ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసినందున గోదావరి నదీ పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.


సింగ్ నగర్‌లో ఆహారం పంపిణీ చేస్తున్న సీపీఎం కార్యకర్తలు


నందమూరి కాలనీలోని తడిచిపోయిన పుస్తకాలను ఆరబెట్టుకున్న దృశ్యం


రామకృష్ణాపురంలో రోడ్డు పక్కన ఉచితంగా స్టవ్‌లు రిపేరు చేస్తున్న దృశ్యం


వరద ప్రభావిత ప్రాంతంలో పశుగ్రాసం పంపిణీ చేస్తున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన డాక్టర్ డీవీఎస్ శర్మ

స్పోర్ట్స్



గ్రేటర్ నోయిడా మైదానం

ఇదేమి 'టెస్టు'?

నొయిడాకు ఇదే చివరిమ్యాచ్ కానుందా?

అఫ్ఘాన్-కివీస్ జట్ల మధ్య ఏకైక టెస్టు నిర్వహణపై సర్వత్రా చర్చ జరుగుతోంది. మ్యాచ్ సమయాల్లో వర్షం కురవకపోయినా ఆట జరపలేని ఇక్కడి పరిస్థితులపై మ్యాచ్ రెఫరీ జవగళ్ శ్రీనాథ్ ఐసీసీకి నివేదిక అందజేయనున్నాడు. దీంతో గ్రేటర్ నొయిడా కాంప్లెక్స్ స్టేడియంలో ఇదే చివరి అంతర్జాతీయ మ్యాచ్ కానుందన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి 2016 నుంచి అఫ్ఘాన్ జట్టుకు ఇది హోంగ్రౌండ్‌గా ఉంటోంది. ఇక్కడ ఇప్పటికే ఆ జట్టు 11 వన్డేలు ఆడింది. అందుకే ఈసారి టెస్టుకు కూడా దీన్నే ఎంచుకుంది. అసలు 2019 నుంచి బీసీసీఐ ఇక్కడ కనీసం దేశవాళీ మ్యాచ్‌లను కూడా నిర్వహించడం లేదు.

రెండో రోజూ అదే సీన్
ఇంకా మొదలవని కివీస్-అఫ్ఘాన్ మ్యాచ్



నొయిడా: అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఏకైక టెస్టులో ఇంకా ఒక్క బంతి కూడా పడలేదు. రెండో రోజు మంగళవారం కూడా ఇక్కడి పరిస్థితి ఆటకు అనుకూలంగా లేకపోవడంతో రద్దు చేశారు. ఆదివారం కురిసిన వర్షానికి సోమవారం తొలి రోజు టాస్ పడకుండానే ఆట రద్దయింది. మైదానంలోని నీటిని బయటికి తోడేందుకు ఆధునిక సౌకర్యాలు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. అయితే అదే రోజు సాయంత్రం కురిసిన వర్షానికి గ్రౌండ్ మరింత దారుణంగా తయారైంది. దీంతో మంగళవారం ఆటకు కూడా ఆటంకం ఏర్పడింది. కవర్ పాయింట్, మిడ్ వికెట్ ఏరియాల్లో గుంతలు ఏర్పడ్డాయి. అక్కడ కొత్తగా గడ్డిని ఏర్పాటు చేశారు. తడిగా ఉన్న ఏరియాను ఫ్యాన్లతో ఆరబెట్టేందుకు ప్రయత్నించారు. అయినా మ్యాచ్‌కు అనుకూలంగా కనిపించకపోవడంతో.. మధ్యాహ్నం 3 గంటలకు అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మరోవైపు ఇరు జట్ల ఆటగాళ్లు ఈ పరిణామాలతో అసంతృప్తిగా ఉన్నారు. అలాగే గ్రౌండ్‌లో ఇతరత్రా సౌకర్యాలు కూడా దారుణంగా ఉన్నాయని అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) ఆరోపించింది. అయితే ఈ మ్యాచ్‌కు నొయిడాతో పాటు కాన్పూర్, బెంగళూరు వేదికలను కూడా బీసీసీఐ సూచించిందని సమాచారం. కానీ కాబూల్ నుంచి ఢిల్లీ ద్వారా ఇక్కడి త్వరగా చేరుకోవచ్చునన్న కారణంతో గ్రేటర్ నొయిడాను ఎంపిక చేసుకున్నామని ఏసీబీ అధికారి మెహ్బూబుద్దీన్ రాజ్ తెలిపాడు.

స్వర్ణానికి రూ. 75 లక్షలు



రజత, కాంస్యాలకు రూ. 50, 30 లక్షలు ● పారాలింపిక్స్ పతక విజేతలకు చెక్‌లు ప్రదానం



న్యూఢిల్లీ: పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లకు కేంద్ర క్రీడాశాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ నగదు బహుమతులను అందజేశారు. మంగళవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో ట్రాక్ అండ్ ఫీల్డ్ పారా అథ్లెట్లే ఎక్కువ మంది ఉండగా.. స్వర్ణం గెలిచిన వారికి రూ. 75 లక్షలు, రజతం సాధించిన ప్లేయర్‌కు రూ. 50 లక్షలు, కాంస్యం దక్కించుకొన్న అథ్లెట్‌కు రూ. 30 లక్షల చెక్‌లను మంత్రి బహూకరించారు. మిక్స్‌డ్ ఈవెంట్లలో పతకాలు సాధించిన ఆర్చర్ శీతల్ దేవి లాంటి వారికి రూ. 22.5 లక్షలు లభించాయి. బంగారు పతకాలు సాధించిన జావెలిన్ త్రోయర్లు సుమీత్ అంటిల్, నవ్‌దీప్, క్లబ్ త్రోయర్ ధరమ్‌బీర్, ఆర్చర్ హర్వీందర్ సింగ్ నజరానాలు అందుకొన్న వారిలో ఉన్నారు. 2028 లాస్ ఏంజిల్స్‌లో జరిగే పారాలింపిక్స్‌కు కూడా తమవంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి చెప్పారు. 'పారాలింపిక్స్‌లో భారత్ మెరుగైన ప్రదర్శన చేస్తోంది. 2016లో 4 పతకాలు సాధించగా.. టోక్యో క్రీడల్లో ఆ సంఖ్య 19కి పెరిగింది. పారిస్‌లో 29 మెడల్స్‌తో 18వ స్థానానికి చేరుకొన్నాం. 2028లో ఇంతకు మించి పతకాలు సాధిస్తామ'ని మాండవీయ ఆశాభావం వ్యక్తం చేశారు. లాస్ ఏంజిల్స్ 2032 క్రీడల కోసం సన్నాహకాలను ఆరంభించాలని అథ్లెట్లకు ఆయన పిలుపునిచ్చారు. ఇటీవలే పారిస్‌లో ముగిసిన పారాలింపిక్స్‌లో భారత్ 7 పసిడి, 9 రజత, 13 కాంస్యాలతో మొత్తం 29 పతకాలు సాధించింది. గతవారమే స్వదేశానికి తిరిగి వచ్చిన షూటర్ అవనీ లేఖారా, పారా షట్లర్ నితేష్ కుమార్ తదితరులను ప్రభుత్వం ముందే సన్మానించింది. దీంతో వారు హాజరుకాలేదు.

పారా అథ్లెట్లకు అపూర్వ స్వాగతం

స్వదేశానికి చేరుకొన్న పారా అథ్లెట్లకు ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఉదయం ఇందిరా గాంధీ విమానాశ్రయంలో వీరికి ఆహ్వానం పలకడానికి భారీఎత్తున అభిమానులు హాజరయ్యారు. పతకాలు సాధించిన అథ్లెట్లకు పూలదండలు వేసి మిఠాయిలు తినిపించారు. స్వర్ణం సాధించిన జావెలిన్ త్రోయర్ నవ్‌దీప్‌ను ఫ్యాన్స్ పైకెత్తి సందడి చేశారు. ఆటపాటలు, డప్పులతో ఉత్సాహవంతమైన వాతావరణాన్ని సృష్టించారు.

ఫేవరెట్ భారత్

బరిలో తెలుగు జీఎంలు హారిక, హరికృష్ణ, అర్జున్

చెస్ ఒలింపియాడ్ నేటినుంచి



బుడాపెస్ట్: ప్రపంచ చెస్ పండుగ ఒలింపియాడ్‌కు రంగం సిద్ధమైంది. బుధవారం ప్రారంభమవనున్న ఈ మెగా చెస్ టోర్నీ ఓపెన్ కేటగిరీలో 191 జట్లు, మహిళల విభాగంలో 180 జట్లు తలపడనున్నాయి. ఓపెన్ విభాగంలో గత చెస్ ఒలింపియాడ్‌లో కాంస్యం నెగ్గిన భారత పురుషుల జట్టు ఈసారి రెండో సీడింగ్‌తో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుండగా మహిళల జట్టుకు టాప్ సీడింగ్ లభించింది. దిగ్గజ ఆనంద్, హంపి ఈ పోటీలకు దూరం కావడంతో పురుషుల బృందాన్ని గుకేష్, మహిళల జట్టును తెలుగమ్మాయి హారిక నడిపించనున్నారు. ఫిడే ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్తున్న వైశాలి జట్టుకు వెన్నుదన్ను కానుంది. వీరితో పాటు దివ్యా దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ పావులు కదపనున్నారు. తానియా సచ్‌దేవ్ రిజర్వ్ ప్లేయర్‌గా ఉంది. పురుషుల విభాగంలో తెలుగు ఆటగాళ్లు హరికృష్ణ, ఇరిగేసి అర్జున్, గుకేష్, విదిత్ గుజరాతి, ప్రజ్ఞానంద సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. టాప్‌సీడ్ అమెరికా నుంచి ఫాబియానో కరువానా, వెస్లీ సో, లెవోన్ అరోనియన్‌తో పాటు మూడో సీడ్ చైనా నుంచి ప్రస్తుత వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్‌కు భారత జీఎంల మధ్య రసవత్తర పోరు జరగనుంది.

కాళ్లు, చేతులు లేకున్నా.. బాణాలు సంధిస్తూ..



శీతల్ స్ఫూర్తితో ప్రాక్టీస్ చేస్తున్న ఆర్చర్

న్యూఢిల్లీ: శీతల్ దేవి.. చేతులు లేకున్నా, సడలని ఆత్మవిశ్వాసంతో రెండు కాళ్లతోనే బాణాలు సంధిస్తూ అద్భుతాలు సృష్టిస్తోన్న ఆర్చర్. ఇప్పటికే అంతర్జాతీయస్థాయిలో పతకాలు కొల్లగొట్టిన జమ్మూకశ్మీర్‌కు చెందిన ఈ 17 ఏళ్ల టీనేజర్.. తాజాగా ముగిసిన పారిస్ పారాలింపిక్స్‌లోనూ పతకం సాధించి అబ్బురపరిచింది. ఇప్పుడు శీతల్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆమె గ్రామానికే చెందిన మరో దివ్యాంగ బాలిక ఆర్చరీలో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. కిష్త్వార్ ప్రాంతంలోని లోయిదార్‌కు చెందిన 13 ఏళ్ల బాలికకు పుట్టుకతోనే కాళ్లు, చేతులు లేవు. కానీ, శీతల్ స్ఫూర్తితో ఆ బాలిక, విలువిద్యపై ఆసక్తి పెంచుకొంది. ఆర్చరీ కోచ్ కుల్దీప్ శిక్షణలో ప్రాక్టీస్ చేస్తోంది. ప్రత్యేకంగా తయారుచేసిన కృత్రిమ విల్లు సాయంతో కృత్రిమ కాళ్లతోనే, కోచ్ శిక్షణలో ప్రాక్టీస్ చేస్తున్న ఆ బాలిక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

యూఎస్ ఓపెన్ అరుదైన రికార్డు

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. గతవారం ముగిసిన ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీని పది లక్షల మందికిపైగా అభిమానులు నేరుగా స్టేడియానికి వచ్చి తిలకించడం విశేషం. అర్హత పోటీలతో కలుపుకొని మూడు వారాల పాటు జరిగిన ఈ టోర్నీని ప్రత్యక్షంగా వీక్షించిన అభిమానుల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎనిమిది శాతం పెరిగింది. అర్హత పోటీలను లక్షా 48 వేల 669 మంది, మెయిన్ డ్రా పోటీలను 8 లక్షల 32 వేల 640 మంది నేరుగా వీక్షించారు.

స్విమ్మర్ వ్రితికి రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ సీనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ అమ్మాయి వ్రితి అగర్వాల్ రజతంతో మెరిసింది. మంగళవారం మంగళూరులో ముగిసిన ఈ పోటీల్లోని 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వ్రితి 4 నిమిషాల 25.09 సెకన్లలో రేసును ముగించి ద్వితీయ స్థానంలో నిలిచింది. కర్ణాటక స్విమ్మర్ హర్షిత (4 ని. 24.70) స్వర్ణం దక్కించుకోగా, ఢిల్లీ స్విమ్మర్ భవ్య కాంస్యం అందుకుంది.

రింకూకు పిలుపు

దులీప్ ట్రోఫీని వీడిన 'టెస్టు' ప్లేయర్లు

కొనసాగనున్న యష్ దయాళ్, సర్ఫరాజ్


అనంతపురం: బంగ్లాదేశ్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు ఎంపికైన ఆటగాళ్లు దులీప్ ట్రోఫీని వీడనున్నారు. ఈనెల 19 నుంచి చెన్నైలో తొలి టెస్టు జరగనుండడంతో.. ప్రస్తుతం దులీప్ ట్రోఫీ ఆడుతున్న కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, గిల్, కుల్దీప్, అక్షర్ పటేల్, జైస్వాల్, జురెల్, ఆకాశ్ దీప్ తమ జట్లకు దూరం కానున్నారు. అయితే లెఫ్టామ్ పేసర్ యష్ దయాళ్, సర్ఫరాజ్ ఖాన్ కూడా టెస్టుకు ఎంపికైనా దులీప్ ట్రోఫీలో కొనసాగనున్నారు. దీంతో టీమిండియా తుది జట్టులో వీరికి చోటు దక్కడం లేదని తేలింది. ఈనెల 12 నుంచి రెండో రౌండ్ మ్యాచ్‌లు మొదలవనున్నాయి. దీంట్లో భాగంగా రింకూ సింగ్ ఇండియా 'బి' టీమ్‌లో చేరనున్నాడు. అలాగే జురెల్ స్థానంలో ఆంధ్ర బ్యాటర్ షేక్ రషీద్ ఇండియా 'ఎ' జట్టుకు ఎంపికయ్యాడు. ఇక గిల్ స్థానంలో ఇండియా'ఎ' కెప్టెన్సీ బాధ్యతలను మయాంక్ తీసుకోనున్నాడు.

2030 నాటికి ఏటా కోటి ఈవీ విక్రయాలు

5 కోట్ల ఉద్యోగాల కల్పన ... సియామ్ సదస్సులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్ వాహనాల అమ్మకాలు 2030 నాటికి ఏడాదికి కోటి స్థాయికి చేరతాయని, అప్పటికి ఈ విభాగం 5 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తుందని అంచనాగా కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. భవిష్యత్తులో భారత్ ప్రపంచంలో నంబర్ వన్ ఆటోమోటివ్ తయారీ కేంద్రంగా మారుతుందన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. మంగళవారం నాడిక్కడ భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) 64వ వార్షిక సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 2030 నాటికి పరిమాణపరంగా రూ.20 లక్షల కోట్లకు చేరగల సామర్థ్యం భారత ఈవీ మార్కెట్‌కున్నదని, అలాగే ఈవీ ఫైనాన్స్ మార్కెట్ కూడా రూ.4 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

లిథియం అయాన్ బ్యాటరీల ధర కూడా తగ్గి ఈవీ కొనుగోళ్లకు మద్దతు ఇస్తాయని ఆయన అన్నారు. ప్రస్తుతం మొత్తం ఈవీ అమ్మకాల్లో టూ వీలర్ల వాటా 56 శాతం ఉన్నట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం నాటికి ఈవీ అమ్మకాల్లో 45 శాతం వృద్ధి నమోదైందని, 400 స్టార్టప్‌లు విద్యుత్ టూవీలర్ల తయారీని ప్రారంభించాయని ఆయన వెల్లడించారు. చాలా కంపెనీలు సెల్ తయారీలో కూడా ప్రవేశించినందు వల్ల రాబోయే కాలంలో ప్రపంచ దేశాలకు లిథియం అయాన్ బ్యాటరీలు ఎగుమతి చేయగల స్థాయిలో దేశం ఉంటుందన్నారు.



రూ.75,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు

ఆటోమొబైల్ పీఎల్ఐ పథకం కింద ప్రభుత్వానికి రూ.74,840 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రూ.17,896 కోట్లు ఇప్పటికే పెట్టుబడి పెట్టారని, 30 వేల ఉద్యోగాల కల్పన జరిగిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. ఈ రంగం వృద్ధికి చేయూత ఇవ్వడం కోసం ప్రస్తుతం చార్జింగ్ మౌలిక వసతుల అభివృద్ధిపై తమ శాఖ దృష్టి పెట్టిందన్నారు.

ఎగుమతుల వృద్ధిపై మారుతి ఫోకస్

2030 నాటికి ఎగుమతులు గణనీయంగా పెంచుకోవాలని మారుతి సుజుకీ సీఈఓ హిషాషి టకుచీ చెప్పారు. అందుకే తాము వృద్ధి శాతం గురించి మాట్లాడడంలేదని, అందుకు భిన్నంగా వృద్ధి ఎన్ని రెట్లు ఉండవచ్చని మాట్లాడుతున్నామని ఆయన అన్నారు. నాలుగేళ్ల క్రితంతో పోల్చితే తమ ఎగుమతులు మూడు రెట్లు పెరిగాయని, రాబోయే ఆరేళ్లలో నేటి స్థాయి నుంచి మరో మూడు రెట్లు పెరుగుతాయని ఆయన అన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో తమ తొలి విద్యుత్ మోడల్ ఆవిష్కరించనున్న సందర్భంగా ఈవీలకు అనుకూల వాతావరణం నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ చెప్పారు.

ఈవీ విభాగంలోకి హెచ్ఎంఎస్ఐ

విద్యుత్ వాహనాల తయారీలోకి అడుగు పెట్టాలని హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్స్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) భావిస్తోంది. 2030 నాటికి మూడింట ఒక వంతు అమ్మకాలు ఈ విభాగం నుంచే నమోదయ్యేలా తాము కృషి చేస్తున్నామని కంపెనీ డైరెక్టర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) యోగేశ్ మాథుర్ చెప్పారు. మొత్తం టూ వీలర్ల అమ్మకాల్లో విద్యుత్ టూ వీలర్ల వాటా నిరంతరం పెరుగుతున్నదన్నారు. హెచ్ఎంఎస్ఐ, హోండా టీమ్‌లు తొలి ఈవీ మోడల్‌ను ఉమ్మడిగా అభివృద్ధి చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

టాటా మోటార్స్ ఈవీ ధరలు తగ్గింపు

విద్యుత్ కార్ల ధరలను టాటా మోటార్స్ రూ.3 లక్షల వరకు తగ్గించింది. నెక్సన్ ఈవీ ధర గరిష్ఠంగా రూ.3 లక్షలు తగ్గితే పంచ్ ఈవీ ధర రూ.1.2 లక్షలు, టియాగో ఈవీ ధర రూ.40,000 తగ్గించినట్టు ప్రకటించింది.

సియామ్ ప్రెసిడెంట్‌గా శైలేశ్ చంద్ర

టాటా మోటార్స్ ప్రయాణికుల వాహన విభాగం మేనేజింగ్ డైరెక్టర్ శైలేశ్ చంద్ర 2024-25 సంవత్సరానికి సియామ్ నూతన అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు వైస్ చైర్మన్‌గా ఆయన పని చేశారు. ఆయన స్థానంలో కొత్త వీసీగా అశోక్ లేలాండ్ ఎండీ, సీఈఓ షేను అగర్వాల్ ఎన్నికయ్యారు. డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ సీఈఓ, ఎండీ సత్యకామ్ ఆర్య కోశాధికారిగా ఎన్నికయ్యారు.

బిజినెస్

రూ.932కే విమాన టికెట్

ఫ్లాష్ సేల్ ప్రకటించిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఫ్లాష్ సేల్‌ను ప్రకటించింది. ఈ సేల్‌లో విక్రయించే ఎక్స్‌ప్రెస్ లైట్ సర్వీసుల టికెట్ల ప్రారంభ ధర రూ.932గా ఉంది. ఈ నెల 16 వరకు సేల్ అందుబాటులో ఉంటుందని, 2025 మార్చి 31 వరకు ప్రయాణించేందుకు ఈ సేల్ ద్వారా టికెట్లను బుక్ చేసుకోవచ్చని ఎయిర్‌లైన్స్ స్పష్టం చేసింది. ఎక్స్‌ప్రెస్ వేల్యూ సర్వీసుల బుకింగ్స్‌కూ వర్తిస్తుందని, టికెట్ ధర రూ.1,088 నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించింది.

వచ్చే ఏడాది నుంచి బిజినెస్ క్లాస్‌కు గుడ్‌బై

టాటా గ్రూప్ చేతుల్లోకి వెళ్లిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ వచ్చే సంవత్సరం నుంచి తమ విమానాల్లో బిజినెస్ క్లాస్ సీట్లను ఎత్తివేస్తున్నట్టు తెలిపింది. ప్రస్తుతం ఈ ఎయిర్‌లైన్స్ వద్ద 85 విమానాలున్నాయి. అందులో 25 ఎయిర్‌బస్ ఏ320 విమానాలు కాగా.. 60 బోయింగ్ 737 ఉన్నాయి. ఈ ఏడాది చివరి నాటికి విమానాల సంఖ్యను 100కు పెంచుకోవాలనుకుంటున్నట్లు ఎయిర్‌లైన్స్ తెలిపింది.

ఏపీ ప్రాజెక్టుకు హెచ్‌జెడ్ఎల్ జింక్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న పిన్నాపురం సమగ్ర పునరుత్పాదక ఇంధన, స్టోరేజీ ప్రాజెక్టుకు అవసరమైన నాణ్యమైన జింక్‌ను వేదాంత గ్రూప్ సంస్థ హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్) సరఫరా చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన 200 టన్నులకుపైగా బరువు ఉన్న ట్రాన్స్‌మిషన్ స్టీల్ పోల్ గాల్వనైజేషన్ కోసం ఈ జింక్‌ను సరఫరా చేసినట్టు హెచ్‌జెడ్ఎల్ తెలిపింది. దాదాపు 57 మీటర్ల ఎత్తుతో 400 కేవీ ట్రాన్స్‌మిషన్ సామర్థ్యంతో ఈ ఉక్కు స్తంభాన్ని నిర్మించారు. ప్రముఖ విద్యుత్ ప్రాజెక్టుల కంపెనీ గ్రీన్‌కో ఈ సమగ్ర పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది.

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

సెన్సెక్స్ 362 పాయింట్లు అప్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజు లాభపడ్డాయి. మంగళవారం సెన్సెక్స్ ఒక దశలో 637 పాయింట్ల వరకు ఎగిసి 82,000 ఎగువకు చేరినప్పటికీ.. చివరికి సూచీ 361.75 పాయింట్ల వృద్ధితో 81,921.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 104.70 పాయింట్ల లాభంతో 25,041.10 వద్ద క్లోజైంది. అమెరికా మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో దేశీయంగా ఇన్వెస్టర్లు ఐటీ, టెలికాంతో పాటు కొన్ని బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు పెంచడం ఇందుకు దోహదపడింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 22 లాభపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్ షేరు 2.29 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టైటాన్ షేర్లు ఒక శాతానికి పైగా పుంజుకున్నాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 1.53 శాతం ఎగబాకగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.53 శాతం పెరిగింది. రంగాలవారీ సూచీల్లో టెలికాం 2 శాతం పెరగగా.. యుటిలిటీస్, పవర్, టెక్, ఐటీ, ఇండస్ట్రియల్స్, సర్వీసెస్, హెల్త్‌కేర్ సూచీలు ఒక శాతానికి పైగా పెరుగుదలను నమోదు చేశాయి.

ఆంధ్రా పేపర్ షేర్ల విభజన..

ఆంధ్రా పేపర్ లిమిటెడ్ తన షేర్ల విభజన ప్రక్రియలో భాగంగా అర్హులైన వాటాదారుల రికార్డు తేదీని ఈ నెల 11 (బుధవారం)గా నిర్ణయించింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరును రూ.2 ముఖ విలువతో కూడిన 5 షేర్లుగా విభజించనున్నట్లు ఈ ఏడాది మే నెలలోనే కంపెనీ ప్రకటించింది.

హైదరాబాద్‌లో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్

- రీ సస్టెయినబిలిటీ, షార్ప్ వెంచర్స్ భాగస్వామ్యంలో ఏర్పాటు
- రూ.50 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్, చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సస్టెయినబిలిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ రీ సస్టెయినబిలిటీ, మారికో లిమిటెడ్ చైర్మన్ హర్ష్ మారివాలా కుటుంబానికి చెందిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ షార్ప్ వెంచర్స్ ప్రకటించాయి. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ మారికో లిమిటెడ్ చైర్మన్ హర్ష్ మారివాలా, రీ సస్టెయినబిలిటీ ఎండీ, సీఈఓ మసూద్ మాలిక్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎఫ్ఎంసీజీ పరిశ్రమకు నాణ్యమైన రీసైకిల్డ్ పాలీలిఫైన్స్‌ను సరఫరా చేయటంతో పాటు పర్యావరణం, సమాజానికి మేలు చేకూర్చే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు మారికో చైర్మన్ హర్ష్ మారివాలా తెలిపారు. ఈ రెండు ప్లాంట్లు ఏటా 32,000 టన్నుల ప్లాస్టిక్ వేస్ట్‌ను ప్రాసెస్ చేసే సామర్థ్యం కలిగి ఉంటాయని రీ సస్టెయినబిలిటీ ఎండీ మసూద్ మాలిక్ వెల్లడించారు. ఈ ప్రక్రియ ద్వారా ఏటా 9,000 టన్నుల నాణ్యమైన రీసైకిల్డ్ పాలిమర్స్ ఉత్పత్తి అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు కోసం తొలి దశలో రూ.50 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు మాలిక్ చెప్పారు. ఈ పెట్టుబడుల్లో 15 శాతం షార్ప్ వెంచర్స్‌దని ఆయన తెలిపారు. వచ్చే ఐదేళ్ల కాలంలో ఇరు సంస్థలు దేశవ్యాప్తంగా రీసైకిల్డ్ ప్లాంట్స్‌ను విస్తరించనున్నాయని, ఇందుకోసం పెద్ద ఎత్తున పెట్టుబడులు కూడా పెట్టనున్నట్లు మాలిక్ పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఆరంభంలో ఈ ప్లాంట్ వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. కాగా హైదరాబాద్ ప్లాంట్ వార్షిక ప్రాసెస్ సామర్థ్యం 24 వేల టన్నులుగా ఉండగా రాయ్‌పూర్ ప్లాంట్ సామర్థ్యం 8,000 టన్నులని తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 370 మందికి ఉపాధి లభించనుండగా పరోక్షంగా 2,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.

లాఖీడ్ మార్టిన్‌తో టీఏఎస్ఎల్ ఒప్పందం

భారత్‌లో సీ-130జే హెర్క్యులస్ విమానాల తయారీ !

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా వైమానిక దిగ్గజం లాఖీడ్ మార్టిన్- టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) మధ్య మరో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత వైమానిక దళాని (ఐఏఎఫ్)కి అవసరమైన మధ్య రకం సైనిక రవాణా విమానాల (ఎంటీఏ) సరఫరా కాంట్రాక్టు కోసం పోటీపడాలని లాఖీడ్ మార్టిన్ భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న ఏఎన్-32 విమానాల స్థానంలో 80 సరికొత్త ఎంటీఏ విమానాలు సమకూర్చుకోవాలని భారత వైమానిక దళం భావిస్తోంది. ఇందుకు తన సీ-130జే సూపర్ హెర్క్యులస్ విమానాలు సరఫరా చేసేందుకు లాఖీడ్ బిడ్ సమర్పించింది. ఈ కాంట్రాక్టు దక్కితే ఈ విమానాలను భారత్‌లోనే తయారు చేసేందుకు టీఏఎస్ఎల్‌తో ఒప్పందం ఉపకరిస్తుందని భావిస్తోంది. లాఖీడ్ మార్టిన్‌తో పాటు ఎయిర్‌బస్, ఎంబ్రాయర్ కంపెనీలు కూడా ఈ కాంట్రాక్టు కోసం పోటీపడుతున్నాయి.

యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌పై రూ.2.91 కోట్ల జరిమానా

ముంబై: యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌పై ఆర్‌బీఐ మొత్తం రూ.2.91 కోట్ల జరిమానా విధించింది. అందులో యాక్సిస్ బ్యాంక్‌కు రూ.1.91 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రూ.కోటి పెనాల్టీ పడింది. బ్యాంకింగ్ నియంత్రణ చట్టంలోని కొన్ని నిబంధనలతో పాటు డిపాజిట్ల వడ్డీ రేట్లు, కేవైసీ, తనఖా రహిత పంట రుణాల మంజూరుకు సంబంధించిన నియామవళిని పాటించనందుకుగాను యాక్సిస్ బ్యాంక్‌పై క్రమశిక్షణ చర్యల కింద ఈ జరిమానా విధించినట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. కాగా, డిపాజిట్ రేట్లు, రికవరీ ఏజెంట్ల నియామకం, కస్టమర్ సర్వీసెస్ నిబంధనలను పాటించని కారణంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌పై పెనాల్టీ విధించడం జరిగిందని ఆర్‌బీఐ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,840 ▲	66,770 ▲	91,000 ▲
ముంబై	71,590 ▲	65,576 ▲	82,207 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	525
వరంగల్	492	గోదావరి	520
చిత్తూరు	553	విశాఖపట్నం	530
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	113
వరంగల్	97	గుంటూరు	115
కరీంనగర్	97	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	114
కర్నూలు	97	నెల్లూరు	114
విశాఖపట్నం	99	అనంతపురం	114
గోదావరి	113		

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

వరద ప్రభావిత ప్రాంతాల్లో 100 శాతం నీటి సరఫరా

● కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్: వరద ప్రభావిత ప్రాంతాల్లో 100 శాతం కుళాయిల నీటి సరఫరా పునరుద్ధరించినట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 77,540 నీటి కుళాయిలను పునరుద్ధరించి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రసుత్తం ప్రజలు ఈ నీటిని వాడుటకు మాత్రమే వినియోగించుకోవాలని తాగటానికి కుళాయి నీటిని వాడవద్దని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగటానికి 229 ట్యాంకర్లతో రోజూ 25లక్షల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రజలు ట్యాంకర్లలో సరఫరా చేస్తున్న మంచినీటిని తాగేందుకు వినియోగించుకోవాలని సూచించారు. సర్కిల్-1 పరిధిలో కె.ఎల్.రావునగర్, ఊర్మిళానగర్, నైజాం గేటు, కబేళా, ఐరన్‌యార్డు, హెచ్‌బీకాలనీ, సర్కిల్- పరిధిలో సింగ్‌నగర్, వాంబేకాలనీ, నందమూరినగర్, శాంతినగర్, పాతరాజరాజేశ్వరిపేట, కొత్త రాజరాజేశ్వరిపేటలో ప్రజలు కుళాయిలో వచ్చే నీరు వాడుకకు ఉపయోగించుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.

ప్రత్యేకహోదాతోనే రాష్ట్రాభివృద్ధి: కేపీ పాల్

ధర్నాచౌక్: ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామని మోసం చేసిన వారిపై ఏపీ హైకోర్టులో తాను పిల్ వేయడం జరిగిందన్నారు. దీనిపై కౌంటర్ వేయాలని న్యాయస్థానం చెప్పిందన్నారు. గతంలో సోనియాగాంధీ, చిదరంబం పార్లమెంట్‌లో ప్రత్యేక హోదా ప్రకటించారన్నారు. పదేళ్ల కిందట ఎన్నికల సందర్భంగా అప్పటి ప్రధాని అభ్యర్థిగా ఉన్న నరేంద్ర మోదీ తిరుపతి బహిరంగసభలో మేం అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ మాటను నిలబెట్టుకోలేదని హైకోర్టులో పిల్ వేసి తన వాదనలు వినిపించానన్నారు. విశాఖస్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని న్యాయస్థానం ద్వారా తానే ఆపానన్నారు.

రైళ్లలో బ్యాగ్‌ల దొంగ అరెస్ట్

వన్‌టౌన్: రైళ్లలో ప్రయాణికుల బ్యాగ్‌ల చోరీకి పాల్పడిన గుంటూరు జిల్లా వెనిజెండ్లకు చెందిన మూల్పూరి ఫణీంద్ర రెడ్డిని మంగళవారం రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.1.50 లక్షల విలువైన ల్యాప్‌టాప్, యాపిల్ ఫోన్, శ్యాంసంగ్ టాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించారు. రైల్వే పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ దేవ్ సింగ్ ఉత్తర్వుల మేరకు డిప్యూటీ సూపరింటెండెంట్ రతన్‌రాజు సూచనల మేరకు గవర్నమెంట్ రైల్వే పోలీస్ సీఐ జె.వి.రమణ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే ఆలీబేగ్ కేసు దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్నారు. అతడిని విలేకరుల సమావేశంలో హాజరుపరిచి వివరాలు వెల్లడించారు.

ముంపునకు గురైన ఉద్యోగులకు వేతనాలివ్వాలి

బస్టేషన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా విధులకు హాజరు కాలేకపోయిన ఆర్టీసీ ఉద్యోగులకు ఆన్‌డ్యూటీగా పరిగణించి వేతనాలివ్వాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా నేతలు మంగళవారం ఆర్టీసీ ఆర్‌ఎం ఎం.వై.దానంకు విజ్ఞాపనపత్రం అందజేశారు. ఆర్‌ఎం స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని, ఉద్యోగులకు న్యాయం చేస్తానని చెప్పారని వెల్లడించారు. అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ ఎం.జె. అయ్యప్ప, కార్యదర్శి సి.హెచ్. రామకృష్ణారావు, ప్రచార కార్యదర్శి మల్లేశ్వరరావు, విద్యాధరపురం డిపో కార్యదర్శి పి. శ్రీనివాసరావు, విజయవాడ డిపో ఛైర్మన్ రావు, రమణ, పబ్లిసిటీ సెక్రటరీ మల్లేశ్వరరావు నాయక్ పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది

భవానీపురం: వరద సహాయక చర్యల్లో ఆరు రోజులుగా పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని రాజమండ్రి కార్పొరేషన్ డ్రైవర్ శ్రీనివాస్ అన్నారు. వాటర్ సప్లై కోసం రాజమండ్రి నుంచి 11 మంది డ్రైవర్లు, ఆరుగురు సహాయ సిబ్బంది విద్యాధరపురం హెడ్ వాటర్ వర్క్స్ నుంచి సేవలందిస్తున్నారు. 6 రోజులుగా 4 ట్యాంకర్లు, 2 ట్రాక్టర్ల ద్వారా నీటి మునిగిన వైఎస్‌ఆర్ కాలనీ ట్రిప్పుల ద్వారా ప్రజలకు నీరందిస్తున్నామన్నారు. ఇంకా ఎన్ని రోజులుండాలో తెలియదన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ పిలుపు మేరకు తాము ఇక్కడికి వచ్చి వరద బాధితులకు సేవ చేయడం ఆనందంగా ఉంది.

టీడీపీ నేత కిలాని మృతి

భవానీపురం: విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన 44వ డివిజన్ టీడీపీ నేత, టీఎన్‌టీయూసీ అర్బన్ మాజీ ఉపాధ్యక్షుడు, ఆటోడ్రైవర్ కిలాని దుర్గారావు (51) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. భవానీపురానికి వరదల సంభవించిన రోజు నుంచి లేబర్ కాలనీ, చెరువు సెంటర్‌ల్లో వివిధ నేతలతో కలిసి ప్రజలకు ఆసరాగా నిలిచారని, మంగళవారం ఉదయం 11 గంటల వరకు తమతోనే ఉన్నాడని, అకస్మాత్తుగా గుండెనొప్పి రాగా, ఆసుపత్రికి తీసుకెళ్లే సమయంలో కన్నుమూశాడని టీడీపీ డివిజన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు కన్నీటి పర్యంతమయ్యారు. 23 ఏళ్లుగా దుర్గారావు పార్టీకి సేవచేస్తున్నాడని, భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలున్నారన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ దుర్గారావు మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అర్బన్ కంపెనీ యాప్‌ను వినియోగించుకోండి

● మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్

చిట్టినగర్: వరద బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన అర్బన్ కంపెనీ యాప్‌ను బాధితులు వినియోగించుకోవాలని పట్టణ పేదరికం నిర్మూలన (మెప్మా) మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ అన్నారు. మంగళవారం వాంబేకాలనీ యుటీలిటీ సర్వీస్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులు ఈ యాప్‌ను వినియోగించుకొని పాడైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ సామగ్రి వివరాలను యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం సిబ్బంది వచ్చి రిపేర్లు చేస్తారన్నారు. అధికారులు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మహా గణపతి దర్శనానికి పెరుగుతున్న భక్తులు

భవానీపురం: వరద నీరు తగ్గుముఖం పట్టడంతో విద్యాధరపురం లేబర్‌కాలనీ గ్రౌండ్స్‌లో డూండీ గణేష్ సేవా సమితి పర్యావరణ హితం కోరుతూ వినాయక ఉత్సవాల్లో భాగంగా 72 అడుగుల విజయ మహాగణపతి విగ్రహ దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. తొలి రెండు రోజుల రాకపోకలు పెద్దగా లేవు. కాగా భక్తుల సందర్శన కోసం వరద నీటిపై ప్రత్యేక ఫుట్‌బ్రిడ్జిని నిర్మించడంతో భక్తులు తాకిడి మెల్లగా పెరిగింది. ఖైరతాబాద్ విగ్రహం తయారు చేసిన కార్మికులే ఈ విగ్రహాన్ని రూపొందించడం విశేషం. ప్రత్యేక పూజల్లో భాగం గా 4వ రోజు వరకు భక్తులు లక్షపైనే స్వామిని దర్శించుకున్నారని నిర్వాహకులు డూండీ రాకేష్ తెలిపారు.

స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా శ్రీనివాసరావు

కృష్ణలంక: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయపు అదనపు సంచాలకులు కేవీఎన్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన పదవీకాలం 2024-26 విద్యా సంవత్సరం వరకు కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపీ సత్యప్రసాద్, టి.శ్రీలత, టి.విజయవర్మ, టి.పూర్ణచంద్రరావు అభినందించారు.

పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను బాగుచేయండి

● కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

వన్‌టౌన్, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు ముంపునకు గురైన ప్రాంతాల్లో బాధితుల ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు తడిసి పాడైపోయాయని, ఎలక్ట్రానిక్ కంపెనీలు సామాజిక బాధ్యతతో పాడైన వస్తువులను బాగుచేయటానికి ముందుకు రావాలని సీఎం చంద్రబాబు పిలుపు నిచ్చారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ ఎలక్ట్రానిక్ కంపెనీల ప్రతినిధులతో సీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువుల విడిభాగాలను సాధ్యమైనంత రాయితీతో అందించాలన్నారు. ఎలక్ట్రానిక్ కంపెనీల మెకానిక్‌లు, సేవల బృందాలు ఒకే వేదిక పైకివచ్చి బాధితులకు సేవలందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కంపెనీల వారీగా హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటుతో పాటు అదనంగా సాంకేతిక నిపుణులను వినియోగించాలన్నారు. కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ వరద ప్రాంతాలలో ప్రత్యేక సర్వీసు హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేసి సేవలందిస్తామని సీఎంకు తెలిపారు.



కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం

రైతులు, వరద బాధితులను ఆదుకోవాలి

● సీఎం చంద్రబాబుకు రైతు సంఘాల వినతి

సత్యనారాయణపురం, సెప్టెంబరు 10: వరద బాధితులను ఆదుకోవడానికి శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీ రైతుసంఘాల సమన్వయసమితి నేతలు మంగళవారం వినతి పత్రం అందజేశారు. భారీవర్షాల కారణంగా రైతులకు నష్టం జరిగిందని వారిని ఆదుకోవాలని, ఈ ఖరీఫ్ సీజన్‌లో తీసుకున్న పంటరుణాలన్నీ రద్దు చేసి రైతులకు అండగా నిలబడాలని చంద్రబాబును కోరారు. ఏపీ రైతుసంఘాల సమన్వయసమితి కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలెక్టర్ ఆఫీసులో కలిసి రైతుల సమస్యలను వివరించి ఆదుకోవాలని కోరారు. 19 జిల్లాల్లో 5లక్షల ఎకరాల్లో ఆహార, వాణిజ్య, ఉద్యానవన, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని రైతులు తీసుకున్న పంటరుణాలన్నింటినీ రద్దు చేయాలని, కౌలు రైతులకు ఆర్థిక సహకారం అందించాలని వినతిపత్రం అందజేశారు. నేతల బృందం విన్నవించిన అంశాలన్నింటినీ శ్రద్ధగా విన్న చంద్రబాబు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. వై కేశవరావు, అక్కినేని భవాని ప్రసాద్, డి. హరనాథ్, పి.జమలయ్య, చల్లపల్లి విజయ, మరీదు ప్రసాద్‌బాబు, కొల్లరాజమోహన్, పి. వీరాంజనేయులు గొగినేని ధనశేఖర్ పాల్గొన్నారు.



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ఇన్సూరెన్స్‌కు సవాలక్ష ఆంక్షలు..?

● ఫ్లడ్ క్లెయిమ్ ఎగ్గొట్టేందుకే ఈ నిబంధనలంటున్న బాధితులు

లబ్బీపేట, సెప్టెంబరు 10: బుడమేరు వరద అనేక మందిని ఆర్థికంగా కృంగతీసింది. ఎన్నో ఏళ్ల నుంచి కష్టపడి సంపాదించుకున్న ఆస్తులు నీటి పాలయ్యాయి. బాధితలను ఆదుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పాడైన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ఇతర వాహనాల ఇన్సూరెన్స్‌ను వీలైనంత త్వరగా అందజేసేందుకు ఇన్సూరెన్స్ కంపెనీలతో మాట్లాడిన ప్రభుత్వం ఇన్సూరెన్స్ (ఫ్లడ్) క్లయిమ్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను నగరంలోని మాంటిస్సోరి స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసింది. బుధవారం ప్రారంభమైన ఈ సెంటర్‌లో న్యూఇండియా, నేషనల్, ఓరియంటల్, ఐడీఎఫ్‌సీ, రిలయన్స్, ఆదిత్య బిర్లా, బజాజ్, శ్రీరామ్, చోలా వంటి కంపెనీలు వినియోగదారులకు సేవలందిస్తున్నాయి. ఆయా ఇన్సరెన్స్ కంపెనీల ప్రతినిధులు వాహనాల యజమానుల ఇష్టప్రకారం వాహనాల క్లయిమ్‌ను స్పాట్ సెటిల్‌మెంట్‌తో పాటు క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సెటిల్‌మెంట్‌ను అందిస్తున్నాయి. ఈ సెంటర్ ఏర్పాటుపై వాహనాదారుల నుంచి హర్షం వ్యక్తమవుతున్నా స్పాట్ సెటిల్‌మెంట్ విషయంలో విభేదిస్తున్నారు. వరదలో పీకల్లోతు మునిగి ప్రాణాలతో బయటపడితే చాలనుకుని బయటపడితే ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు వాహనాలు నీటిలో పూర్తిగా ఉన్న ఫొటోలు కావాలనడంతో స్పాట్ సెటిల్‌మెంట్ తక్కువ ఇస్తూ మరింత కృంగదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇన్సూరెన్స్ కంపెనీ స్టాళ్ల వద్ద కిటకిటలాడుతున్న వాహనదారులు

కొత్త వాహనాల యజమానుల లబోదిబో

అసలే వరదలతో సర్వం కోల్పోయిన బాధితులకు కొత్త వాహనాల కొనుగోలు సమయంలో చేస్తున్న ఇన్సూరెన్స్‌పై అవగాహన లేక కంపెనీల ప్రతినిధుల చెప్పే వివరాలతో లబోదిబో మంటున్నారు. దీంతో చాలామంది వాహనదారులు వెనక్కి తిరిగి వెళ్లిపోతున్నారు. ఇక్కడికి వచ్చిన వాహదారులు కొందరు ఆంధ్రజ్యోతి వద్ద తమ ఆవేదనను ఎకరువు పెట్టారు.

కృష్ణహోటల్ సెంటర్‌కు చెందిన వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2022లో వాహనం కొనుగోలు చేశానని, మొదటి ఏడాది మాత్రమే ఫుల్ ఇన్సూరెన్స్ వస్తుందంటున్నారు. ఏడాది తరువాత ఫోన్ సమాచారం లేదు. ఇక్కడికి వస్తే థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌లో క్లయిమ్ వర్తించదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగెస్ ఎస్సీ సెల్, కెఎల్ రావు నగర్‌కు చెందన ప్రకాష్ మాట్లాడుతూ 2016 మోడల్ రెనాల్ట్ క్విడ్ కారు వరదలో పూర్తిగా మునిగింది, రూ.లక్షా 50వేల ఇన్సూరెన్స్ ఉంటే స్పాట్ సెటిల్‌మెంట్ కింద రూ.10వేలు ఇస్తామంటున్నారు. పైగా వరద నీటిలో పూర్తిగా మునిగిన ఫొటో కావాలంటున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీల ఆంక్షలు క్లయిమ్ ఇచ్చేలా లేదు ఎగ్గొట్టేలా ఉంది. జక్కంపూడికి చెందిన తిరుపతిరాజు మాట్లాడుతూ తన లారీ పూర్తిగా నీటిలో మునిగిపోయిందని, అప్పుడు ఫొటోలు తీయడానికి సాధ్యం కాలేదు. వరద తగ్గాక ఫొటోలు తెస్తే లారీని నీటితో కడిగామని బురద ఉంటేనే క్లైయిమ్ ఇస్తామంటున్నారు. గొరిపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ నాది అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనం హనుమాన్ జంక్షన్ నుంచి లోడ్ కోసం ఆదివారం మధ్యాహ్నం కండ్రిక వచ్చా. అక్కడున్న నీరు చూసి వర్షపు నీరు అనుకున్నా కొంత సమయానికే వరద పెరిగి వాహనం మునిగింది. ప్రాణాలు కాపాడుకోవడానికి అక్కడి నుంచి వెళ్లిపోయా. వాహనం పాడైంది రూ.2లక్షల వరకు అవుతుందంటున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీ వారు లక్షన్నర వరకు ఇస్తామంటున్నారు. మిగిలిన డబ్బులు ఎక్కడి నుంచి తేవాలి. వాంబే కాలనీకి చెందిన ముదిగొండ చిన్నా మాట్లాడుతూ ఆటో కొని 16నెలలైంది. ఫైనాన్స్, ఆటో కొన్న సమయంలో అన్ని ఖర్చులు కలుపుకుని రూ.నాలుగున్నర లక్షలు అయింది. ఇక్కడికి వస్తే స్పాట్ సెటిల్‌మెంట్ రూ.3500 ఇస్తామంటున్నారు. రిపేర్‌కు రూ.లక్షన్నర లక్షల వరకు అవుతుంది. ఇదేంటని ఇన్సూరెన్స్ అడిగితే ఆటో పూర్తిగా మునిగిన ఫొటో, నెంబర్ కనపడేలా ఫొటో కావాలంటున్నారు. ఏంచేయాలో అర్థం కావడం లేదు. ఇలా ఇన్సూరెన్స్ కంపనీల వాళ్లు సవాలక్ష ఆధారాలు కోరుతూ క్లైయిమ్స్ నిరాకరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ఈ ఏర్పాటు చేసినా కంపెనీల వాళ్ల ఆంక్షలతో తమకు ఎందుకూ పనికిరాకుండా పోయిందని వాపోయారు.

బాధితులను ఆదుకుంటున్నాం

● మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు బొజ్జల, సోమిరెడ్డి

కృష్ణలంక, సెప్టెంబరు 10: విద్యుత్ ఉద్యోగులు ఒకరోజు జీతం రూ.10 కోట్ల 61 లక్షల 81 వేల 614 సీఎం సహాయ నిధికి అందించారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. 10రోజులుగా బాధితులను ఆదుకోవడంలో సీఎం చంద్రబాబు ముందుచూపుతో వ్యవహరిస్తూ ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కాపాడారన్నారు. విద్యుత్ ఉద్యోగులు కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో పనిచేస్తూనే తమ సేవలు అందిస్తున్నారన్నారు. ఏపీ విద్యుత్ జేఏసీ ఛైర్మన్ సాన కృష్ణయ్య మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు మొదటి నుంచి సీఎం ఎంతో సహకరిస్తున్నారన్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలతో నగర ప్రజలు తీవ్రంగా దెబ్బతిన్నారన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వరదలతో వేలాది కుటుంబాలు వీధినపడ్డాయన్నారు. ప్రజల కోసం అహర్నిశలు, అనుక్షణం పరితపిస్తున్న నేత సీఎం చంద్రబాబు అని అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన పలువురు సీఎంను కలిసి విరాళాలు ఇచ్చారన్నారు. విష్ణు కెమికల్స్ ఇండస్ట్రీ రూ.25 లక్షలు, రేజ్ పవర్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ రూ.50 లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు వరద సహాయక చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఎమ్మెల్యేకు ఒక డివిజన్ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. తాను 64వ డివిజన్‌లో సహాయక చర్యలను పర్యవేక్షించానన్నారు. కలెక్టరేట్‌నే కార్యాలయంగా చేసుకొని సీఎం చంద్రబాబు 10 రోజులుగా పాలన సాగిస్తున్నారన్నారు. ప్రతి నిమిషం ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికే మా తల్లి 2వేల చీరలు పంచి పెట్టారన్నారు. శ్రీకాళహస్తి ఇండస్ట్రీ తరఫున రూ.1.3 కోట్లు, రైస్ మిల్లర్ అసోసియేషన్ తరఫున రూ.25 లక్షలు అందించారన్నారు. అలాగే శ్రీకాళహస్తి హోటల్స్ అసోసియేషన్ విరాళం అందించనుందన్నారు. అనంతరం సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల వల్ల సంభవించిన నష్టం మాటల్లో చెప్పలేమని, వర్ణనాతీతమన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన ఆయిల్ కంపెనీల తరఫున రూ.2.97కోట్లు విరాళాల చెక్కును సీఎంకు అందజేశారన్నారు.

దసరా ఏర్పాట్లపై మంత్రి ఆనం సమీక్ష

విజయవాడ - ఆంధ్రజ్యోతి: 'దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సక్రమంగా విధులు నిర్వహించని వారిని వెంటనే పక్కన పెట్టండి.. వారి స్థానంలో వేరే ఉద్యోగులను పెట్టుకోండి. అని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దుర్గగుడి ఈవో కేఎస్ రామారావుకు సూచించారు. మంగళవారం మంత్రి ఆనం దుర్గగుడిలో దసరా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ముందుగా ఈవో రామారావు, ఈఈలు కోటేశ్వరరావు, లింగం రమాదేవితో కలిసి ఇటీవల ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియల ప్రదేశాన్ని పరిశీలించారు. కొండపై ప్రొటోకాల్ కార్యాలయంలో దసరా ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది జరిగిన దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు కల్పించిన భద్రతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది దసరా ఉత్సవాల ఖర్చులు, వచ్చిన ఆదాయం గురించి మంత్రి ఈవోను ప్రశ్నించారు. ఈవో సరైన సమాధానం చెప్పలేకపోవటంతో మంత్రి కొంత అసహనం వ్యక్తం చేశారు. అన్ని విభాగాల అధికారులు గతేడాది జరిగిన దసరా ఖర్చులు, వచ్చిన ఆదాయం చర్చించుకుని దేవదాయశాఖ కమిషనర్‌ను కలిసి తర్వాత తన వద్దకు రావాలన్నారు. మరోసారి సమీక్ష చేద్దామని తెలిపారు.

మంత్రిని పక్కదారి పట్టించిన ఈఈ

మంత్రి దసరా ఏర్పాట్లు పరిశీలించటానికి కొండపైకి వచ్చినప్పుడు ఓ ఈఈ ప్రధాన పనులను మంత్రి పరిశీలించకుండానే పక్కదారి పట్టించారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మంత్రి ఘాట్‌రోడ్డు కిందకు వెళ్లి కొండ దిగువన జరుగనున్న ఏర్పాట్లను పరిశీలించాలని భావించారు. అయితే ఆ మార్గంలో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉండటంతో మంత్రిని అటుగా వెళ్లనీయకుండా ఈఈ పక్కదారి పట్టించారు.

కృష్ణమ్మ నవహారతులకు ఏర్పాట్లు

వన్‌టౌన్: మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచనల మేరకు పవిత్ర కృష్ణానదికి నవహారతులు సమర్పించేందుకు మంగళవారం దుర్గగుడి ఈవో రామారావు, వైదిక కమిటీ సభ్యులు, ఈఈతో కలిసి దుర్గాఘాట్‌ను పరిశీలించారు. నవహారతులు కృష్ణానదీమ తల్లికి ఇచ్చేందుకు అనువైన వేదికను త్వరగా పూర్తిచేయాలని ఈవో ఆదేశించారు. డీఈవో లీలాకుమార్, స్థానాచార్యుడు విష్ణుబొట్ల శివప్రసాద్ శర్మ పాల్గొన్నారు.



మంత్రి లోకేష్‌కు చెక్కును అందిస్తున్న అచ్యుతరావు కుటుంబసభ్యులు, సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న ఎంబీఎంఆర్ ఇన్‌ఫ్రా అధినేత బాలమన్మథరావు దంపతులు, విజయవాడ మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్ ప్రతినిధులు

సీఎం సహాయనిధికి విరాళాల వెల్లువ

పెనమలూరు, సెప్టెంబరు 10: అకాల వర్షాలతో అతలాకుతలమైన నగర పరిసర ప్రాంత వరద బాధితులకు బాసటగా దాతలు మంచి మనసుతో ముందుకొస్తున్నారు. మంగళవారం పెనమలూరుకు చెందిన ఎంబీఎంఆర్ ఇన్‌ఫ్రా అధినేత మునునూరు బాలమన్మధరావు, శ్రీలక్ష్మి దంపతులు కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబును కలిసి రూ.10 లక్షల 116ల చెక్కును అందజేశారు. ఇతోధిక సహాయానికి చంద్రబాబు దంపతులను అభినందించారు. బాలమన్మధరావు దంపతులతో పాటు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కిలారు వీరబ్రహ్మాజీ ఉన్నారు. అలాగే దివంగత వేమూరి సుందరరామయ్య జ్ఞాపకార్థం వారి వారసులు వీరమాచనేని అచ్యుతరావు, వీరమాచనేని పవన్ దంపతులు రూ.3,66,666ల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి మంత్రి నారా లోకేష్‌ను కలిసి అందజేశారు. వీరమాచనేని కుటుంబసభ్యులను మంత్రి అభినందించారు. అలాగే వెలగపూడి శంకరబాబు ఆధ్వర్యంలో విజయవాడ మహాత్మా గాంధీ హోల్‌సేల్ మార్కెట్ తరఫున వ్యాపారులు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రూ.10లక్షల చెక్కును అందజేశారు. మార్కెట్ ప్రతినిధులను చంద్రబాబు అభినందించారు.



ఆంధ్ర హాస్పిటల్, సేఫ్ ఎన్విరాన్ రూ.10లక్షలు

పటమట: వరద బాధితుల సహాఆర్థం ఆంధ్ర హాస్పిటల్స్ ఎండీ పీవీ రమణమూర్తి, సేఫ్ ఎన్విరాన్ ఎండీ వెలగపూడి వెంకటేశ్వరరావు సంయుక్తంగా రూ.10లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు సమక్షంలో సీఎం చంద్రబాబుకు కలెక్టరేట్‌లో అందజేశారు.

ఎంవీఆర్ చౌదరి రూ.5 లక్షలు

విజయవాడ: టీడీపీ సీనియర్ నేత, ఎంవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఎంవీఆర్ చౌదరి వరద బాధితుల సహాయార్థం చెక్కు రూపంలో ఉన్న రూ.5 లక్షల విరాళాన్ని మంగళవారం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి అందజేశారు.

85 ఏళ్ల రైతు రూ.లక్ష

హనుమాన్‌జంక్షన్ రూరల్: రంగన్నగూడెంకు చెందిన సన్నకారు రైతు కసుకుర్తి రాధాకృష్ణమూర్తి 85ఏళ్ల వయస్సులో పెద్ద మనసును చాటుకున్నారు. వరద బాధితులకు రూ.లక్ష విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం కలిసి అందజేశారు. ఎన్నారై తుమ్మల రాంబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మల దశరథరామయ్య పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టును పరిశీలించిన కృష్ణా కలెక్టర్

గన్నవరం, సెప్టెంబరు 10: మండలంలోని పలు గ్రామాలను కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు మునిగాయి. తొలుత గన్నవరం విమానాశ్రయాన్ని పరిశీలించారు. అక్కడ బుధవారం జిల్లాలో సంభవించిన అధిక వర్షాలు, వరదలు నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్రం నుంచి ప్రత్యేక బృందం రానున్నారని కలెక్టర్ తెలిపారు. అందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశపు మందిరంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ కోసం ప్రొజెక్టర్, సౌండ్ సిస్టం, అలాగే మందిరం వెలుపుల చాయా చిత్ర ప్రదర్శన ఏర్పాట్లపై చర్చించారు. జిల్లాకు విచ్చేసే కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తారన్నారు. ముఖ్యంగా వ్యవసాయ, ఉద్యానవన పంటలు, ఆక్వా రంగానికి అధిక మొత్తంలో నష్టం వాటిల్లిందని ముంపునకు గురై గృహాలు సైతం దెబ్బతిన్నాయన్నారు.



ఎయిర్‌పోర్టును పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

వైసీపీ నేత హల్‌చల్

ఇదిలా ఉండగా విమానాశ్రయంలో వైసీపీ బాపట్ల జిల్లా వేమూరి ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు హల్‌చల్ చేశారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు వచ్చిన ఆయన నను అరైవల్‌కు పంపాలని సీఐ శివ ప్రసాద్‌ను ఒత్తిడి చేశారు. నిబంధన మేరకు పంపడానికి అవకాశం లేదని చెప్పడంతో వాగ్వాదానికి దిగాడు. అధికారుల ఆదేశాల మేరకు కొంతమందినే పంపాలని చెప్పడంతో ఆయన పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

నగరంలో 'ఉరుకు పటేలా' సందడి

లబ్బీపేట, సెప్టెంబరు 10: నగరంలో 'ఉరుకు పటేలా' చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్రం విజయోత్సవంలో యాత్రలో భాగంగా లబ్బీపేటలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో తేజస్ కంచర్ల మాట్లాడుతూ సెప్టెంబర్ 7న విడుదల చేసిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. లవ్, కామెడీ, థ్రిల్లర్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని, తెలంగాణ, ఆంధ్రలోనూ విజయోత్సవ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. దర్శకుడు వివేక్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మంగా ఈ చిత్రాన్ని తీశామన్నారు. హీరోయిన్ కుష్బూ చౌదరి మాట్లాడుతూ తన మొదటి చిత్రం ఇంత విజయవంతం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న హీరో హీరోయిన్లు తేజస్, కుష్బూ

రేపు జిల్లా యోగాసన పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, సెప్టెంబరు 10: జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోనగర్ గేట్ సమీపంలోని యెగా హెల్త్ సెంటర్‌లో ఈ నెల 12న గురువారం ఉదయం 8 గంటలకు జిల్లాస్థాయి యోగాసన పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొంగర సాయి ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, ఆర్టిస్టిక్ యోగా పెయిర్, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, సీనియర్ ఏ,బీ,సీ కేటగిరుల్లో బాలబాలికలు పోటీలుంటాయన్నారు. పాల్గొనే వివరాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు యోగాసన సెక్రటరీ రాజేశ్వరిని 7675893062 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

14న మంగళగిరిలో క్రికెట్ సెలక్షన్స్

ఇటీవల వర్షాలు, వరదల కారణంగా వాయిదా వేసిన కేడీసీఏ అండర్-14 బాలుర క్రికెట్ సెలక్షన్స్‌ను ఈ నెల 14న ఉదయం 8 గంటలకు మంగళగిరిలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఎం రవీంద్రచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ సుడిగాలి పర్యటన ● రైల్వే బ్రిడ్జి, విజయవాడ - తేలప్రోలు సెక్షన్, రాయనపాడు శాటిలైట్ స్టేషన్ పరిశీలన

ఆంధ్రజ్యోతి, విజయవాడ: వాతావరణ పరిస్థితులు తీవ్రంగా ఉన్నపుడు అధికారులెపుడూ అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సూచించారు. తుపాన్ల, వరదల సమయంలో అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండి మెరుపు వేగంతో పని చేయాలన్నారు. బుడమేరు, కృష్ణానది వరదలతో విలవిల్లాడిన నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ప్రధానంగా కృష్ణానదికి రికార్డుస్థాయిలో వచ్చిన వరదతో రైల్వే బ్రిడ్జి ఎలా తట్టుకోగలిగింది? రైల్వే ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలు ఎలా సత్ఫలితాలనిచ్చాయి ? వంటి అంశాలను పరిశీలించారు. నగరానికి వచ్చీ రావటంతోనే ఆయన కృష్ణానదిపై నిర్మించిన రైల్వే బ్రిడ్జిని పరిశీలించారు. తుప్పు పట్టకుండా ఉండేలా గిర్డర్ బ్రిడ్జ్‌లకు ప్రొటెక్టివ్ గార్డులను ఏర్పాటు, రైల్ క్లిప్ ఇన్‌సర్టింగ్ టూల్స్ వంటి ఆవిష్కరణలను పరిశీలించారు. తర్వాత విజయవాడ - తేలప్రోలు సెక్షన్‌ను పరిశీలించారు. గన్నవరంలో కొత్తగా నిర్మించిన బ్యాలస్ట్ క్లీనింగ్ మెషీన్‌ను ఆయన పరిశీలించారు. తర్వాత రాయనపాడు స్టేషన్‌ను సందర్శించారు. బుడమేరు వరద ప్రభావిత యార్డులను సమీక్షించారు. రాయనపాడు స్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు పెట్టి ప్రయాణికులను తరలించిన విషయాన్ని రైల్వే అధికారులు జీఎంకు వివరించారు. జీఎం పర్యటన వెంట డీఆర్‌ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్, ఇతర బ్రాంచ్ అధికారులు వెంట ఉన్నారు.



రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

పాఠ్య పుస్తకాలకు పాత విధానమే!



- మళ్లీ కాగితం విడిగా కొని ముద్రించే యోచన
- వచ్చే ఏడాదికి పుస్తకాలపై సర్కారు కసరత్తు

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): పాఠ్య పుస్తకాల ముద్రణలో మళ్లీ పాత విధానాన్నే అవలంభించాలని పాఠశాల విద్యాశాఖ భావిస్తోంది. గతేడాది మార్చిన విధానం స్థానిక ప్రింటర్లను తీవ్రంగా దెబ్బతీసింది. అలాగే తమ బకాయిలు చెల్లించకుండా విధానం ఎలా మారుస్తారంటూ తమిళ నాడు న్యూస్‌ప్రింట్ లిమిటెడ్ సంస్థ (టీఎన్‌పీఎల్) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వివాదాలు విద్యార్థుల పుస్తకాలపై ప్రభావం చూపకూడదనే ఉద్దేశంతో పాత విధానంలోనే వెళ్లాలని యోచిస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే 2025-26 విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాల ముద్రణకు చర్యలు ప్రారంభించనుంది. మరోవైపు ప్రస్తుత విద్యా సంవత్సరంలో రెండో సెమిస్టర్ పుస్తకాలను పాఠశాలలకు పంపించే ప్రక్రియ మొదలుపెట్టారు.

ఏటా రాష్ట్రంలో పాఠశాలల విద్యార్థులకిచ్చే పాఠ్యపుస్తకాల కోసం టీఎన్‌పీఎల్ నుంచే కాగితం సేకరిస్తున్నారు. ప్రభుత్వం కాగితాన్ని కొనుగోలు చేసి, దాన్ని ప్రింటర్లకు ఇచ్చి పుస్తకాల ముద్రణ చేయిస్తుంది. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం టీఎన్‌పీఎల్‌కు రూ.200 కోట్లు బకాయి పడింది. గతేడాది ఈ బకాయిలు చెల్లించేందుకు డబ్బుల్లేక వైసీపీ ప్రభుత్వం ఏకంగా విధానాన్నే మార్చేసింది. ప్రింటర్లే కాగితాన్ని సమకూర్చుకుని, పుస్తకాలు ముద్రించి ఇవ్వాలనే మెలిక పెట్టింది. దీంతో కాగితం తెచ్చుకునే సామర్థ్యం తమకు లేదంటూ చాలామంది ప్రింటర్లు తప్పుకొన్నారు. దీంతో కొద్ది మంది పెద్ద ప్రింటర్ల పంట పడింది. వారే వీలైనన్ని ఎక్కువ పుస్తకాలు ముద్రించి సొమ్ము చేసుకున్నారు. మరోవైపు తమ బకాయిలు చెల్లించకుండా విధానం ఎలా మారుస్తారంటూ టీఎన్‌పీఎల్ అప్పట్లో జ్యుడీషియల్ కమిషన్‌కు లేఖ రాసింది. దీంతో చెన్నై నగరానికి ఇచ్చే తెలుగు గంగ నీళ్ల బకాయిలకు, ఈ బకాయిలను సరిపెట్టుకోవాలంటూ ఏపీ ప్రభుత్వం వింత ప్రతిపాదన చేసింది. ఈ తలనొప్పి వ్యవహారంతో విద్యార్థుల చదువులపై ప్రభావం చూపే పరిస్థితి రావడంతో పాత విధానంలోనే పుస్తకాల ముద్రణ చేపట్టాలని, కాగితం ఒకేచోట కొనుగోలు చేస్తే పుస్తకాలన్నీ ఒకే నాణ్యతతో ఉంటాయని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరానికి 4.78 కోట్ల పుస్తకాలు ముద్రించగా, అందుకు దాదాపు రూ.230 కోట్లు ఖర్చయ్యింది.

సెలవు రోజుల్లో కాలేజీల్లో చేరాలంట!

రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ తీరు
ఎంటెక్ విద్యార్థుల్లో గందరగోళం
ఇప్పటికే డిగ్రీ అడ్మిషన్లలో నిర్లక్ష్యంతో విమర్శలపాలు
విద్యార్థి మృతి చెందినా మారని వైఖరి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్యాశాఖలో రోజురోజుకూ నిర్లక్ష్య వైఖరి పెరిగిపోతోంది. విద్యార్థులకు దిశదశ చూపాల్సిన ఆ శాఖ అధికారులు అడ్మిషన్ల షెడ్యూల్ రూపకల్పనలోనే తడబాటుకు గురవుతున్నారు. డిగ్రీ అడ్మిషన్లనూ ఇలాగే గందరగోళం చేయడంతో విజయవాడలో ఓ విద్యార్థి మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా ఎంటెక్ కోర్సుల్లో చేరే విద్యార్థులు సెలవు రోజుల్లో కాలేజీల్లో రిపోర్టు చేయాలని షెడ్యూల్ ఖరారు చేయడం విమర్శలకు తావిచ్చింది. ఉన్నత విద్యామండలి ఇటీవల విడుదల చేసిన ఏపీ పీజీఈసెట్ షెడ్యూల్ ప్రకారం ఈనెల 14వ తేదీన ఎంటెక్ విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలి. లేనిపక్షంలో వారికి కేటాయించిన సీటు రద్దవుతుంది. అయితే ఈనెల 15వ తేదీ ఆదివారం, 16వ తేదీ మిలాద్ ఉన్ నబీ పండగ ఉన్నాయి. విగిలిన రోజుల్లోనే కాలేజీల్లో రిపోర్టు చేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే, ఇలా సెలవులు వచ్చినప్పుడు ప్రత్యామ్నాయంగా వేరే రోజుల్లో రిపోర్టింగ్‌కు అవకాశం ఇస్తారు. కానీ, ఉన్నత విద్యామండలి సెలవులను పట్టించుకోకుండా రిపోర్టు చేయాలంటూ ఆదేశించింది.

డిగ్రీ అడ్మిషన్లలోనూ ఇష్టారాజ్యం

డిగ్రీ అడ్మిషన్ల విషయంలోనూ ఉన్నత విద్యాశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియలో రిపోర్టు గడువును పొడిగించిన సమాచారం విద్యార్థులకు తెలపకుండా నిర్లక్ష్యం ప్రదర్శించారు. దీంతో విజయవాడలోని ముంపు ప్రాంతంలో ఉన్న విద్యార్థి అడ్మిషన్ కోసం వెళ్లి మృతి చెందాడు. ఇంత జరిగినా ఆ శాఖ అధికారులు ఇప్పటికీ స్పందించలేదు. భారీ వర్షాలు, వరద ముప్పు పొంచి ఉన్నప్పటికీ రిపోర్టింగ్ సమయంపై స్పష్టత ఇవ్వలేదు. ఆ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహన్‌రావు తీరుతో ఆ శాఖకే చెడ్డపేరు వచ్చే దుస్థితి ఏర్పడింది.



ప్రసన్నకుమార్‌కు నాయుడమ్మ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న మంత్రి మనోహర్

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త నాయుడమ్మ: మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10: దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త నాయుడమ్మ అని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో చర్మ పరిశోధన శాస్త్రవేత్త దివంగత యలవర్తి నాయుడమ్మ స్మారక పురస్కారాన్ని నేషనల్ లిగ్నేట్ కార్పొరేషన్ సీఎండీ మోటుపల్లి ప్రసన్నకుమార్‌కు మంగళవారం ప్రదానం చేశారు. నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ, ఏపీ ని గ్రీన్ హైడ్రోజన్ రాష్ట్రంగా మార్చేందుకు సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని సౌర విద్యుత్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. పురస్కార గ్రహీత ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ వేసిన పునాది కారణంగా సౌర విద్యుత్ 1.50 లక్షల మెగా వాట్ల ఉత్పత్తికి చేరుకుందని, దానిని 2030 నాటికి 1.50 లక్షల గిగా వాట్ల ఉత్పత్తికి పెంచే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. చెన్నై సీఎల్ఆర్ఐ శాస్త్రవేత్త స్వర్ణ వి కాంత్ మాట్లాడుతూ, దేశంలో చర్మ పరిశోధన సంస్థ సాధిస్తున్న అభివృద్ధి వెనుక నాయుడమ్మ కృషి, ప్రోత్సాహం ఎంతగానో ఉందన్నారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, పవన్‌కుమార్ ప్రసంగించారు.

అగ్రి కోర్సుల దరఖాస్తుల గడువు పెంపు

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎమ్మెస్సీ, ఎంటెక్, పీహెచ్‌డీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల గడువును వచ్చే నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ రామచంద్రరావు తెలిపారు. దరఖాస్తుని వచ్చే నెల 15వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

ఐదేళ్లలో 5 వేల మంది సైబర్ కమాండోలు: షా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: సైబర్ సెక్యూరిటీ లేకుండా దేశ పురోగతి సాధ్యం కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, దీనికోసం వచ్చే ఐదేళ్లలో 5 వేల మంది సైబర్ కమాండోలకు శిక్షణ ఇచ్చి సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. మంగళవారం జరిగిన ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ తొలి వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో అమిత్ షా పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సైబర్ ఫ్రాడ్ మిటిగేషన్ సెంటర్ (సీఎఫ్ఎంసీ)ను ప్రారంభించిన ఆయన దాన్ని జాతికి అంకితం చేశారు.

వరంగల్ నుంచి మణిపూర్‌కు బలగాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: మణిపూర్‌కు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అదనంగా 2 వేల సీఆర్పీఎఫ్ బలగాలను తరలించింది. ప్రస్తుతం తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న 58వ బెటాలియన్, ఝార్ఖండ్‌లోని 112 బెటాలియన్ నుంచి వీరిని తరలిస్తున్నట్లు సీఆర్పీఎఫ్ అధికారులు వెల్లడించారు. కొత్తగా పంపే బలగాలు ఇంఫాల్ పరిసరాల్లో మోహరిస్తాయని వివరించారు. మణిపూర్ నుంచి అస్సాం రైఫిల్స్‌ను ఉపసంహరించుకుని, జమ్మూకశ్మీర్‌కు తరలించాలని నిర్ణయించామని, ఈ నేపథ్యంలోనే 2వేల మంది సీఆర్పీఎఫ్ జవాన్లను మణిపూర్‌కు తరలిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 16 బెటాలియన్ల బలగాలు మణిపూర్‌లో ఉన్నట్లు గుర్తుచేశారు. మణిపూర్‌లో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవలి హింసాత్మక ఘటనలకు నిరసనగా మంగళవారం విద్యార్థులు రాజ్‌భవన్‌కు ర్యాలీ తీయడంతో భద్రతాబలగాలు అడ్డుకున్నాయి. ఈ ఘర్షణలో 40 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఈ విషయం తెలియగానే.. విద్యార్థులు ఒక్కసారిగా రోడ్లపైకి నిరసనకు దిగారు.

పసికందు@ రూ.1.9 లక్షలు

- బిడ్డను కోల్పోయిన స్నేహితురాలి కోసం కొనుగోలు
- అప్పటికే 9 మంది సంతానంతో పసికందును విక్రయించిన తండ్రి

గుంటూరు, సెప్టెంబరు 10: సినీఫక్కీలో జరిగిన ఓ శిశువు కొనుగోలు వ్యవహారం గుంటూరు జీజీహెచ్‌లో కలకలం రేపింది. నిందిత మహిళ ఒప్పుకోలుతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. ఈ ఘటనపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసుల కథనం మేరకు.. భట్టిప్రోలుకు చెందిన మీరాభి అనే గర్భిణి కొన్ని వారాల క్రితం జీజీహెచ్‌లో చేరింది. గత నెలాఖరున ఆమె ప్రసవించగా, శిశువు కన్ను మూసింది. దీంతో మానసిక వేదనతో మీరాభి ఆరోగ్యం క్షీణించింది. జీజీహెచ్‌లోనే చికిత్స పొందుతున్న మీరాభిని చూసుకునేందుకు భట్టిప్రోలుకు చెందిన ఆమె స్నేహితురాలు ప్రభావతి.. మీరాభి ప్రసవానికి ముందు నుంచే తోడుగా ఉంటుంది. బిడ్డను కోల్పోయిన మీరాభి బాధను ప్రభావతి చూడలేకపోయింది. అదే సమయంలో చిన్నగంజాంకు చెందిన మానికల సుబ్రహ్మణ్యం భార్య లక్ష్మి అనే గర్భిణి జీజీహెచ్‌లో చేరింది. ప్రసవంలో ఆడ శిశువుకు జన్మనిచ్చిన తర్వాత లక్ష్మి కన్నుమూసింది. సుబ్రహ్మణ్యంకు అప్పటికే 9 మంది సంతానం ఉన్నారు. సుబ్రహ్మణ్యం భార్య చనిపోవడం, కొత్తగా పుట్టిన శిశువును పెంచడం వాళ్లకు ఇబ్బందిగా ఉంటుందని భావించిన ప్రభావతి.. ఈ నెల 7న చిన్నగంజాం వెళ్లి సుబ్రహ్మణ్యాన్ని సంప్రదించి వారి శిశువును రూ.లక్షా 90 వేలకు కొనుగోలు చేసింది. అనంతరం శిశువును మీరాభికి ఇచ్చింది. అయితే మీరాభికి పుట్టిన శిశువు చనిపోవడంతో మరో శిశువును తీసుకురావడంపై అనుమానం వచ్చిన ఆసుపత్రి సిబ్బంది ప్రభావతిని నిలదీశారు. దీంతో ఆ శిశువును కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు ఆమె ఒప్పుకొంది. సిబ్బంది విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించిన ఆసుపత్రి వర్గాలు శిశువు కొనుగోలు వాస్తవమేనని గుర్తించారు. ఆసుపత్రి ఆర్ఎం ఫిర్యాదు మేరకు కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శిశువు కొనుగోలు జరిగిన చిన్నగంజాంకు కేసును బదిలీ చేయనున్నారు.

డివైడర్ ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు

- 20 మందికి గాయాలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 11 : హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం జిల్లా పాతపట్నం వెళుతున్న ఒక ప్రైవేటు ట్రావెల్ బస్ మార్గ మధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. శ్రీ సాయి బాలాజీ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఏలూరు ఆశ్రం ఆస్పత్రి సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై డివైడర్‌ను మంగళవారం అర్ధరాత్రి ఢీకొంది. ఈ ప్రమాదంలో 20 మందికి పైగా గాయాలయ్యాయి. హైవే పెట్రోల్ పోలీసులు, 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను ఆశ్రం ఆస్పత్రికి, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో శ్రీకాకుళం, ఒడిశావాసులు ఎక్కువగా ఉన్నారు.

సర్వీస్ కోటాకు తూట్లు!

- వైసీపీ ప్రభుత్వ హయాంలో కోటా కుదింపు
- కొత్త ప్రభుత్వంలో అమలు చేసిన అధికారులు
- క్లినికల్ పీజీ సీట్లు 15 శాతానికి తగ్గింపు
- జీవో 85 రద్దు చేయాలని వైద్యుల నిరసన

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆరోగ్య శాఖలో సర్వీస్ కోటాపై రచ్చ నడుస్తోంది. గతంలో మాదిరిగానే సర్వీస్ కోటా అమలుచేయాలని పీహెచ్‌సీ వైద్యులు కోరుతుంటే.. ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం జీవో 85నే అమలు చేస్తామని గట్టిగా పట్టుబడుతున్నారు. వైద్యులంతా జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నెల రోజుల నుంచి ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. కానీ ఫలితం లేకపోవడంతో చివరికి సమ్మెకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులంతా నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసనను కొనసాగిస్తున్నారు.

కుదింపు నిర్ణయం జగన్ సర్కారుదే..

గతేడాది వరకూ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే వైద్యులకు మూడేళ్ల తర్వాత సర్వీస్ కోటాలో మెడికల్ పీజీ చేసేందుకు అవకాశం ఉంది. రాష్ట్రంలోని మెడికల్ పీజీ సీట్లల్లో 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్ క్లినికల్ సీట్లను సర్వీస్ కోటా వైద్యులకు కేటాయించేవారు. సర్వీస్ కోటా వైద్యులకు ఏ స్పెషాలిటీలోనైనా పీజీ సీటు తీసుకునే వెసులుబాటు ఉండేది. ఇలాంటి సమయంలో వైసీపీ ప్రభుత్వం ఆరోగ్య శాఖలో జీరో వెయికెన్సీ పాలసీని తీసుకొచ్చింది. కానీ.. నాలుగేళ్ల పాటు ఎంత ప్రయత్నించినా ఖాళీలను పూర్తిగా భర్తీ చేయలేకపోయింది. ఈ సర్వీస్ కోటా అమలు చేయడం వల్లే ప్రతి ఏటా దాదాపు 200కిపైగా ఖాళీలు ఏర్పడుతున్నాయన్న ఉద్దేశంతో ఈ కోటాను కుదించాలని అప్పటి జగన్ సర్కారు నిర్ణయించింది. ఈలోగా ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సాధారణంగా ఎప్పుడైనా ప్రభుత్వం మారినప్పుడు పాత సర్కారు నిర్ణయాలపై ఒకసారి సమీక్ష చేస్తారు. అయితే ఈ సర్వీస్ కోటా కుదింపుపై కొత్త ప్రభుత్వానికి సమీక్ష చేసే అవకాశం కూడా ఇవ్వకుండా పర్సంటేజ్ తగ్గిస్తేనే మంచిదని చెప్పి క్లినికల్ విభాగంలో 30 శాతంగా ఉన్న సీట్లను 15 శాతానికి కుదించారు. ఈ ప్రక్రియలో ఎక్కడా క్షేత్ర స్థాయి అభిప్రాయాలు కానీ, వైద్యుల సూచనలు కానీ తీసుకోలేదు. పైగా 15 శాతం సీట్లను కూడా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, అనస్థీషియా విభాగాల్లో మాత్రమే తీసుకోవాలని నిబంధన పెట్టారు. ఒకవైపు క్లినికల్ సీట్లు తగ్గడం, మరోవైపు ఐదు స్పెషాలిటీలకే పరిమితం చేయడంపై వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవో 85ను రద్దు చేయాలని నిరసన బాట పట్టారు.

గ్రామాల్లో స్పెషాలిటీ సేవలు అవసరం...

ఒకవైపు కేంద్ర ప్రభుత్వం స్పెషాలిటీ వైద్య సేవలను గ్రామ స్థాయికి తీసుకువెళ్లాలని చెబుతోంది. మన రాష్ట్రంలో ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా గ్రామీణ ప్రాంతాల పీహెచ్‌సీల్లో కేవలం ఎంబీబీఎస్ వైద్యులుంటే సరిపోతుందున్న భావనలో ఉన్నారు. సర్వీస్ కోటా అమలు వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయి. కానీ ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం చాలా మంది సర్వీస్ కోటా వైద్యులు పీజీ పూర్తయిన తర్వాత బయటకు వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. 2017 నుంచి ఇప్పటి వరకూ దాదాపు రెండు వేల మంది వైద్యులు సర్వీస్ కోటాలో పీజీ పూర్తి చేశారు. వీరంతా పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు లేదా లేటరల్ ఎంట్రీ ద్వారా డీఎంఈలో స్పెషాలిటీ సేవలు అందిస్తున్నారు. రెండు వేల మందిలో 35 మంది మాత్రమే సర్వీస్ కోటాలో పీజీ పూర్తి చేసుకుని బయటకు వెళ్లిపోయారు. దీన్ని చూపించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్పెషాలిటీ సేవలు దూరం చేయడం సరికాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు సర్వీస్ కోటాలో పీజీ పూర్తి చేసుకుని, అనంతరం బయటకు వెళ్లిపోయిన వైద్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కానీ, ఆరోగ్యశాఖ అధికారులు ఇవన్నీ మానేసి, సర్వీస్ కోటాను పూర్తిగా ఎత్తేయాలన్న ఆలోచనలో ఉన్నారు.

ఇతర రాష్ట్రాల్లో అమలు..

ప్రభుత్వ వైద్యులకు సర్వీస్ కోటా స్పెషాలిటీ చేయించి, వారి సేవల్ని గ్రామాల్లో ఉపయోగించుకోవాలని మిగిలిన రాష్ట్రాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ 50 శాతం సీట్లను సర్వీస్ కోటా వైద్యులకు కేటాయిస్తుంది. తెలంగాణ, తమిళనాడు కూడా సర్వీస్ కోటా వైద్యులకు 30 శాతం సీట్లు కేటాయించాయి. హరియాణాతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా సర్వీస్ కోటాకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే సర్వీస్ కోటాను ఆంధ్రప్రదేశ్‌లో ఎత్తేసేందుకు ఆరోగ్యశాఖ అధికారులు ప్లాన్ చేస్తున్నారు. 2027నాటికి డీఎంఈ ఆస్పత్రుల్లో ఎంత మంది స్పెషాలిటీ వైద్యులు రిటైర్ అవుతారో అంత మందికే సర్వీస్ కోటా అవకాశం కల్పించేలా ప్లాన్లు వేస్తున్నారు.

గోల్డ్ స్మగ్లర్ మునియద్ భారత్‌కు అప్పగింత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: అంతర్జాతీయ బంగారం స్మగ్లింగ్ ముఠాకు చెందిన కీలక నిందితుడు మునియాద్ అలీఖాన్‌ను సీబీఐ భారత్‌కు రప్పించింది. రెడ్ కార్నర్ నోటీసుల ఆధారంగా అతణ్ని దుబాయ్‌లో అరెస్టు చేసిన ఇంటర్‌పోల్ మంగళవారం భారత్‌కు అప్పగించింది. సౌదీ అరేబియా నుంచి కోట్ల విలువైన బంగారాన్ని భారత్‌కు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఎన్ఐఏ మార్చి, 2021లోనే ఖాన్‌పై అభియోగాలు మోపింది. అప్పట్నుంచి అతను మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. అదే ఏడాది సెప్టెంబరులో ఇంటర్‌పోల్ అతనిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో యూఏఈలో అలీఖాన్ ఆచూకీని కనిపెట్టిన ఇంటర్‌పోల్ అతణ్ని అరెస్టు చేసి భారత్‌కు అప్పగించింది.

గాజాపై ఇజ్రాయెల్ దాడిలో 40 మంది మృతి

దెయిర్ అల్- బలాహ్, సెప్టెంబరు 10: గాజాలోని మానవతా జోన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేయడంతో 40 మంది మృతి చెందగా, 60 మందికి పైగా గాయపడ్డారని గాజా సివిల్ డిఫెన్స్ పేర్కొంది. సురక్షిత జోన్‌గా పరిగణించే దక్షిణ గాజా నగరం ఖాన్ యూనిస్ శివారులోని మువాసీ ప్రాంతంపై మంగళవారం ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపిందని గాజా సివిల్ డిఫెన్స్ అధికారి ఒకరు తెలిపారు. అయితే ఈ దాడి తాము చేయలేదని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంటోంది. కాగా, యుద్ధానికి ముందు గాజాలోని ఖాన్ యూనుస్‌లోని ఆల్ మువాసీ ప్రాంతాన్ని ఇజ్రాయెల్ సైన్యం సురక్షిత జోన్‌గా ప్రకటించింది. దాంతో దాదాపు 10వేల మందికిపైగా పాలస్తీనియన్లు అక్కడ ఆశ్రయం పొందుతున్నారు.

'రవాణా'లో పదోన్నతులు, పోస్టింగుల రచ్చ

- హెచ్ఓడీ ప్రతిపాదనల్లేకుండా 11మందికి పదోన్నతితో బదిలీ
- 'ముందుగా మాట్లాడుకున్న వారికే' అందలం
- భారీగా ముడుపులు చేతులు మారినట్లు విమర్శలు
- గూడూరు, గుడివాడ ఆర్టీవో పోస్టింగుల తీరూ ఇంతే..

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'రాష్ట్రంలోని కీలకమైన రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ కేసున్న ఉద్యోగికి ఆర్టీవో పోస్టింగ్!.. ఒక్కరే అనవసరం అనుకొంటున్న అతిచిన్న జిల్లాలో ఏకంగా ఇద్దరు ఆర్టీవోలు! ఏ ఆఫీసులో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారో ఆయనకు ప్రమోషన్ ఇచ్చి అక్కడే ఆర్టీవోగా అవకాశం... కాకపోతే 'ముందుగా వచ్చి మాట్లాడుకొన్నారు!!.. నాలుగు రోజుల క్రితం జరిగిన ఆర్టీవోల బదిలీలపై ఇలా పలు ఆరోపణలు వస్తున్నాయి. హెచ్‌వోడీ ప్రతిపాదనలతో సంబంధం లేకుండా అడ్డగోలుగా పదోన్నతులు, బదిలీలు, పోస్టింగ్స్ ఇచ్చి భారీగా సొమ్ము చేసుకున్నట్లు బహిరంగ వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూర్చే శాఖల్లో రవాణా శాఖ కూడా కీలకమైంది. ఈ శాఖలో అధికారుల బదిలీలు, పోస్టింగ్స్ అంటే లక్షల్లో చేతులు మారుతుంటాయి. అలాంటిది పదోన్నతులిచ్చి మరీ పోస్టింగ్స్ అంటే ఇంకేముంది.. అందరూ ఊహించిందే జరుగుతోంది!! రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు అనుమతిచ్చింది. ఇదే అవకాశంగా ఎంవీఐలు పోస్టింగ్స్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఐదేళ్ల నిబంధన కాదని రెండేళ్లకే బదిలీ చేసేలా ఏకంగా జీవో తెచ్చుకున్నారు. లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం అందడంతో ఈ వివాదం తనకెందుకు అన్నట్లు రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా.. ప్రభుత్వ నిబంధనలే పాటిద్దామనే నిర్ణయం తీసుకున్నారు. దీంతో రవాణా శాఖలో బదిలీలు ఆగిపోయాయనుకున్నారు. కానీ తెరవెనుక జరగాల్సిందంతా జరిగిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో కీలకమైన ఆర్టీవో కార్యాలయాల్లో ఒకటైన గూడూరులో సిబ్బంది, అధికారులకు కూడా ఆదాయం ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ అవినీతి కేసులున్న అధికారిని ఆర్టీవోగా నియమించడం వెనుక భారీగా డబ్బు చేతులు మారినట్లు తెలుస్తోంది. రాష్ట్ర నడిబొడ్డున విజయవాడ తర్వాత గుడివాడలోనిదే పెద్ద ఆర్టీవో కార్యాలయం. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న వ్యక్తికి ఆర్టీవోగా పదోన్నతి కల్పించి అక్కడే పోస్టింగ్ ఇవ్వడం పట్ల సిబ్బంది విస్తుపోతున్నారు. గత ప్రభుత్వంలో నేతలతో మంచి సంబంధాలు నెరిపిన ఆయన ఇక్కడే ఉంటా అంటూ 'ముందుగా మాట్లాడుకోవడంతో' గుడివాడలోనే పోస్టింగ్ వచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఆర్టీవో పోస్టు అవసరం లేదని ఎప్పటి నుంచో ఉన్న ప్రతిపాదన. తాజాగా అక్కడ ఇద్దరు ఆర్టీవోలను నియమించడం పట్ల ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఈ జిల్లాలోని పాలకొండ, పార్వతీపురంలలో రెండో ఆర్టీవో పోస్టులు కేటాయించడం గమనార్హం. ఒక ఆర్టీవో పరిధిలో కనీసం 4 లక్షల వాహనాలు ఉండాలనే నిబంధన పెట్టుకున్న రవాణా శాఖ కేవలం 1.20లక్షలున్న మన్యం జిల్లాలో ఆర్టీవోలను ఎందుకు నియమించిందనే ప్రశ్నకు సమాధానంలేదు. ముందుగా మాట్లాడుకుని సంతృప్తి పరిచిన వ్యక్తుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. పదోన్నతి, పోస్టింగ్ కోసం రూ.లక్షలు ముడుపులుగా చెల్లించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

రవాణా శాఖ హెచ్‌వోడీ ప్రతిపాదనల్లేకుండా జరిగిన ఆర్టీవోల బదిలీలు ఇలా..

టీఎస్‌కే కిశోర్(పోస్టింగ్. గూడూరు), బి.సత్యనారాయణప్రసాద్(గుంటూరు), జి.విమల (విజయనగరం), కె. మురళీమోహన్ (తిరుపతి), జి.సంజీవ్ కుమార్ (ప్రమోషన్ ఇచ్చి వెయిటింగ్‌లో పెట్టారు), డి.శ్రీనివాసరావు(గుడివాడ), టి.వి.ఎస్.లక్ష్మి (కందుకూరు), జె. శ్రీనివాసులు(కదిరి), ఎన్.రమేష్(నర్సీపట్నం), టి. దుర్గాప్రసాద్ రెడ్డి (మన్యం), యు. జాన్‌పాల్ (పాలకొండ).



గంగాధర్ నుంచి తుపాకీ లాక్కుంటున్న ఎంపీటీసీ కుటుంబ సభ్యులు

నాటు తుపాకీతో హల్‌చల్

- కేసులో రాజీకి రావాలంటూ బెదిరింపులు
- చితకబాది పోలీసులకు అప్పగించిన బాధితులు

రామగిరి, సెప్టెంబరు 10: శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం సుద్దకుంటపల్లిలో గంగాధర్ అనే వ్యక్తి నాటు తుపాకీతో హల్‌చల్ చేశాడు. తనపై నమోదైన కేసులో రాజీకి రావాలంటూ ప్రత్యర్థులను బెదిరించాడు. గంగాధర్ తనను లైంగికంగా వేధిస్తున్నాడంటూ సుద్దకుంటపల్లికి చెందిన ఎంపీటీసీ సాయిలీల ఈ ఏడాది మార్చిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో రాజీకి రావాలంటూ మంగళవారం ఎంపీటీసీ భర్తను, బంధువులను గంగాధర్ నాటు తుపాకీతో బెదిరించాడు. దీంతో ఎంపీటీసీ భర్త కేశవ, కుటుంబ సభ్యులు గంగాధర్‌పై దాడి చేసి, కర్రలతో చితకబాది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ తుపాకీని స్వాధీనం చేసుకుని, గంగాధర్‌ను ఎస్పీ కార్యాలయానికి తరలించారు. గంగాధర్ గతంలో వైసీపీలో ఉండేవాడు. ఎన్నికల సమయంలో టీడీపీలో చేరాడు. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి.

బాలికపై చిన్నాన్న అఘాయిత్యం

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 10: మద్యం మత్తులో కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ వ్యక్తి కూతురు వరుసైన బాలికపై లైంగికదాడి చేశాడు. చిన్నారి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చేలోగా నిందితుడు పరారయ్యాడు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం మన్నేటికోట గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై అంకమ్మ, స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో ఉంటూ వినాయక చవితి సందర్భంగా స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం పూటుగా మద్యం సేవించిన అతను వరుసకు అన్న కూతురైన 9 ఏళ్ల బాలికకు తినుబండారాల ఆశ చూపి ఇంట్లోకి తీసుకెళ్లాడు. లైంగికదాడి చేయడంతో భయభ్రాంతులకు గురైన బాలిక గట్టిగా కేకలు వేసింది. దీంతో తల్లిదండ్రులతోపాటు స్థానికులు అక్కడకు వచ్చేలోగా నిందితుడు పరారయ్యాడు. చిన్నారి తల్లిదండ్రులు అదేరోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. నిందుతుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వరరావు, సర్పంచ్ పులివర్తి బసవయ్య మంగళవారం సాయంత్రం బాధితురాలి ఇంటికి వెళ్లి చిన్నారిని పరామర్శించి తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హరియాణాలో వినేశ్ వర్సెస్ యోగేశ్

జులానా, సెప్టెంబరు 10: రానున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ మంగళవారం 21 మంది అభ్యర్థులతో తన రెండో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో 'జులానా' నియోజకవర్గం నుంచి బీజేపీ యూత్ లీడర్ కెప్టెన్ యోగేశ్ బైరాగీ బరిలో నిలవనున్నట్లు పేర్కొంది. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ పోటీ చేస్తుండగా.. బీజేపీ తరఫున యోగేశ్ బరిలో దిగారు. యోగేశ్ భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా, బీజేపీ స్పోర్ట్స్ సెల్ హరియాణా విభాగానికి కో కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. హరియాణాలో మొత్తం 90 నియోజకవర్గాలు ఉండగా బీజేపీ ఇప్పటికే 67 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

తుంగభద్ర క్రస్ట్ గేట్ల కాలం తీరింది!

- మరమ్మతులతో కాలయాపన వద్దు: నిపుణులు
- అత్యాధునిక డిజైన్‌తో కొత్తవి ఏర్పాటుచేయాలి
- స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్‌పై అధ్యయనం అవసరం
- నిపుణుల కమిటీ ప్రాథమిక అంచనా
- 1,632 అడుగుల వరకే నీటి నిల్వకు సూచన
- 3 రోజుల్లో బోర్డుకు సమగ్ర నివేదిక



కర్నూలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లు జీవిత కాలం తీరిపోయిందని, మరమ్మతులతో కాలయాపన చేయడం ఇక మంచిది కాదని నిపుణుల బృందం అభిప్రాయపడింది. మరో క్రస్ట్‌గేటు కొట్టుకుపోదన్న గ్యారెంటీ ఇవ్వలేమని.. అత్యాధునిక డిజైన్‌తో మొత్తం 33 గేట్లూ కొత్తగా ఏర్పాటు చేయడమే అంతిమ పరిష్కారమని స్పష్టం చేసింది. ఏకే బజాజ్ నేతృత్వంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నియమించిన నిపుణుల కమిటీ మంగళవారం తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు కార్యదర్శి ఓ.రామకృష్ణారెడ్డి, ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డిలకు ప్రాథమిక నివేదిక అందజేసింది. డ్యాం గేట్ల అధ్యయనంలో గుర్తించిన అంశాలతో సమగ్ర నివేదికను మూడ్రోజుల్లో అందజేస్తామని కమిటీ చైర్మన్ బజాజ్ బోర్డు చెప్పారు. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు 70 ఏళ్లుగా సాగు, తాగు నీరు అందిస్తున్న ఈ డ్యాంలో వరద ఉధృతికి ఇటీవల 19వ గేటు కొట్టుకుపోవడంతో డ్యాం భద్రతపై సందేహాలు తలెత్తాయి. బోర్డు సూచన మేరకు కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ ఏకే బజాజ్ ఆధ్వర్యంలో ఎన్‌డీఎస్‌ఏ ఓ కమిటీని వేసింది. ఇందులో హైడ్రో-మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ సేఫ్టీ నిపుణుడు హర్కేశ్‌కుమార్ (ఢిల్లీ), తారాపురం సుధాకర్ (ఆదోని), ఆంధ్రప్రదేశ్ సీడీవో సీఈ నాగరాజు, తెలంగాణ సీడీవో ఈఈ బాలమురళీకృష్ణ, డ్యాం సేఫ్టీ రిటైర్డ్ ఎస్ఈ సుధాకర్, కర్ణాటక సాంకేతిక సలహా కమిటీ మాజీ కార్యదర్శి సిద్ధరంగప్ప సభ్యులుగా ఉన్నారు. వీరు సోమ, మంగళవారాల్లో డ్యాంతో పాటు క్రస్ట్‌గేట్లను తనిఖీ చేశారు. 33 క్రస్ట్‌గేట్ల జీవితకాలం తీరడంతో కొత్తవి ఏర్పాటు చేయాలని కమిటీ ప్రధానంగా అభిప్రాయపడింది. 'గేట్ల నిర్వహణలో కీలకమైన హాయిస్ట్ మెకానిజం, రోప్స్ లేటెస్ట్ డిజైన్‌తో ఏర్పాటుపై నిపుణులతో అధ్యయనం చేయించాలి. జలాశయం పటిష్ఠతపైనా పూర్తిస్థాయిలో స్టడీ చేయించాలి. గతంలో 1,632 అడుగుల వరకు నీటిని నిల్వ చేసేవారు. ఇప్పుడు 1,633 అడుగుల వరకు నిల్వ చేస్తుండడంతో గేట్లపై ఒత్తిడి పెరుగుతోంది. తిరిగి 1,632 అడుగుల వరకే నిల్వ చేయాలి. గేట్లు కనీసం 2.5 అడుగులు ఎత్తి నీటిని వదలాలి. ఒక అడుగు, అర అడుగు ఎత్తడం వల్ల నీటి ప్రవాహ వేగం, ఒత్తిడికి గేట్ల దిగువన డ్యాం బయటి వైపు గుంతలు పడి డ్యాం పునాదులకే ముప్పు ఏర్పడుతుంది' అని ప్రాథమిక నివేదికలో హెచ్చరించింది.

SCHOLARSHIP ALERT

Santoor Scholarship Programme 2024-25

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.

Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.

Applicants must have:

- passed Class 10 from a local government school.
- passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And
- enrolled in a full-time graduate programme starting in 2024-25.

Note: The full-time graduate course must have a minimum duration of 3 years.

- Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply.
- Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum
Last Date to Apply: 23-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SWS7

Aspire Scholarship Program

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

- Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.
Last Date to Apply: 20-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ASPI2

Kotak Kanya Scholarship

Description: Under the CSR Project on Education & Livelihood of Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for the Kotak Kanya Scholarship 2024-25 from meritorious girl students from low-income families to empower them to pursue higher studies in professional education after Class 12.

Eligibility: Open for meritorious girl students across India.

- Applicants must have scored 75% or more marks or equivalent CGPA in Class 12 board examinations.
- Applicant's annual family income must be less than INR 6,00,000.
- Meritorious girl students who have secured admission to the first year of graduation programs in the academic year 2024-25 in institutes of repute like NIRF/NAAC accredited for professional graduation degrees like Engineering, MBBS, BDS, Integrated LLB (5 Years), B.Sc. Nursing, B. Pharmacy, Integrated BS-MS/BS-Research in ISER, IISC (Bangalore), or other professional courses (Design, Architecture, etc.).

Prizes & Rewards: INR 1.5 lakh* per year
*Disclaimer: The renewal of the scholarship every year will be at the sole discretion of the Kotak Education Foundation
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/KKGS3

buddy4study.com



హరిద్వార్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తోంది. వీటిని ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్ కోసం ఉద్దేశించారు. ఇవి జాబ్ ఓరియంటెడ్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు. ఎలక్ట్రానిక్స్, ఐటీ విభాగాల్లో స్కిల్స్ మెరుగుపరచుకొనేందుకు దోహదం చేస్తాయి. కోర్సుల వ్యవధి నిర్దేశించిన మేరకు నాలుగు నుంచి పది వారాల వరకు ఉంటుంది. ఆరు వారాల ప్రోగ్రామ్‌లో నాలుగు వారాల ట్రెయినింగ్, రెండు వారాల ప్రాజెక్ట్ వర్క్; పది వారాల ప్రోగ్రామ్‌లో ఎనిమిది వారాల ట్రెయినింగ్, రెండు వారాల ప్రాజెక్ట్ ఉంటాయి. ప్రాజెక్ట్ వర్క్‌కు ఫీజు చెల్లించనవసరం లేదు.

● వెబ్‌సైట్: nielit.gov.in

నీలిట్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

ఆటోక్యాడ్ ఎలక్ట్రికల్: కోర్సు వ్యవధి నాలుగు వారాలు. అక్టోబరు 8 నుంచి ఆన్‌లైన్ సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్ర రెండున్నర నుంచి నాలుగు గంటల వరకు తరగతులు ఉంటాయి.

- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 7

ఇండస్ట్రియల్ ఆటోమేషన్-పీఎస్‌సీ/స్కాడా: కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు. సెప్టెంబరు 17 నుంచి ఆన్‌లైన్ సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం నాలుగున్నర నుంచి ఆరు గంటల వరకు తరగతులు ఉంటాయి.

- **కోర్సు ఫీజు:** రూ.5,664
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 16

డేటా అనలిటిక్స్-పైథాన్: కోర్సు వ్యవధి ఆరు వారాలు. నవంబరు 12 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదకొండు గంటల వరకు తరగతులు ఉంటాయి.

- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 11

మెషిన్ లెర్నింగ్-పైథాన్: కోర్సు వ్యవధి ఆరు వారాలు. అక్టోబరు 15 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం నాలుగున్నర నుంచి ఆరు గంటల వరకు తరగతులు ఉంటాయి.

- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 14

వెబ్ డిజైనింగ్: కోర్సు వ్యవధి ఆరు వారాలు. అక్టోబరు 22 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి అయిదున్నర వరకు తరగతులు ఉంటాయి.

- **కోర్సు ఫీజు:** 2360
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 21

క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్: ఒక్కో కోర్సు వ్యవధి ఆరు వారాలు. సెప్టెంబరు 24 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం పదకొండున్నర నుంచి ఒంటిగంట వరకు తరగతులు ఉంటాయి.

- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 23

ఫైనాన్షియల్ అకౌంటింగ్-ట్యాలీ: కోర్సు వ్యవధి నాలుగు వారాలు. నవంబరు 12 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల నుంచి మూడున్నర వరకు తరగతులు ఉంటాయి.

- **కోర్సు ఫీజు:** రూ.2360
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 11

సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్: కోర్సు వ్యవధి నాలుగు వారాలు. సెప్టెంబరు 17 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం రెండున్నర నుంచి నాలుగు గంటల వరకు తరగతులు ఉంటాయి.

- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 16

డేటా అనలిటిక్స్-అడ్వాన్స్‌డ్ ఎక్సెల్: కోర్సు వ్యవధి ఆరు వారాలు. నవంబరు 12 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదకొండు గంటల వరకు తరగతులు ఉంటాయి.

- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 11

కోర్స్ ఆన్ కంప్యూటర్ కాన్సెప్ట్స్: కోర్సు వ్యవధి 90 గంటలు. సెప్టెంబరు 30 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం నాలుగున్నర నుంచి ఆరు గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.4956
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30

లాంగ్ టర్మ్ ప్రోగ్రామ్‌లు

- 'ఒ' లెవెల్ ప్రోగ్రామ్ వ్యవధి 540 గంటలు. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు సెషన్స్ ఉంటాయి.
- 'ఎ' లెవెల్ ప్రోగ్రామ్ వ్యవధి 1620 గంటలు. ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల నుంచి ఆరు గంటల వరకు సెషన్స్ ఉంటాయి.
- 'బి' లెవెల్ ప్రోగ్రామ్ వ్యవధి 2520 గంటలు. ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల నుంచి ఆరు గంటల వరకు సెషన్స్ ఉంటాయి.
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** సెప్టెంబరు 15 నుంచి

నిమ్స్‌లో సర్టిఫికెట్ కోర్సు

హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- నెఫ్రాలజీ విభాగంలో నిర్వహిస్తున్న 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ ప్రోగ్రామ్'లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(నర్సింగ్/సైకాలజీ/లైఫ్ సైన్సెస్/డయాలసిస్ టెక్నాలజీ)/ఎంబీబీఎస్/ఎండీ-హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ఎంట్రెన్స్ టెస్ట్: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో బేసిక్ కాన్సెప్ట్స్, అడ్వాన్స్‌డ్ మిసిలేనియస్ టాపిక్స్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్, హార్ట్ అండ్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ అంశాల నుంచి ఒక్కోదానిలో పది మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 50. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్- 500082
- **వెబ్‌సైట్:** www.nims.edu.in





(నిన్నటి దిక్సూచి తరువాయి)

6జీ సాంకేతికత దిశగా భారత్ ప్రయత్నాలు

2030 నాటికి భారతదేశంలో 6జీ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి 2023లో ఒక 'విజన్ డాక్యుమెంట్'ను విడుదల చేసి, పరిశోధన, కార్యాచరణ నిమిత్తం 'భారత్ 6జీ మిషన్'ను రెండు దశల కార్యక్రమంగా అమలులోకి తెచ్చారు.

1) భారత్ 6జీ విజన్: 6జీ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్‌ను ముందువరుసలో నిలబెట్టడం; 6జీ టెక్నాలజీపరమైన సాంకేతిక సమస్యల పరిష్కారం, ఈ టెక్నాలజీ ప్రముఖ సరఫరాదారుగా భారత్‌ను తీర్చిదిద్దడం, మేధోసంపత్తిపరంగా, అధిక నాణ్యతపరంగా భారత్ 6జీ రంగంలో విశేష కృషి జరపడం ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యాలు. వీటి సాధనకు 6జీ విజన్ ఆరు ప్రధాన మూల స్తంభాలను నిర్దేశించింది. వాటిలో ఒక్కోదానికి ఒక్కో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది.

6జీ విజన్‌లోని '6' మూలస్తంభాలు

1. బహుళ ప్లాట్‌ఫాం నెక్స్ట్ జనరేషన్ నెట్‌వర్క్‌లు.
2. మల్టీ-డిసిప్లినరీ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్
3. 6జీ స్పెక్ట్రమ్ గుర్తింపు
4. 6జీ పరికరాలు, వ్యవస్థలు
5. అంతర్జాతీయ ప్రమాణాల సాధన
6. పరిశోధన, అభివృద్ధి నిధులు

2) భారత్ 6జీ మిషన్: 2030 నాటికి భారత్‌లో 6జీ సేవలు ప్రవేశపెట్టేవిధంగా రెండు దశల్లో ఈ మిషన్‌ను అమలుచేయనున్నారు.

తొలిదశ(2023-2025): ఈ మిషన్ తొలిదశ రెండు సంవత్సరాల్లో వినూత్న ఆలోచనలు, సవాళ్లతో కూడిన విధానాలు, ఆలోచనలు, విధానాల ఆచరణాత్మకతను పరీక్షించడం వంటి ప్రయోగదశ నడుస్తుంది.

మలిదశ(2025-2030): ఈ దశలో, తొలిదశలో గుర్తించిన ఆలోచనలు, విధానాలకు మేధోసంపత్తి హక్కుల కల్పనకు, ప్రోటోటైప్‌ల రూపకల్పనకు, టెస్ట్‌బెడ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. విజయవంతమైన విధానాల అమలు, వాటి వాణిజ్యీకరణతో 6జీ సాంకేతికత జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అమలులోకి వస్తుంది.

- ఈ రెండు దశల భారత్ 6జీ మిషన్ అమలు పర్యవేక్షణ, ప్రామాణీకరణ, గుర్తింపు వంటి విధుల నిమిత్తం ఒక అపెక్స్ కౌన్సిల్ సైతం ఏర్పాటైంది.

3) భారత్ 6జీ కూటమి: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మక టెలికాం దౌత్యాన్ని కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ పట్టాలకెక్కించింది. దీనిలో భాగంగా బీ6జీఏ ఏర్పాటైంది. ఈ బీ6జీఏ పరిశోధన, సాంకేతిక బదిలీ సహకారం కోసం అంతర్జాతీయంగా పలు ఒప్పందాలు కుదుర్చుకుని దేశీయంగా 6జీ పరిశోధన, అభివృద్ధి వేగవంతం అవడానికి సహకరిస్తుంది.

- బీ6జీఏలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రమాణాల గుర్తింపు సంస్థలు వంటివి భాగస్వాములుగా/ సభ్యులుగా ఉంటాయి. బీ6జీఏ యూరప్‌కు చెందిన 6జీ స్మార్ట్ నెట్‌వర్క్స్ అండ్ సర్వీసెస్ ఇండస్ట్రీ అసోసియేషన్(6జీ-ఐఏ)తోనూ, ఫిన్‌లాండ్‌కు చెందిన ఔలు యూనివర్సిటీ 6జీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌తోనూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.
- అంతేకాక 2023లో జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా 6జీ రంగంలో అత్యున్నతస్థాయి పరిశోధనలు నిర్వహించడానికి అమెరికా-భారత్ మధ్య ఒప్పందం కుదిరింది.
- అదేవిధంగా భారత్ ఇప్పటికే 6జీ రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు లభించిన 127 కంటే ఎక్కువ పేటెంట్లను కలిగి ఉంది.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

6జీ టెక్నాలజీ - అంతర్జాతీయ కృషి

6జీ టెక్నాలజీ అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. దక్షిణ కొరియా తన 6జీ నెట్‌వర్క్ కె-నెట్‌వర్క్‌ను 2028 నాటికి ప్రారంభించేందుకు సమాయత్తమవుతోంది. యురోపియన్ యూనియన్ హెక్సాఎక్స్ పేరుతో చేపట్టిన 6జీ నెట్‌వర్క్ పరిశోధన కార్యక్రమం ఈ ఏడాది ముగియనుంది. జపాన్ ఇంటిగ్రేటెడ్ ఆప్టికల్, వైర్‌లెస్ నెట్‌వర్క్ ఫోరమ్ 6జీ నెట్‌వర్క్ కోసం విజన్ 2030ని కలిగి ఉంది. అదేవిధంగా భారత్, చైనాలు తమ తమ 6జీ నెట్‌వర్క్‌ల కోసం 2030ని మైలురాయిగా నిర్ణయించుకున్నాయి.

'6జీ' అభివృద్ధి చేయడంలో సవాళ్లు

1. భారత్, ఇతర అనేక దేశాల్లో 5జీ నెట్‌వర్క్ ఇంతవరకూ పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. పైగా దానికి మించిన వేగం గల 6జీని ప్రవేశపెట్టాలంటే సంబంధిత అవస్థాపన సౌకర్యాల పరంగా విశేష పెట్టుబడులు, వ్యవస్థల్లో మార్పులు భారీఎత్తున అవసరమవుతాయి.
2. వేగంతోపాటు వచ్చే భద్రత, ఇతర అంశాల పరమైన సమస్యల అంచనా, పరిష్కార యంత్రాంగ ఏర్పాటు కూడా అంతసులువుగా సాధ్యమయ్యే అంశాలు కావు. భారీఎత్తున అంతర్జాతీయ కృషి జరపాల్సి ఉంటుంది.
3. ప్రస్తుతం వినియోగదారుల వద్ద గల హ్యాండ్‌సెట్‌లు, ఇతరత్రా పరికరాలన్నింటినీ 6జీ కెపబిలిటీ(అనువర్తన) కోసం మార్చాల్సి ఉంటుంది. ఇది ఆర్థికంగా వినియోగదారులకు భారం అవుతుంది.

అయితే సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధిని ఆ కారణాలు చూపి అడ్డుకోజాలం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. కాకపోతే దాని దుష్ప్రభావాలను నివారించే సమాయత్తత కోసం ముందుగానే కృషి చేయాల్సి ఉంటుంది. కావాలంటే కృత్రిమమేధలో విశృంఖల అభివృద్ధిని నిలువరించేందుకు దాని వేగాన్ని తగ్గించే ప్రయత్నాలు జరిపినవిధంగా 6జీ దుష్ప్రభావాలను నివారించడానికి కూడా ఒక అంతర్జాతీయ అవగాహనతో ముందుకు వెళ్లవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్


చావు తెచ్చిన మామిడి పండ్లు



తెనాలి రామలింగ కవి ఒక రోజు కృష్ణ దేవరాయల కొలువుకు వెళుతూ ఉండగా భటుడు ఒకరు బంగారు పళ్లెం నిండా మామిడిపండ్లను వాటితో పాటు ఒక లేఖను లోపలికి తీసుకెళ్లడం చూసాడు. ఆ మామిడిపండ్ల తియ్యని వాసనకు తెనాలి రామలింగ కవికి నోరు ఊరింది. ఆ పండ్లలో ఒక పండైనా తింటే బాగుండు అనుకున్నాడు. రాజుగారికి ఆ పండ్లు అందగానే ఒక పండును తీసి కొంచెం కొరికాడు. అది చూసిన రాజు గారు 'నీకెంత ధైర్యం? నా కోసమని పొరుగు దేశపు రాజు కానుకగా పంపిన పండ్లను, అది కూడా నా అనుమతి లేకుండా తింటావా? నీ తల తీయిస్తాను' అని కోపంగా అన్నాడు. వెంటనే రామలింగ కవి గట్టిగా ఇలా అరవసాగాడు' ఇవేమి పండ్లురా బాబోయ్; ఒక్కపండు కొంచెం తిన్నందుకే నాకు చావు మూడింది. ఇక మొత్తం పండ్లు తిన్న మహారాజు గారికి ఏ గతి పట్టనుందో' అని కేకలు వేసాడు. ఆ చేష్టలకు నవ్వుకున్న రాయలు కవికి వేసిన శిక్షను రద్దు చేయడమే కాకుండా అతనికి కొన్ని మామిడి పండ్లను కూడా ఇచ్చి పంపాడు. తన చమత్కారంతో పండ్లను సాధించిన విధానం చూసి సభలో అందరూ రాజుగారితో పాటే వికటకవి తెలివికి నవ్వుకున్నారు.

10 తేడాలను కనిపెట్టండి





సరైన నీడను గుర్తించండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 406

8	4				6			9
2				3				
		3				4		2
		7			5		6	
5								7
	3		2			5		
6		2				8		
				1				3
3			7				2	4

సుడోకు - 405 సమాధానం

2	7	4	1	6	3	5	9	8
5	9	3	8	7	4	1	2	6
8	1	6	5	2	9	3	4	7
7	3	5	6	9	8	4	1	2
1	4	8	2	3	5	6	7	9
6	2	9	7	4	1	8	5	3
3	5	2	9	1	6	7	8	4
4	8	7	3	5	2	9	6	1
9	6	1	4	8	7	2	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.